ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




'మయూర నృత్యము'


(భారతనాట్య ప్రవీణురాలు శ్రీమతి సౌదామిని నర్తించినది.)

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4

దౌలత్ రాంగారి దక్షిణదేశ పర్యటనము




ఆల్వాయిలో కట్టనున్న, వ్యవసాయఎరువుల భారీ కర్మాగారముయొక్క ప్లానులను 'తిరువాన్కూరు ఎరువులు, రసాయినాలు" కంపెనీవారగు శ్రీ శేషశాయిగారు ఆహార మంత్రులకు విశదీకరించి చూపుతున్న దృశ్యం.




కేంద్ర, రాష్ట్ర ఆహారమంత్రులు, రాజన్ దౌలత్ రాంగారలు దక్షిణదేశ ఆహార పరిస్థితి క్లిష్టతలను నివారించుటకు తీవ్రసమాలోచనలు చేస్తున్నారు.




తిన్నెవెల్లీలో. "జొన్నమిఠాయిని" మంత్రిగారు పిల్లలకు పంచిపెడుతున్నారు.




దక్షిణ తిరువాన్కూరు సంస్థానగ్రామాలలో, దౌలత్ రాంగారు, పట్టంథానూపిళ్లెగారితో కలిసి, పల్లెవాగ్ల కుటుంబాలకష్టసుఖాలు తెలుసుకుంటున్నారు.



గౌ. దౌలత్ రాంగారు ప్రభుత్వభవనంలో ఫల ప్రదర్శనాన్ని ప్రారంభించారు.



చెన్నపట్నంలో అధినివేశప్రభుత్వ ఆహారశాఖామంత్రి శ్రీ జయరామ్‌దాస్ దౌలత్‌రామ్ గత శుక్రవారం అఖిలభారత ఫలప్రదర్శన ప్రారంభోత్సవం జరిపారు.





అనకాపల్లి కాల వృక్ష ఫలాలప్రదర్శనలలో, ఆహారమంత్రి ఫలాల నమూనాలను పరీక్షిస్తున్నారు

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

సంపుటము 40


సంచిక 38

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర వైశాఖ బహుళ దశమి బుధవారము



జైనదేవాలయము

శ్రావణ బెల్గోలాకొండ దిగువనున్న జైనదేవాలయము-దేవాలయములోనూ, ప్రక్కనున్న జైనస్వామిమఠములోను-చక్కని జైనశిల్పము లున్నవి.



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ నెల జూన్ 2-వ తేది బుధవారము

వామపక్షముల ఏకీకరణ

బ్రిటిష్ సామ్రాజ్య వాదమును ప్రతిఘటించుటలో దేశమందలి సామ్రాజ్యశత్రువులన్నిటిని సంఘటితపరచి, సామ్రాజ్య వ్యతిరేక పోరాటమును విజయవంతముగ కొనసాగించి భారతదేశమునకు సంపూర్ణస్వాతంత్ర్యమును సంపాదించిన భారత జాతీయ కాంగ్రెస్‌ను చైనా క్యుమింటాంగ్ పక్షముతో పోల్చినపుడు సోషలిస్టుపార్టీ కార్యదర్శి జయప్రకాశ నారాయణ్ గారి చైనారాజకీయ పరిజ్ఞానమును గురించిగాక, సోషలిస్టుపక్ష అంతిమ లక్ష్యమునుగురించియె కొన్ని సందేహములు యేర్పడెను. ప్రస్తుతము భారత రాజకీయములందు కాంగ్రెస్ భూమికను ప్రజలకర్థమగునట్లు చెప్పుటకు వారికి అంతకంటె ఉచితమైన ఉపమానము స్ఫురింపకపోవుట అందుకు కారణమై యుండవచ్చునని భావించిన వారికి బెల్గాములో సమావేశమైన సోషలిస్టుపార్టీ కార్యవర్గ తీర్మానము పార్టీ నిజధోరణిని, జయప్రకాశ నారాయణగారి ప్రకటనల ఆంతర్యమును కళ్లకు కట్టినట్లు బోధించినదని చెప్పవలెను.

కాంగ్రెస్ నుండి వైదొలగుటకు పూర్వమె అనేకమంది సోషలిస్టులు వామ పక్షమునకు చెందినవారమని చెప్పుకొనువారు కాంగ్రెస్ సూత్ర సిద్ధాంతములకంటె కాంగ్రెస్ నాయకత్వమునె ఎక్కువగ దూషించుచుండిరి. ప్రపంచమునందే రాజకీయ పక్షమునను లేనట్టి విమర్శనా స్వాతంత్ర్యము కాంగ్రెస్‌నందు గలదు. అదె కాంగ్రెస్ బలపడుటకు, బలహీనమగుటకు తోడ్పడినది తీవ్రవాద రాజకీయ పక్షములందు "డెమోక్రాటిక్ సెంట్రలిజం" పేరిట సభ్యులకు అధీన సంఘములకు స్వాతంత్ర్యము లేకుండ చేయుట జరుగుచున్నది. అటు ప్రతీప పక్షములందునను. ఇటు తీవ్ర వాద పక్షములందును కూడ అంగ నిర్మాణము, కార్యనిర్వహణ పద్ధతులు ఇంచుమించు ఒకే విధముగ నున్నవి కాని భారత జాతీయ కాంగ్రెస్‌నందు ఇట్టి పద్ధతులు ఇంతవరకును గోచరింప లేదనియె చెప్పవలెను. కనీసము కాంగ్రెస్ సోషలిస్టులు నాసికమహాసభలో తీర్మానము చేయువరకైనను కాంగ్రెస్ కిట్టి ప్రతీపవిధానము నాపాదింప వీలుగా నుండెనని అంగీకరింపవలెను.

సోషలిస్టులు కాంగ్రెస్ నుండి వైదొలగుటవలన కాంగ్రెస్ ప్రతీప సంస్థ కాలేదు అనియు, కాంగ్రెస్ ప్రతీపసంస్థ యగుటవలన సోషలిస్టులు కాంగ్రెస్ నుండి వైదొలగిరనియు సోషలిస్టుల ప్రకటనలు, ప్రసంగములు స్పష్టము చేయుచున్నవి. అంతియెగాక కాంగ్రెస్ తమ్ము బయటికి తరిమివేసినట్లును తాము కాంగ్రెస్‌ను వదలి వచ్చివేయలేదనియు కూడ కొందరు నాయకులు ప్రకటించిరి. ఈ విభిన్న ప్రకటనలలో ప్రజలు వాస్తవ స్థితినిగురించి కొంత ఆందోళన చెందుసమయమున "దేశములోని ప్రతీపశక్తులన్నిటికీ ఏకైకసంస్థ ఒకటి ఉన్నది. అది కాంగ్రెస్" అని సోషలిస్టు కార్యవర్గము ప్రకటించుటవలన అసలె చికాకుగనున్న భారత రాజకీయములు మరింత చికాకు అయినవి.

సోషలిస్టులు రెండు రంగములందు పోరాటమును సాగింపవలసిన వారగుచున్నారు. "ప్రతీపవర్గముల ప్రతినిధి సంస్థఅయిన కాంగ్రెస్"ను "పరాయి దేశంపట్ల భక్తికల్గి ప్రజాస్వామిక సామ్యవాదానికి విరుద్ధముగ కార్మిక నియంతృత్వమును బలపరచు కమ్యూనిస్టులను" ఎదుర్కొనవలసి వచ్చును. ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరము యూరపునందలి వివిధ దేశములలో సోషల్ డెమోక్రాటిక్ పక్షములు ఇట్టి సంకటస్థితియందె పడి తుదకు అధికారమును ప్రతీపశక్తుల పరమొనర్చుట జరిగినది. కమ్యూనిస్టులు సోషల్ డెమోక్రాట్లను ధనికవర్గములకంటె ప్రబలమైన శత్రువులుగ పరిగణించిరి. అది సహజమె. కమ్యూనిస్టులకు సోషలిస్టులు ఇంటి దొంగల వంటివారు. కనుకనే వీరు ప్రతీప శక్తులతో, నాజీవర్గాలతో చేతులుకలిపి సోషల్ డెమొక్రాట్స్‌కు యూరపు రాజకీయములందు స్థానము లేకుండ చేసిరి. ప్రథమ సంగ్రామానంతరము ఇట్లు జరిగిన అన్ని దేశములందును, ద్వితీయసంగ్రామానంతరము కమ్యూనిస్టులు అధికారమును కైవశము చేసుకొనకలిగిరి. మిగత దేశములందు మాత్రము వామ పక్షములు నిలబడ కలిగినవి. 1936, 37 సంవత్సరములందు "పాప్యులర్ ఫ్రంట్" పేరిట కమ్యూనిస్టులు వివిధ వామపక్షముల సంఘటితపరచుటకు ప్రయత్నములు జరిగినవి. అప్పట్లో ఒక్క బ్రిటిష్ కార్మికపక్షము మాత్రము కమ్యూనిస్టు పన్నుగడలకు ఆహుతిగాక తన వ్యక్తిత్వమును నిలుపుకొనెను. ఈ పాప్యులర్ ఫ్రంట్ ఉద్యమము విఫలమగుటతో కమ్యూనిస్టేతర వామ పక్షము లన్నియు బలహీనమగుట, కొన్ని దేశములందు నామరూపములు లేకుండపోవుట జరిగినది. భారత సోషలిస్టుపార్టీకి కూడ దాదాపు ఆ సంఘటన ఫలితముగనె గ్రహణము పట్టినది. దశాబ్దమైనను విడుపు పూర్తి కాలేదు.

ఈ సంఘటనలన్నిటిని గమనించి సోషలిస్టుపార్టీ ముందడుగు వేయవలసియుండును. దేశమందలి వామ పక్షముల సంఘటితపరచుటకు ఇదే తొలిప్రయత్నముగాదు. ఇటీవలకూడ సోషలిస్టు కమ్యూనిస్టు, ఫార్వర్డ్ బ్లాక్ పక్షములను కాంగ్రెస్‌ను ఎదిరించు కార్యక్రమమున ఏకము చేయుటకు కొన్ని ప్రయత్నములు జరిగెను. అట్టి ప్రయత్నములు విఫలమగుట సహజమే. కనుక కాంగ్రెస్ దేశమందలి ప్రతీపవర్గము లన్నింటికి ఏకైకసంస్థయని వామపక్షముల సంఘటితపరచుటకు జరుగు ప్రయత్నములు కూడ ఇట్టి ఫలితములనె పొందును. అంతేగాక ప్రథమ ప్రపంచసంగ్రామానంతరము మధ్యయూరపు దేశముల చరిత్ర భారతదేశమున పునరావృత్తము కాగల ప్రమాదముకూడ నున్నది. పైపెచ్చుగాక "దేశమున ప్రజాస్వామిక పరిపాలన సవ్యముగ సాగవలె నన్న రెండుపార్టీలపద్ధతే చాల ఉత్తమమైనది. దేశమున అనేక పార్టీలు ఉన్న ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలుగుతోందని కొన్ని యూరపుదేశములు ఋజువు చేయుచున్నవి" అని చేసిన హెచ్చరిక నిరుపయోగమై సోషలిస్టుపార్టీ కాంగ్రెస్ ప్రతిఘటనవిధానము నాంగ్లవపక్ష నిర్మాణమునకు దారి తీయగలదు. ప్రాతికూల్యమును ఒకపక్షము వాంఛింపనవసరము లేదు. దానిని సృష్టించుటకు ప్రయత్నముచేయ నవసరము లేదు. అవసరమునుబట్టి దానికదె ఏర్పడగలద. కనుక సోషలిస్టులు కేవలము కాంగ్రెస్‌కు ప్రతికూలపక్షము నొకదానిని నిర్మించుటకు గాక 'సమత్వము, సత్యము, అహింస,' లపై ఆధారపడి పదకాలాలు మనగల నూత్నసామాజిక వ్యవస్థానిర్మాణము లక్ష్యముగ గల పార్టీని ఏర్పరుపవలెను. అందుకై కృషి చేయవలెను.

మార్షల్ పథకవ్యామోహం

యూరపు పునరుద్ధరణకు, అమెరికా ప్రభుత్వ కార్యదర్శి జార్జి మార్షల్, ఒక పథకమును సూచించినది మొదలు, కొందరు భారతీయులు, అమెరికా ప్రభుత్వమునకు ఒక ఆసియా పునరుద్ధరణ పథకమును తయారుచేయవలసినదిగ సూచించుచుండుటనుబట్టి, వీరికి మార్షల్ పథకతత్వముగాని, అమెరికా ప్రభుత్వ ఉద్దేశ్యముగాని బోధపడలేదని స్పష్టమగుచున్నది. కేవలము పరోపకారబుద్ధితో అమెరికా ప్రభుత్వము ఈపథకమును ప్రతిపాదించి యుండలేదని, యూరపు రాజ్యములకు ఇంతటి ద్రవ్యసహాయము చేయుటలేదని, అమెరికా శాసనసభలు ఈ పథకమును ఆమోదించిన అనంతరము రిపబ్లికన్ పక్ష ప్రతినిధులు చేయుచున్న ప్రసంగములను, ప్రకటనలను పరిశీలించిన బోధపడగలదు.


ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరము ప్రపంచమందేర్పడిన ఆహార కొరతను అమెరికా తన రాజకీయాపేక్షల సాధించుటకు వినియోగించుకొనిన విషయము సువిదితమె. అదే విధముగ ద్వితీయ ప్రపంచసంగ్రామానంతర మేర్పడిన పరిస్థితులను స్వప్రయోజనమునకు ఉపయోగించుకొనుటకు తిరిగి అమెరికా యత్నించుచున్నదనుటకు ఈ మార్షల్‌పథకమె తార్కాణము. బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు తమ వ్యాపార, ఆర్థిక ప్రయోజనములను సాధించుకొనుటకు, తమ పారిశ్రామిక వస్తువులకు లాభకరమైన విక్రయశాలలను సంపాదించుకొనుటకు, రాజకీయాధికారమును వినియోగించుకొనుచు, ఆ అధికారమును నిలుపుకొనుటకు ప్రపంచ సంగ్రామములను కూడ సాగించియుండిరి.

లక్ష్యము ఒక్కటె అయినను అమెరికా ఆధునిక పరిస్థితులకు అనుకూలమైన విధానమును అనుసరించి, ప్రపంచము తనపై ఆధారపడి ఉండునట్లు చేసుకొనుటకు, మార్షల్ పథకమునను అమలు జరుపుచున్నది. ప్రతి ఒక్క దేశమును, ఫిలిప్పైన్ దీవుల స్థాయికి తెచ్చుటకు ప్రయత్నించుచుండెను. మార్షల్‌పథకము కేవలము రాజకీయపు ఎత్తు అనుటకు సందేహము లేదు. రాజకీయ దాస్యమునుండి విముక్తమైన ఆసియా దేశములు ఆర్థిక బానిసత్వమును అనుభవింపవలసియుండును. మార్షల్‌పథకము భారత దేశమునకు కూడ వర్తింపచేయవలెనను నినాదములు చేయువారు, కొంత రాజకీయ పరిజ్ఞానమును పొందుటయు, దూరదృష్టితో సమస్యల పరిశీలింప కలుగుటయు చేయవలసి యున్నది.

విప్రపంచం:

మార్షల్ స్మట్స్ పరాజయం

యూదురాజధాని టెల్ అవీవ్‌కు ప్రమాదస్థితి



దక్షిణాఫ్రికా యూనియన్ పార్లమెంటు ఎన్నికలలో ప్రధాని మార్షల్ స్మట్స్ ఘోరమైన పరాజయాన్ని పొంది తన సభ్యత్వాన్నే కోల్పోయి స్థానభ్రష్టుడు కావడం, ఆయన పక్షమైన యూనియనిస్టుపార్టీ తగిన సంఖ్యాబలంలేక పదచ్యుతిని పొందడం ఈ వారం జరిగిన అంతర్జాతీయ సంఘటనలలో అతి ప్రధానమైనట్టిది.

మార్షల్ స్మట్స్ ఆధ్వర్యంక్రింద ఇప్పటి వరకూ అధికారం చెలాయిస్తూవచ్చిన యూనియనిస్టుపక్షం, డా॥ మలాన్ నాయకత్వాన ప్రతికూలపక్షంగా పనిచేస్తున్న నేషనలిస్టుపార్టీ, ఆఫ్రికనర్‌పార్టీ, లేబర్‌పార్టీ అనే నాల్గూ ఎన్నికలలో పోటీచేసినవి.

ఎన్నికలలో వివిధపక్షాల బలాబలాలు ఈ విధంగా తేలినవి:

1. యునైటెడ్ పార్టీ ... 65 స్థానాలు.
2. నేషనలిస్టుపార్టీ ... 70 స్థానాలు.
3 ఆఫ్రికనర్‌పార్టీ ... 9 స్థానాలు.
4. లేబర్‌పార్టీ ... 6 స్థానాలు.

శాసనసభలో వున్న మొత్తం 153 స్థానాలలో మిగతా మూడుస్థానాలు దక్షిణాఫ్రికా ఆదిమనివాసులకు లభ్యమైనవి. ఈ ముగ్గురు ప్రతినిధులు నూతన ప్రభుత్వాన్ని ప్రతిఘటించడంలో యునైటెడ్‌పార్టీ (స్మట్స్‌పక్షం)తో సహకరించడానికే నిశ్చయించుకొన్నారు.

నేషనలిస్టుపార్టీ, ఆఫ్రికన్‌పార్టీ రెండూ కలసి పనిచేయదలచినందున డా॥ మలాన్‌పైనే నూతన ప్రభుత్వస్థాపన బాధ్యత పడింది. ఎన్నిక ఫలితాలు స్పష్టపడిన మరుక్షణంలోనే స్మట్స్ మంత్రివర్గం రాజీనామా ఇవ్వడమూ, క్రొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయవలసిందని దక్షిణాఫ్రికా గవర్నర్ జనరల్ డా॥ మలాన్‌ను ప్రిటోరియాకు ఆహ్వానించడమూ జరిగింది.

* * *

దక్షిణాఫ్రికా రాజకీయాలలో దాదాపు గత నలభైసంవత్సరాలనుంచీ ప్రధాన భూమికను నిర్వహిస్తున్న వయోవృద్ధు మార్షల్ స్మట్స్. విశేష అనుభవశాలి అని పేరుగాంచిన బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు. వయస్సు 78 సంవత్సరాలు. ప్రప్రథమంగా 1910 లో దేశీయ, రక్షణశాఖల మంత్రిగా దక్షిణాఫ్రికా ప్రభుత్వంలో ప్రవేశించాడు. తర్వాత 1919 నుంచి 1924 వరకూ, 1939 నుంచి నేటివరకూ ప్రధానామాత్యుడుగా పనిచేస్తూవచ్చాడు.

ఇదివరలో దక్షిణాఫ్రికా ప్రధానిగా పనిచేసిన కీ॥ శే॥ జనరల్ హెర్ట్‌జోగ్ ఆంతరంగిక కార్యదర్శి డబ్ల్యు. సి. డూప్లెసిస్ పోటీకి నిలవలేక మార్షల్ స్మట్సు ఓడిపోవడం వ్యక్తిగతంగానేకాక, స్మట్స్ నాయకత్వంవహించిన యూనియనిస్టుపార్టీ దృష్ట్యాకూడా ఘోరపరాజయమనే చెప్పాలి. డూప్లిసిస్ నేషనలిస్టు పార్టీకి చెందిన ఒక అనామక రాజకీయవేత్త. యూనియనిస్టుపార్టీకి చెందిన ప్రముఖులు—ఒకమంత్రికూడా—ఇదేవిధంగా నేషనలిస్టుపార్టీ అభ్యర్థులచేతులలో ఓడిపోవడం సంభవించింది. ఐరిష్ ఎన్నికలలో సంభవించిన డీవెలరా పరాజయం తర్వాత దక్షిణాఫ్రికా ఎన్నికలలో స్మట్సుపరాజయాన్నే చెప్పాలి.

* * *

స్మట్స్ పరాజయం, మలాన్ విజయం దక్షిణాఫ్రికా భారతీయులకు విభ్రమాన్ని కలిగించినవంటే ఆశ్చర్యపడవలసిందేమీలేదు. ఇటీవల కొన్ని నెలలగా డా॥ మలాన్ అధ్వర్యంక్రింద నేషనలిస్టుపార్టీ వారు దక్షిణాఫ్రికా భారతీయులపై విపరీతమైన వర్ణవిద్వేషప్రచారం చేశారు. అక్కడి భారతీయుల సమస్యను సవ్యంగా, సత్వరంగా పరిష్కరించడానికి వారందరినీ తిరిగి భారతదేశానికి పంపివేయడమే ఉత్తమ మార్గమని వీరి ఉద్దేశ్యం.

దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య పరిష్కారానికి నేషనలిస్టుపార్టీ నాయకుడు డా॥ మలాన్ తన పార్టీలక్ష్యాలను ఇదివరలో ఈవిధంగా నిర్వచించాడు: (1) దక్షిణాఫ్రికాలోవున్న భారతీయులందరినీ భారతదేశానికిగాని, మరే ప్రాంతానికైనాగాని పంపించివేయడం (2) దక్షిణాఫ్రికాలో ఒక రాష్ట్రంనుంచి మరొకరాష్ట్రానికి భారతీయులు వెళ్లడానికిగాని, దక్షిణాఫ్రికాకు కలసి రావడానికిగాని వీల్లేకుండా చేసి, అందుకుకావలసిన నిషేధాజ్ఞలను అమలు జరపడం (3) కేప్‌టౌన్ పట్టణప్రాంతంలోకే భారతీయులను రానివ్వకపోవడం (4) ఇతర జాతులవారున్న ప్రాంతాలలో భారతీయులు నివసించడానికి వీల్లేదనడం (5) తమ తమ నివాసప్రాంతాలలో తప్ప ఇతర ప్రాంతాలలో ఎక్కడ భారతీయులు వ్యాపారంచేయడానికి వీల్లేదని వారికి లైసెన్సు లివ్వకపోవడం. (6) భారతీయులకు ఇస్తున్నకుటుంబ భత్యాలను రద్దుచేసి వేయడం.

దక్షిణాఫ్రికాలోవున్న శ్వేతజాతివారిలో డా॥ మలాన్‌పార్టీ ఆశయాలు ఎంత విపరీతంగా నాటుకొనిపోయిందీ ఆయన విజయంవల్లనే ఊహించవచ్చు.

డా॥ మలాన్ పార్టీకి విజయం చేకూరినట్లు తెలియగానే అక్కడి భారతీయులు తమతీవ్ర ఆశాభంగాన్ని సైతంవిరమింగి, ఇకనైనా భారతీయ సమస్యకు న్యాయం సమకూర్చవలసిందని అర్థిస్తూ ఆయనకు ఒక అభినందన సందేశాన్ని పంపించారు. ఇది కేవలం లాంఛనప్రాయమైన సందేశం మాత్రమే. సభ్యమైనధోరణిలో శాంతియుతంగా తమ సమస్యను పరిష్కరిస్తాడనిగాని, అంత సులువుగా తమకు న్యాయం చేకూడుతుందనిగాని దక్షిణాఫ్రికా భారతీయులు ఆశించివుండరు.

* * *

"జాన్‌స్మట్స్‌కు ఇచ్చేవోటు జోస్టాలిన్‌కు ఇచ్చేవోటే; దక్షిణాఫ్రికాలో కమ్యూనిస్టు విప్లవానికి ఇచ్చేవోటే! పర్యవసానంగా దక్షిణాఫ్రికాలో నల్లజాతి రిపబ్లిక్ స్థాపనకు ఇచ్చేవోటే సుమా!"అనీ, "పాశ్చాత్య నాగరికతా రక్షణకే మీరు మీ వోటు ఇవ్వాలి,"అనీ, "తమ తమ సంతానాల భవిష్యత్ యోగక్షేమాలను కాంక్షించేవారైనా సవ్యమైన పక్షానికే వోటు ఇవ్వడానికి తలిదండ్రులు పూనుకోవాలి,"అనీ డా॥ మలాన్‌పక్ష అభ్యర్థులు వోటర్లను పురిగొలిపారు. ఈ విషప్రచారం వారి మస్తిష్కాలకు బాగా ఎక్కింది. మార్షల్ స్మట్స్‌కు వోటు ఇవ్వడం కమ్యూనిజముకు వోటు ఇవ్వడమే అయితే, ప్రపంచమంతా ఏనాడో కమ్యూనిజం మయం కావలసినది. అతనికంటె ఘనుడు అచంటి మల్లన్న అన్న సామెత గాంధర్యాధర్మ విచక్షణ చేయలేకపోవడంలో, వక్రదృష్టిని ప్రదర్శించడంలో మార్షల్ స్మట్స్‌కంటె డా. మలాన్ రెండాకులు ఎక్కువే చదివాడని చెప్పవలసివుంటుంది. ఐతే మార్షల్ స్మట్స్‌కు, డా. మలాన్‌కు ఒక్క వ్యత్యాసంమాత్రం లేకపోలేదు. మార్షల్ స్మట్స్ దక్షిణాఫ్రికా ప్రధానామాత్య పదవిలోవుండి పైకి ప్రజాస్వామ్యాన్ని, ఏకప్రపంచ నినాదాన్ని సమర్థిస్తూ, ధర్మపన్నాలన్నీ చదువుతూ భారతీయుల పట్ల జాతివిద్వేష బీజాలను నాటడమేగాక అవి మహావిషవృక్షంగా పరిణమించేటట్లు పెంచి పోషించాడు. ఈనాడు అక్కడి భారతీయులు ఆత్మగౌరవరక్షణార్థం, సాధారణ పౌరహక్కుల సాధనార్థం పడరానిపాట్లు పడేటట్లు చేశాడు. అంతేకాదు ఇండియా, పాకిస్థాన్, దక్షిణాఫ్రికాలు మూడూ చేరి భారతీయుల సమస్యను సామరస్యంతో పరిష్కారం చేసుకోవాలని ఐక్యరాజ్యసమితిచేసిన నిర్ణయాన్ని నిశ్శంకం బాహాటంగా ధిక్కరించాడు. అవిరళోత్సాహంతో సత్యాగ్రహోద్యమం సాగిస్తున్న భారతీయుల సహజహక్కులను తృణప్రాయంగా కాలరాస్తున్నాడు. ఇక పోతే, క్రొత్తప్రధాని కానున్న డా. మలాన్ తన మనోగతభావాలను ఎన్నడూ మరుగుపరచలేదు; పార్టీలక్ష్యాలను ఎన్నడూ దాచలేదు. దక్షిణాఫ్రికాకు ఆర్థిక సౌష్ఠవాన్ని అభ్యున్నతిని సాధించడంలో రక్తాన్ని ధారపోసిన భారతీయులను అక్కడినుంచి పంపించివేయడమే ఈ సమస్యా పరిష్కారానికి మార్గమని ఇతడు వాదిస్తున్నాడు.

* * *

ఈ పరిస్థితులలో మార్షల్ స్మట్స్ పతనం కావడంవల్లగాని, క్రొత్తగా మలాన్‌నాయకత్వం వహించినందువల్లగాని భారతీయులకు ఒరిగిందేమీ లేదు. డా॥ మలాన్ వైఖరి మొదటినుంచీ మనకు తేటతెల్లంగా తెలిసిందే వున్నది కాబట్టి దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య ఏదోవిధంగా—ప్రతికూలంగానైనా—పరిష్కరించుకోడానికి ఇక వీలువుతుందనీ ఆశించవచ్చునేమో. దక్షిణాఫ్రికా ప్రభుత్వంలో ఏర్పడిన ఆకస్మికమైన విపరీతమార్పులను భారతప్రభుత్వం జాగ్రత్తగా గమనిస్తూనే వున్నదనీ, అవసరమైన ఆందోళనకేమీ స్థానం ఇవ్వకూడదనీ ఢిల్లీ అధికార వర్గాలవారు అభిప్రాయపడుతున్నారు.

ఏది ఏమైనప్పటికీ అక్కడి భారతీయులు రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చెప్పినట్టు తమ సహజమైన హక్కులకోసం పట్టుదలతో అకుంఠితంగా ఉద్యమాన్ని సాగించవలసివుంటుంది. ఈ ఉద్యమ నిర్వహణంలో వారు ఇదివరకు కంటె ఇప్పుడు ఎక్కువగా కష్ట పరంపరను ఎదుర్కొనవలసి రావచ్చు. ఉద్యమ స్వరూపమే మారవచ్చు. దక్షిణాఫ్రికా జాతి విద్వేష సిద్ధాంతానికికూడా పర్యవసానంగా నాజీఫేసిస్టుసిద్ధాంతాలకు పట్టినగతే పట్టకమానదు. ఆత్మవిశ్వాసంతో మహాత్ముని ప్రబోధానుసారం పనిచేస్తే ఆఖరుకు విజయం భారతీయులదే అవుతుంది.

* * *

ఇప్పటికి దాదాపు మూడువారాల క్రితం ప్రారంభమైన పాలస్తీనా యుద్ధం ఆనాటి కానాడు అతిభయంకరంగా పరిణమిస్తున్నదేగాని త్వరలో పరిష్కారమయే సూచన లేవీ కనుపించడంలేదు. సంఖ్యాబలంలో తక్కువగా వున్నప్పటికీ యూదు సైనికులు అత్యంత ధైర్య సాహసాలతో అరబ్ మూకలను ప్రతిఘటిస్తూ నూతన యూదు రాజ్యాన్ని రక్షించుకుంటున్నారు. కేవలం సంఖ్యాబలమేగాక ఆధునిక అస్త్రసంపదగల అరబ్‌రాజ్య సైనికులు ఐక్యరాజ్యసమితి ఆదేశాలను సైతం లెక్కచేయకుండా మారణహోమం సాగిస్తూ, పురోగమిస్తున్నారు. పాత జెరూసలెంలో దాదాపు 12 రోజులపాటు హోరాహోరీగా పోరాడిన సుమారు 1,600 మంది యూదు సైనికులు విధిలేక మొన్న మే 28-వ తేదీన అరబ్ సేనలకు లొంగిపోవలసివచ్చింది. ఈ యూదు సైనికులలో కొంతమంది యూదు స్త్రీలు కూడా వున్నారు. యూదు సైనికుల లొంగుబాటుతో పాత జెరూసలెం పూర్తిగా అరబ్బుల హస్తగతమైంది. క్రొత్త జెరూసలెంమాత్రం ఇప్పటికీ యూదుల చేతులలోనే వున్నది. పాత జెరూసలెంలోకంటే మరీ ఘోరమైన, భయంకరమైన యుద్ధం క్రొత్త జెరూసలెంలో సాగవచ్చు. అక్కడి యూదులు అంత సులువుగా లొంగిపోవడం సంభవించదు. ట్రాన్స్‌జోర్డాన్ సేనలు మే 18-వ తేదీనే పాత జెరూసలెంలోనే ప్రవేశించి యూదు సేనలను ఒకచోటుకు నెట్టివేసి చుట్టుముట్టినవి. ఒకవైపున అరబ్ సైనికుల అగ్నివర్షంవల్లా, మరొకవైపున ఆహారపదార్థాల కొరతవల్లా, మంచి నీరు సైతం లేనందువల్లా పాత జెరూసలెంలోవున్న దాదాపు రెండువేలమంది యూదు సైనికుల పరిస్థితి అతిదుర్భరంగా పరిణమించి లొంగిపోక తప్పలేదు. ట్రాన్స్‌జోర్డాన్ రాజు అబ్దుల్లా జెరూసలెంలో విజయప్రవేశం జరిపాడు. చక్రబంధంనుంచి తమవారిని విడిపించడానికి యూదులు లోపలినుంచీ వెలుపలినుంచీకూడా అనేక ఎదురుదాడులు జరిపారుగాని ప్రయోజనం లేకపోయింది. రాజధాని అయిన టెల్ అవీవ్ నుంచిఅదనపుబలాలనుతీసుకొనిరావడానికికూడా యూదులు ప్రయత్నించారుగాని వాటిని అరబ్ సేన లాట్రున్ పట్టణంవద్ద ఎదిరించింది. ఇది టెల్ అవీవ్‌నుంచి జెరూసలెంకు వచ్చే ముఖ్యమైన సప్లయి రవాణామార్గంమీదవున్న పట్టణం. ప్రస్తుతం ఈ పట్టణంవద్ద భయంకరమైన పోరాటం సాగుతున్నది.

యూదు రాజధాని టెల్‌అవీవ్‌కు 5 మైళ్ళ దూరంలోవున్న కిల్ క్యా—నే పట్టణంకూడా ఇరాక్ సేనల వశమైందంటే, అరబ్బులు యూదు రాజధానికి కనుచూపు మేరలోకి చేరగలిగారన్నమాట. ఇప్పుడు క్రొత్త జెరూసలెంపైనకూడా ముట్టడి ప్రారంభమైంది. రాజధాని టెల్‌అవీవ్ పైకి అరబ్బులు కత్తెరవ్యూహం పన్ని యుద్ధం సాగిస్తున్నారు. ఈ వ్యూహం కొనసాగితే యూదురాజ్యం "ఇస్రాయల్" రెండుముక్కలుగా చీలిపోవచ్చు. ఇదీ నేటి యుద్ధపరిస్థితి.

* * *

పాలస్తీనాలో ఒకవైపు యుద్ధం విజృంభించి సాగుతూనేవున్నది; మరొకవైపున భద్రతామండలి అంతులేని చర్చలు జరుపుతూ యుద్ధ విరమణ అవసరమని ఆదేశంమీద ఆదేశాన్ని జారీచేస్తునేవున్నది. గతవారాంతాన భద్రతామండలి ఇచ్చిన 48 గంటల వ్యవధినీ, అరబ్ రాజ్యాల కోరికపై మరొక 48 గంటలు పొడుగించినా ఆదేశం ఫలించలేదు.

బ్రిటిష్‌విదేశమంత్రి ఎర్నెస్ట్ బెవిన్‌కు ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ట్రిగ్వేలీ తెలియజేసినట్లు సమితి భవిష్యత్తు అంతా పాలస్తీనా సమస్యాపరిష్కారంమీదనే ఆధారపడివున్నది. ఈ సమస్యను జయప్రదంగా పరిష్కరించలేకపోయినట్లయితే, ఇప్పటికే గ్రీస్ సంక్షోభం, అగ్రరాజ్యాల స్వీయప్రాబల్యసాధనకు ఒక ఉపకరణంగా, పరిణమించిన విశ్వరాజ్యసమితి నామరూపాలు లేకుండా పోయినా పోతుంది. పాలస్తీనా విషయంలో బ్రిటిష్ ప్రభుత్వధోరణి తనకు ఆందోళన కలిగిస్తున్నట్లుకూడా ట్రిగ్వేలీ, బెవిన్‌కు స్పష్టపరిచాడు.

* * *

భద్రతామండలి 48 గంటలలోగా పాలస్తీనాలో యూదు అరబ్‌పక్షాలు యుద్ధ విరమణను అమలు జరపాలని ఇచ్చిన ఆదేశాన్ని అరబ్బులు శిరసావహించినట్లయితే, తామూ నిరాక్షేపణగా శిరసావహిస్తామని యూదులు మండలికి సమాధానం పంపారు. యూదు రాజ్యవిదేశరక్షణశాఖామంత్రి అయిన మోషీ షెర్టాక్ ఈ సమాధానాన్ని అందజేశాడు. అరబ్‌రాజ్యప్రముఖులు ట్రాన్స్‌జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో మండలి ఆదేశంపై దీర్ఘచర్చలు జరిపి ఆకరకు అందని పొకడు పొందని జవాబును మండలికి పంపించారు. మండలి ఆదేశాన్ని అరబ్‌రాజ్యాలు పూర్తిగా అంగీకరించనూ లేదు; పూర్తిగా తోసి వేయనూలేదు. యుద్ధవిరమణ విషయమై సంప్రతించడానికి సిద్ధంగా వున్నామని మాత్రం అరబ్ ప్రముఖులు అన్నారు.

(20 వ పేజీ చూడుడు)



౧౭

కాలం ఒకొక్కప్పుడు పక్షిలాగ ఎగిరిపోతుం దన్న సంగతి అందరూ ఎరిగినదే. ఒకొక్కప్పుడు వానపాములా మెల్లగా పాకుతుంది. కాని కాలం వేగంగా పరుగెత్తుతోందో, మెల్లగా పాకుతోందో గుర్తించడానికికూడా సావకాశంలేని స్థితిలో ఉన్న మానవుడు ముఖ్యంగా ఎక్కువ సుఖంగా ఉన్నాడన్న మాట. బజరోవ్ ఆర్కాడీలకు ఒక పదిహేను రోజులపాటు ఓడిన్ట్సోవ్ సతి ఇంట్లో కాలం అవిధంగా గడిచిపోయింది. ఆమె తన ఇంటి వ్యవహారాల్లోనూ, తన జీవితంలోనూ అమలులో పెట్టిన సక్రమమయిన పద్ధతి దీనికొంతకారణం. ఆమె ఈ పద్ధతికి తుచ తప్పకుండా కట్టుబడి ఉండేది, ఇతరులను కట్టుబడేటట్టు చేసేది. ఏసమయంలో జరగవలసిన పని ఆ సమయంలో జరగవలసిందే. ఉదయం, సరిగా ఎనిమిదిగంటలకి అందరూ టీ తాగడానికి కలిసేవారు. టీ అయినతరవాత భోజనాలవేళవరకూ ఎవరికి ఇష్టంవచ్చిన పని వారు చేసేవారు. గృహ యజమానురాలు తన వ్యవహారనిర్వాహకుడితో కూర్చుని జమీవ్యవహారాలు చూసుకునేది,(జమీ అంతా కమతానికి ఇచ్చివేశారు.) గుమాస్తాతోటీ, గృహరక్షకుడితోటీ ఇంటి వ్యవహారాలు చర్చించేది. భోజనానికి ముందు కొంతసేపు సంభాషణతోనో, ఏదన్నా చదువుతోనో కాలక్షేపం చేసేవారు. సాయంకాలం, విహారానికి పోవడంగాని, పేకాడ్డంగాని, సంగీతంగాని ఉండేది. రాత్రి పదిన్నరకి ఆనాసర్గీవ్నా తన గదిలోనికి వెళ్లిపోయి, మరునాటికి అవసరమయిన ఆదేశాలను ఇచ్చి నిద్రపోయేది. కొంత ఆడంబరంగా ఉండే ఈ నిర్దుష్టమయిన క్రమం బజరోవ్ కి సరిపడలేదు. "పట్టాల మించి రైలు నడిచినట్టు," ఉందని అనేవాడు—సేవకుల దుస్తులలో ఆబానిసలు, ఆ గుమాస్తాలు, వీళ్లని చూస్తే ప్రజాస్వామ్యసిద్ధాంతాలతో శ్రుతికలిసిన అతనిహృదయానికి ఆఘాతం తగిలేది. అంతవరకూ వెళ్లినతరవాత, ఇంక ఇంగ్లీషుపద్ధతిగా, తెల్లటి మెడపట్టీలు, నల్లటి తోకకోట్లు ధరించి చేస్తూండవచ్చు భోజనాలు! ఆనాసర్గీవ్నాతో ఒకసారి అతను ఈ విషయమై స్పష్టంగా అనేశాడు. ఆమెతో ఎవరిహృదయంలో ఉన్నది వారు స్పష్టంగా చెప్పడానికి వెనుదీయనక్కరలేదు. ఆమె అంతా వింది. ఆమె ఇలా అంది: "మీదృష్టినించి మీరు చెప్పినదంతానిజం. ఆ విషయంలో నేనింకా పాతకాలపు మర్యాదలకు కట్టుబడ్డ ఆస్త్రీనేమో. కాని పల్లెపట్టుల్లో బతకాలంటే ఈ క్రమపద్ధతి తప్పనిసరి. లేకపోతే సోమరితనంవల్ల పుట్టే మానసిక గ్లాని మన్ని తినివేస్తుంది." తరవాత ఈసంభాషణే జరగనట్టు తన పద్ధతిలో తను అంతా నడిపించింది. బజరోవ్ కి ఇది నచ్చలేదు. కాని అన్నీ పట్టాలమీద రైలు నడిచినట్టు," నడవడంవల్లనే ఆ ఇంట్లో అతనికీ, ఆర్కాడీకి కాలం అంత సునాయాసంగా గడిచిపోతోంది. ఇవన్నీ అల్లా ఉండగా నికోల్స్కి వచ్చినదగ్గరనించీ ఇద్దరు యువకుల్లోనూ ఒక మార్పు వచ్చింది. ఆనా సర్గీవ్నా, బజరోవ్ అంటే ఎక్కువ కుతూహలాన్ని కనబరుస్తోంది, అతనితో సాధారణంగా ఆమెకు అభిప్రాయభేదాలువచ్చినా. అతనిలో ఇదివర కెన్నడూలేని అశాంతి ఏదో పుట్టుకొని వస్తోంది. అతనికి అతితొందరగా కోపం వస్తోంది. చిరాకుగా ఉన్నట్టు కనిపిస్తాడు. మాట్లాడటం మానివేస్తాడు. ఒకచోట స్థిమితంగా కూర్చోలేడు. ఏదో రహస్యమయిన ఆకాంక్ష అతన్ని ఆవహించినట్టు కనిపిస్తాడు. ఆర్కాడీ తను ఓడిన్ట్సోవ్ సతిని ప్రేమిస్తున్నట్టు గట్టిగా నిశ్చయించుకున్నాడు. మెల్లని ఆవేదనకు వశుడై అలా కూర్చుంటాడు. కాని ఆ ఆవేదన అతన్ని కాట్యాతో చనువుగా ప్రవర్తించకుండా అడ్డుపెట్టడంలేదు. అంతేకాదు, ఆమెతో ఆదరపూర్వకంగా, స్నేహంగా ప్రవర్తించేటట్టు అతన్ని ప్రోత్సహిస్తోందికూడా. "ఆమెకు నన్ను అర్థంచేసుకునే శక్తి లేదు. పోనీ.........కాని ఆమె చాలమంచిది. నాకు ఏవగింపు కలిగించదు," అని అతను అనుకునేవాడు. అప్పుడు మళ్లీ అతని హృదయంలో ఉదాత్తమయిన తియ్యని ఉద్రేకాలు రేకెత్తేవి. అతడు తనతో చనువుగా ఉండడం అతని ఇతర ఆవేదనలనించి తేరుకోడంకోసమేనని, కాట్యా అస్పష్టంగా గ్రహించింది. కాని ఆకారణంచేత ఆమె అతనినించి విడిపోలేదు. సగం సంకోచంతో, సగం పరస్పరవిశ్వాసంతో కూడుకున్న తన చనువును అతనికి కలిగిస్తోనే ఉంది. ఆనా సర్గీవ్నా సాన్నిధ్యంలో వా రిద్దరూ మాట్లాడుకునేవారు కారు. అక్కగారి నిశితదృష్టి తనమీద పడేసరికి కాట్యా తనలోకి తను ముడుచుకుపోతుంది. ప్రయణంలో బంధితుడైన యువకుడికి సహజమయినట్టుగానే, ఆర్కాడీ తన ప్రణయకేంద్రకమయిన వ్యక్తి దగ్గరగా నున్నప్పుడు ఇంక ఇతరవస్తువులను చూసేవాడు కాడు. కాట్యాతో ఏకాంతంగా ఉన్నప్పుడు అతనికి చాలా కులాసాగా ఉండేది. ఓడిన్ట్సోవ్ సతి దృష్టిని ఆకర్షించగల శక్తి తనలో లేదని అతనికి తెలుసును. ఆమెతో ఏకాంతంగా ఉన్నప్పుడు అతన్ని అమితమయిన సంకోచం ఆవరించి ఏమీ తోచనిచ్చేదికాదు. ఆమెకూ అతనితో యేమి మాట్లాడాలో తోచేదికాదు; అతను బొత్తిగా కుర్రవాడు ఆమెదృష్టిలో. కాట్యాతో మాత్రం అతనికి చనువు బాగా కలిసింది. ఆమెను కొంచెం చిన్నపిల్లను చూసినట్టు చూసేవాడు. సంగీతం, నవలలూ, పద్యాలూ ఇటువంటి చిల్లర విషయాలలో ఆమెకు ఏరకమయిన అభిరుచి ఉందో చెప్పమని ప్రోత్సహించేవాడు. కాని ఈ చిల్లరవిషయాలలోనే తనకూ అభిరుచి ఉందన్న సంగతి అతను గ్రహించలేదు. తన మట్టుకు తను కాట్యా అతన్ని ఆవేదననుంచి రక్షించడానికి ప్రయత్నించలేదు. కాట్యాతో ఆర్కాడీకి సుఖంగా ఉండేది; ఓడిన్ట్సోవ్ సతితో బజరోవ్ కి సుఖంగా ఉండేది. అంచేత తరుచుగా కొంత కలిసి ఉన్నతరువాత వారు జంటలుగా విడిపోయి ఎవరిత్రోవను వారు పోయేవారు; అందులో విహారానికి పోయినప్పుడు ముఖ్యంగా. కాట్యాకి ప్రకృతి అంటే ఎంతో ప్రేమ, ఆర్కాడీకి అంతే. బజరోవ్ లాగే ఓడిన్ట్సోవ్ సతికికూడా ప్రకృతి సౌందర్యం అంటే అంత మోజు లేదు. ఇద్దరు స్నేహితులు ఇల్లా విడిపోయి ఉంటుండడంవల్ల కొన్ని ఫలితాలు కలగకపోలేదు. వారిద్దరిమధ్య ఉన్న అనుబంధంలో కొంత మార్పు వచ్చింది. ఓడిన్ట్సోవ్ సతిని గురించి బజరోవ్ ఆర్కాడీతో మాట్లాడ్డం మానేశాడు; ఆమె "భాగ్యవంతుల పద్ధతులను" విమర్శించడంకూడా మానేశాడు. కాట్యానిమట్టుకు ఇదివరకులాగే పొగిడేవాడు, ఆమెలో ఉన్న పలచని ఉద్వేగాలిని అరికట్టాలని సలహా ఇస్తుండేవాడు. కాని ఆపొగడ్త తొందరగా ఆగిపోయేది. ఆ సలహా పొడిపొడిగా ఉండేది. మొత్తం మీద ఇదివరకు కంటే ఆర్కాడీతో అతనిసంభాషణలు క్లుప్తంగా అయిపోయాయి. ......అతన్ని తప్పించుకు తిరగాలన్నట్టు ఉండేవాడు; అతనితో ఉన్నప్పుడు అస్థిమితంగా ఉండేవాడు.

ఆర్కాడీ ఇదంతా గుర్తించాడు. కాని అతను పైకి ఏమీ అనలేదు.

ఈ "శాంతనాదనికి" కారణం, ఓడిన్ట్సోవ్ సతి బజరోవ్ లో కలిగించిన హృదయస్పందనం. ఆస్పందనం అతనికి పిచ్చెక్కిస్తోంది, అతన్ని బాధపెడుతోంది. ఎవరన్నా అతనిలో కలుగుతున్న మార్పునుగురించి ఏమాత్రమయినా సూచనగా అతనితో అన్నట్లయితే అతను అపహాస్యాన్ని సూచిస్తూ నవ్వి ఉండేవాడు. సూచించినవారిని దూషణపూర్వకంగా ఎగతాళి చేసి ఉండేవాడు. స్త్రీ అన్నా స్త్రీసౌందర్యమన్నా బజరోవ్ కి ఎంతో ప్రేమ. కాని ఆదర్శప్రణయం కాల్పనికప్రణయం, వీటిని వట్టి పిచ్చిభ్రమలనీ, చేతకానితనమనీ అనేవాడు. ఈ ఉదాత్తానురాగాలనన్నిటినీ,ఒక జబ్బుగానో, ఒక వ్యక్తిలో ఎదో లోపంగానో పరిగణించేవాడు. టోగెన్‌బర్గునీ, అతనిలాగ భావగీతాలను పాడుకునే భావకవుల్నీ ఎందుకు పిచ్చిఆస్పత్రిలో పెట్టరో తనకి ఆశ్చర్యంగా ఉందనీ అంటుండేవాడు. "ఒకస్త్రీ నిన్ను ఆకర్షిస్తే," అతను సాధారణంగా అంటుండేవాడు. "ఆ స్త్రీని పొందడానికి ప్రయత్నించు. అది సాధ్యంకాకపోతే—పోనీ వెనక్కితిరిగి వెళ్ళిపో—సముద్రం లో కావలసినన్ని మంచిచేప లుంటాయి." ఓడిన్ట్సోవ్ సతి అతన్ని ఆకర్షించింది. ఆమెనుగురించిన ప్రవాదాలు, ఆమె ఊహల్లో ఉన్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, అతనియెడల ఆమె స్పష్టంగా చూపిస్తున్న సుముఖత్వం, అన్న అతనికి అనుకూలంగా ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఆమెనించి విముఖుడయిపోవడానికి తగినశక్తిమాత్రం అతనిలో లేదు. ఆమెనుగురించి స్మరిస్తే చాలు అతని రక్తం వేడెక్కిపోయేది. అతని రక్తాన్నయితే అతడు వేడెక్కకుండా అపుకోగలడు. కాని అతనిలో ఒక కొత్తది ఏదో వేర్పు పాదుకుంటోంది—అది తనలో ఎన్నడూ పుట్టదని అతడు వాదించేవాడు, దాన్ని అపహసించేవాడు, దాన్నిచూస్తే అతనిలో గర్వంఅంతా తిరుగుబాటు చేస్తుంది. ఆనా సర్గీవ్నాతో మాట్లాడేటప్పుడు, ఆదర్శాలమీద తన కున్న అసహ్యాన్ని మామూలుకంటే గట్టిగా వ్యక్తపరిచేవాడు. కాని ఒక్కడూ ఉన్నప్పుడు ఆ ఆదర్శత్వం తనలోనే అతనికి కపించేది, అతనికి చిరాకు కలిగేది. అటువంటప్పుడు దగ్గరగాఉన్న చిట్టడవిలోకి ఒంటిగా పోయేవాడు, పెద్ద అంగలు వేసుకొంటూ వేగంగా నడిచేవాడు. అడ్డుతగిలిన రెమ్మల నన్నింటినీ చేత్తో ఛేదించివేసేవాడు, ఆమెనూ తన నూతనలో తిట్టుకునేవాడు. ఆవరణలో నున్న గడ్డివాము పక్కని వెల్లగిల పడుకుని, కళ్లు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించేవాడు. కాని తరుచు నిద్రపట్టేదికాదు. చటుకుని అతని ఊహాలో ఆ పరిశుద్ధమయిన చేతులు తన మెడచుట్టుకుని ప్రత్యక్షమయేవి, గర్వంతో బిగిసిన ఆ పెదవులు అతన్ని ప్రతిచుంబించేవి. తెలివితో మెరిసే ఆ కళ్లలో అపరూపమయిన మెత్తదనం నిండిపోయేది—అవును, మెత్తదనం. ఆ చూపులు అతని కళ్ళలోకి చూసేవి. అతని తల తిరిగిపోయేది. ఒక ముహూర్తంపాటు అతను మైమరచేవాడు. చివరకి అతనిలో చిరాకు పొంగవచ్చేది. ఈ "సిగ్గుచేటయిన" ఆలోచనలలో పడి. తనకి తానే దొరికిపోయేవాడు — ఏదో ఒక దుష్టశక్తి తనని ఆవహించినట్టు అతనికి అనిపించేది. ఓడిన్ట్సోవ్ సతిలోకూడా ఏదో ఒక మార్పు కలుగుతున్నట్లు అప్పుడప్పుడు అతనికి అనిపించేది — ఏదో చిత్రమైన విశేషం ఆమె ముఖంలో వ్యక్తమవుతున్నట్టు, బహుశా ఆమె కూడా...... కాని అంతవరకూ వచ్చినతరువాత అతని కాలితో నేలను గట్టిగా తన్నేవాడు, పళ్లు కొరికేవాడు, పిడికిలి గట్టిగా మూసేవాడు.

కాని బజరోవ్ పూర్తిగా పొరబడలేదు. ఓడిన్ట్సోవ్ సతి మనస్సుని అతను ఆకర్షించాడు. అతనంటే ఆమెకు కుతూహలం కలిగుంది. అతన్ని గురించి చాలాసేపు తలుచుకుంటూ ఉండేది. అతను లేనప్పుడు ఆమెకు తోచకపోలేదు; అతనికోసం ఆమె ఆదుర్దాగా ఎదురుచూడ్డమూ లేదు. కాని అతను రావడంతోటే ఆమె ఎక్కువ ఉత్సాహంగా ఉండేది. అతనితో ఏకాంతాన్ని ఆకాంక్షించేది. అతనితో సంభాషణ ఆమెకు ఆహ్లాదాన్ని కలిగించేది. అతడామెకు చిరాకు కలిగించినాసరే; ఆమె అభిరుచినీ, సంస్కారాన్నీ అవమానించినాసరే; అతన్ని కదిపి, తన్నుతాను పరిశీలించుకోడానికి ఆతురపడుతోందా అన్నట్టు ఉండేది.

తోటలో ఆమెతో నడిచి వెడుతూ, అతను అగి చటుకుని ఎవరిమీదో కోప్పడుతున్న గొంతుకతో, తన తండ్రి దగ్గరకు త్వరలో వెళ్ళిపోవాలని అన్నాడు ......ఆమెముఖం వెలవెలబారింది, ఏదో బాధ కలిగించినట్టుగా—ఎంతో బాధ. ఆ బాధకు అర్థమేమిటని ఆమె తరువాత చాలాసేపు వింతగా ఆలోచిస్తూ కూర్చుంది. ఆమెకు పరీక్ష చేద్దామనే అభిప్రాయంతో బజరోవ్ ఆ విషయమయి చెప్పలేదు—ఆమె ఆ వార్త విని ఏమంటుందో చూడాలనీ అతనికి లేదు. అతను ఎన్నడూ "చమత్కరించడు." ఆనాటి ఉదయాన్ని తన తండ్రిదగ్గర పనిచేస్తున్న గృహోద్యోగితో అతను మాట్లాడాడు. అతని పేరు టిమొఫిచ్, బజరోవ్ ని చిన్నతనంలో ఎత్తుకునేవాడు. అతడు పిట్టవంటి ముసిలి మనిషి. ఎంతో అనుభవమూ, సూక్ష్మమైన తెలివీ గలవాడు. అతని జుట్టు లేతపసుపుగా మారిపోయింది. ఎర్రటి ముఖం వాడిపోయింది, లోతుకి పోయిన కళ్లలో చిన్న తడిని గనిగలాడుతోంది. అతను అకస్మాత్తుగా తన పొట్టి పై కోటుతో, తోలు పటకాతో, నల్లటి జోళ్లతో బజరోవ్ ముందు ప్రత్యక్షమయాడు.

"ఏమోయి, తాతా! ఎల్లాఉన్నావు," అన్నాడు బజరోవ్.

"తమరు కులాసాగా ఉన్నారా యవ్గనీ వాసిలిచ్?" ఆ ముసలితాత అడిగాడు. సంతోషంతో అతని ముఖము వికసించింది. ఆ వికాసంతో అతని ముఖమంతా ముడతలు పడిపోయింది.

"ఎందుకు ఇల్లా వచ్చావు? వాళ్ళు నాకోసం పంపారా?"

"ఇంకానయం బాబూ. అల్లా ఎందుకు పంపుతారు?" టిమోఫిచ్ మెల్లగా అన్నాడు. (ఇంటి దగ్గరనుంచి బయలుదేరేముందు యజమాని జ్ఞాపకముంచుకో మన్నదంతా అతనికి జ్ఞాపక ముంది.) "పట్టణంలో పనిమీద మమ్మల్ని పంపించారు. దారిలో ఊరికే ఇల్లా వచ్చాం—అంటే తమ దర్శనం చేసిపోదా మని......ఇంకా నయం, తమరిని తొందరచేస్తామా?"

"చాల్లే అబద్ధాలు చెప్పకు," బజరోవ్ అతనిదోరణిని తుంచివేశాడు. "ఇది పట్టణానికి వెళ్ళే దార్లో ఉందని నాకు చెపుతున్నావా?" టిమోఫిచ్ కొంచెం సందేహించాడు, సమాధానం చెప్పలేదు. "నాన్న కులాసాగా ఉన్నాడా?"

"ఆ భగవంతుడి దయవల్ల."

"మా అమ్మ?"

(19 వ పేజీ చూడుడు)

నీలాపనిందలు

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

...ట్లల్లో కొన్ని గౌరవాపాదకాలుగానున్నూ, కొన్ని లాఘవాపాదకాలుగానున్నూ, కొన్ని ఉభయాపాదకాలుగానున్నూ వుంటాయి. శ్రీ శంకరాచార్యులవారు మద్యం పుచ్చుకోవడానికి సంబంధించిన కథ ఒకటి వుంది. చాలామంది చెప్పుకుంటూవుంటారు. శిష్యులుకూడా వారిని అనుసరించి—"మహాజనో యేన గతస్స పంథాః" కనక మద్యపానం మొదలు పెట్టేటప్పటికి ఆచార్యులవారు దాన్ని వారించడానికి వొక కంచరిదుకాణంలో కరుగుతూ వున్న సీసాన్ని కొంత మంచినీళ్ళప్రాయంగా గడగడ తాగి మిగిలినదాన్ని శిష్యులకి యియ్యబోయేటప్పటికి యే శిష్యుడున్నూ దాన్ని పరిగ్రహించక పాఱిపోయారనిన్నీ, తద్ద్వారాగా ఆ శిష్యులకు బుద్ధి వచ్చి మద్యపానాన్ని మానడం తటస్థించిందనిన్నీ చెప్పుకుంటారు. యిది నిజమైనదే అయితే నీలాపనిందలలో చేరదు. కానిపక్షంలో—అనగా కల్పితమే అయితే శంకరాచార్యుంవారియందు 'కర్తుమకర్తుమన్యథా కర్తుం సమర్థత్వాన్ని'— ఆపాదించే వుద్దేశమే కాని యీ కథలో దురుద్దేశం లేశమున్నూ లేదు. బాగా ఆలోచిస్తే యీ కల్పనలు చేసేవారిలో సదుద్దేశపరులున్నూ వుంటారు; దురుద్దేశపరులున్నూ వుంటారు. వారి వారి వుద్దేశానుసారంగా వారి వారి కథాకల్పనలు వుంటూ వుంటాయి. యేదో మహత్తు వుండడానికి అవకాశం వున్నవాళ్ళ విషయంలో యీలాటి యితిహాసాలు పరంపరగా వస్తూ వుండడంచేతనే అనుకుంటాను, యిటీవల సామాన్యవ్యక్తులను గుఱించికూడా యీలాటివి కల్పన చేస్తారు. యివి పామరముఖతః రావడమూ వుంది; పండితముఖతః రావడమూ వుంది. మొదటిదానికంటే రెండోదానియందు ప్రామాణ్యం యెక్కువ వుంటుందని చెప్పనక్కఱలేదు. కాని వారుకూడా కొందఱు అతిశయోక్తికల్పనలు చేస్తూనే వుంటారని నా అనుభవంలో వున్నది వొకటి చూపుతాను.

నేను కావ్యాలను చదువుకొనే రోజుల్లోది యీ కథ; కాని నాకు షష్టిపూర్తి దాటిన తరవాత బయలుపడింది. లంక బ్రహ్మసోమయాజులు అనే వొకశిష్యునివల్ల విన్నాను. దానిస్వరూపం యిది: నేనేమో, గురువుగారివద్ద పాఠం కంగా బంగా చదవడమేగాని ఆ పాఠాన్ని వర్ణించడమంటూ వుండేదే కాదనిన్నీ, దాన్ని కనిపెట్టి వకనాడు ఆ గురువుగారు తూకలేసేటప్పటికి—"అయ్యా! నే చదువుకొనే పుస్తకంలో నన్నెక్కడ అడుగుతారో, అడగండి" అన్నాననిన్నీ, వారు అడిగారనిన్నీ, వందలకొలది శ్లోకాలు సవ్యాఖ్యానంగా వొప్పజెప్పాననిన్నీ వొక గురువుగారు చెప్పినట్లు ఆ సోమయాజులు నాతో అనగా విని, యిది కేవలమూ ఆ గురువుగారికి నాయందు వుండే అనుగ్రహాతిశయంగా భావించి—"నాయనా, యిది నిజం కాదు. నా పాఠమంటు నేనెన్నడూ అశ్రద్ధగా వుండడమంటూ లేదు. విశేషించి వర్ణన లేకుండానే నాకు శ్లోకవ్యాఖ్యానాలు స్వాధీనం కావడంమాత్రం నిజం. పై కథ దాన్ని అనుసరించి పుడితే పుట్టిందేమో? కాని నిజంమాత్రం కాదు." అని అతనితో చెప్పివున్నాను. అతడు విశ్వసించాడో, లేదో! యెన్నో చోట్ల వున్న యథార్థాన్ని నేను ప్రకటిస్తూనే వున్నప్పటికీ మామూలు కథలు కథలుగానే నడుస్తూన్నాయి.

"అమంత్రోపాసకా సంతా
వపి కాళీదయాకరౌ!
తిర్పతి వేంకటేశశ్చ
పరస్పరహితౌచ యౌ"

అని కాళీసహస్రంలో కంఠోక్తిగా, మాకు క్రమమైన ఉపాసన లేదని చెప్పబడి వున్నా, మంత్రోపదేశంకోసం మమ్మల్ని మోమోట పెట్టేవారెందఱో వుండడం అనుభూతం. వొకాయన కౌముదిదాకా చదువుకొని నా దగ్గిరికి విద్యాభ్యాసవ్యాజంతో (అసలు వుద్దేశం అది కాదు) వచ్చి అహోబలపండితీయం మొదలెట్టి చదువుతూ, నాలుగైదురోజులైన తరవాత, అసలు కోరిక నన్ను బయలు పఱిచాడు. నాకు అలాటి శక్తియుక్తులు లేవంటే; ఉపదేశించడానికి అంగీకారంలేక అలా చెప్పినట్టు భావిస్తాడుగాని విశ్వసిస్తాడా? అందుచేత యథార్థం చెప్పినా ప్రయోజనంలేదు. కనక సరే దీన్ని చదువుతూ వుండు, మంచిరోజు చూచి దానిసంగతి ఆలోచిద్దామని గంభీరంగా చెప్పి, మొదలెట్టిన పాఠాన్నే కొన్నాళ్ళు సాగించి మఱికొంత చనువు చిక్కిన తరవాత వున్న యథార్థాన్ని తెలిపాను. విశ్వసించాడో, లేదో! చెప్పలేను. అతడు మంచికవి; ఆశుకవికూడాను. పండితకవి. పేరు వ్రాస్తే అతడికేం కోపం వస్తుందో అని దీనిలో వుదాహరించ లేదు. మంత్రోపదేశానికి మిష కల్పించుకు వచ్చినవాడే కాని అతడు శిష్యకోటిలోవాడు కాడు. యీ మంత్రోపాసనాప్రవాద యింతతో ఆగితే కొంత నయమే; ఆగలేదు. యిది 'పీఠా' దాకా దేకింది. అదెన్నీ నా చెవిని బడింది. యేమిటి చేసేది? "కథ క్కాళ్లుంటూ వుంటాయా?" అనుకొని వూరుకోవలసిందే. జీవితానంతరం యీలాటి కథాకల్పనలు బయలుదేఱడం కొంత సహజమే. జీవితకాలంలోనే బయలుదేఱితే గతేమిటి? ఆ బయలుదేఱడం యేదేనా శత్రుత్వాన్ని పురస్కరించుకొని బయలుదేఱితే కొంత యుక్తం. ఇవి అలాటివారిద్వారా బయలుదేఱినవిగా తోచవు. మొట్టమొదట వీటికి జన్మస్థానం ("ఏఱుల జన్మంబు" అన్నట్టు) యెక్కడో తెలుసుకోవడానికి వశం కాక యెవరో ప్రారంభిస్తారు. వారిద్వారా వీరూ, వీరిద్వారా వారూ దాన్ని వ్యాప్తిలోకి తెస్తారు.

"లోకము మాయను మాకు దున్నదే!"

తెనాలి రామలింగానికి పెద్దన్న, ముక్కుతిమ్మన్న, భట్టుమూర్తి, యింకా కొందఱూ ఏకకాలీనులు కారని నేటివారు బాగా ఋజువు చేసినప్పటికీ వీరందఱితోటిన్నీ రామలింగానికి ముడిపెట్టి చెప్పుకొనే కథలు చెప్పుకుంటూనే వున్నారు. అలాగే పై నీలాపనిందలు సత్యేతరాలని యెంత గాఢంగా ఋజువుచేసినా చెప్పుకొనేవారు చెప్పుకుంటూనే వుంటారు.

యీలాటి సందర్భాలనుగూర్చి కొందఱు విమర్శకులు కొంత కృషి చేసి తత్త్వనిర్ణయానికి పాటుపడడం ఆవశ్యకమే కాని ఆ విమర్శకులు అంతతో ఆగక నల్వలూ శిరసావహించే భారతభాగవతరామాయణాల మీదికి కూడా తమ బుద్ధిచాకచక్యాన్ని ప్రసరింపజేసి ఆయా పుణ్యగాథలయందు లోకానికి అవిశ్వాసాన్ని కలిగించడం శోచ్యంగా వుంది. వేదంలో వుండే యితిహాసాలుగాని, పురాణాల్లో వుండే యితిహాసాలుగాని సమస్తమూ అర్థవాదాలుగా (లేని కథలు కల్పించి సత్యం వగైరాలను దృఢపఱచడం పేరు అర్థవాదమంటారు మీమాంసకులు) నిర్ణయించేవున్నారు గాని, వాట్లవల్ల యిట్టి చిక్కురాదు. అది "గజం మిథ్య; పలాయనం మిథ్య" వంటిది కనక యెవరికోగాని అవగాహన చేసుకో తగ్గదిగా వుండదని తాత్పర్యం. ప్రతి ప్రసిద్ధవ్యక్తినిగూర్చిన్నీ యేదో నిందాకల్పన వున్నట్టే కనపడుతుంది. సంస్కృతగ్రంథంలో లేని నింద తెలుగు అనువాదంలో కనపడడం వుంది. ద్రౌపదీస్వయంవర సమయంలో ఆ ధనస్సు కర్ణుడు యెక్కు పెట్టి మత్స్యయంత్రాన్ని కొట్టడానికి సిద్ధపడుతూ వుండగా, పాండవులు మత్స్యయంత్రం తెగిపడ్డట్టే తలుస్తూ వుండగా ('మేనిరే పాండునందనాః') ద్రౌపది, "నాఽహం వరయామి సూతమ్" అని నిరాకరించడంవల్ల కర్ణుడు రసాభాసశృంగారమందు యిష్టంలేని ఉత్తమనాయకుడు కనక (ఏకత్రైవానురాగశ్చే ద్రసాభాసః) ఆ వుద్యమాన్నుంచి విరమించినట్లు సంస్కృతంలో వుంటే, తెలుగులో నన్నయ్యగారు అసలు ఆ ధనుస్సు యెక్కుపెట్టడమే తిలగింజంత కాబోలును తరవాయి వున్నట్టు వ్రాశారు. యిక్కడ నన్నయ్యగారికి కర్ణునియందు ద్వేషం వుందని యెవ్వరూ చెప్పరు. పోనీ కృతినాయకుడు రాజరాజనరేంద్రుణ్ణి సంతోషపెట్టే వుద్దేశంతో (రాజరాజనరేంద్రుడు పాండవవంశసు డనుకొనే పద్ధతిని) అలాటిమార్పు చేశాడేమో?—అనుకుంటే భారతకాలంలో వారికి యెవరికోతప్ప కర్ణజన్మరహస్యం తెలియదుగాని రాజరాజనరేంద్రుని నాటికి ధర్మరాజాదు లేలాటి పాండవులో కర్ణుడూ అలాటి పాండవుడే అనే సిద్ధాంతం సర్వవిదితమే కదా? అందుచేత ఆయీ వూహలు పొసగవు. కర్ణుడుకూడా అభిమానపాత్రుడే అవుతాడు. ఆ శ్లోకాలు నన్నయ్యకు బాగా సమన్వయించలేదు. మనకే సమన్వయించాయి అనుకోవడం బొత్తిగా రుచించనిమాట. భారతప్రతులు నానాదేశాలలో నానారీతిగా ఉపలబ్ధం అవడాన్నిగూర్చి లోకంలో వివాదం లేదు కాబట్టి, నన్నయ్యగారికి లభించిన భారతంలో అలాగే (తిలమాత్రం యెక్కు పెట్టడం తరవాయి) వుందనుకోవడమే యుక్తిసహం. అయితే భారతాలు నానావిధంగా యెందుకు వుపలబ్ధం కావలసివచ్చింది? అనే ప్రశ్న ఒకటి యిక్కడ ప్రస్తుతమవుతూ వుంది. యిది పెద్ద ప్రశ్న. దీన్ని గుఱించి పలువురు వ్రాసే వున్నారు. నేను వ్రాయవలసి వుండదు. భారతం బహుకర్తృకమనే ప్రవాదాన్ని వొప్పుకోనేవారికి యీ శంక తృణంలో నివర్తిస్తుంది. యెవరు వ్రాసినా వారు ఆకాలీనులే అయినా యావత్తు సంగతిన్నీ ప్రత్యక్షంగా చూచి వ్రాయడం అనుభవవిరుద్ధం కదా? కొంత ప్రత్యక్షంగా చూచి వ్రాసినా కొంతేనా విని వ్రాసినభాగం వుండి తీరాలి. మత్స్యయంత్రం కొట్టినపిమ్మట చాలా సేపటికే వచ్చారో వ్యాసులవారక్కడికి, యింకా మఱునాడే వచ్చారో? ద్రౌపదిని అయిదుగురికి పెళ్లి చేయడం యేలాగ? అనే ధర్మసందేహం తీర్చేటందుకు కదా—వ్యాసులవారు అక్కడికి వచ్చింది. అందుచేత వారు యేలా విన్నారో? అలా వ్రాసి వుందురు. ప్రత్యక్షంలో చూచినవారెవరేనా అక్కడ వుంటే ఆ భాగంలో వ్యాసులవారు వ్రాసినదానికి భిన్నంగా ప్రచారం చేశారేమో? ఆయీ విషయం తేలేదికాదు. నా అనుభవాన్ని అట్టి కథకు సంబంధించిన వ్యక్తుల జీవితకాలంలోనే కథలు తాఱుమాఱు అవుతూ వుండగా కొంతకాలం పాబడిన తరవాత తాఱుమాఱు అవడంలో అభ్యంతరం వుండదనియేవే. నేటి పాశ్చాత్యయుద్ధవార్తలు మనకు సరిగా తెలుస్తూన్నాయా? అప్పుడిన్ని సాధనాలుకూడా లేవాయె. తత్తథాస్తాం.

మా—"గీరతం" పుట్టి యిప్పటికి సుమారు ముప్ఫయేళ్లు కావచ్చింది. గుంటూరిసీమ పుట్టికూడా యించుమించు అంతే యిప్పటిదాకా (కొందఱు లోపించినా, ఆ గ్రంథద్వయానికి సంబంధించిన పాత్రలు చాలా వఱకు సజీవులే యిట్టి స్థితిలో అందులో సంగతులు (కొన్నే అనుకుందాం) సర్వాబద్ధం అని కొందఱు వ్రాయ సాహసించినవారు లేరా? అలాగే ఆ రోజులలోనున్నూ కొన్నివిషయములనుగూర్చి అపవదించేవారు కొందఱు వుంటే వుండవచ్చుననిన్నీ, క్రమంగా వారి అపవాదలు విని నమ్మిన ఆకాలానికి కొంచెం యిటీవలికవులు గ్రంథంలో చేర్చి వుంచురనిన్నీ నాకు తోస్తుంది నా అనుభవాన్ని బట్టి నేను యిది "లక్కగేద సామెతగా" వ్రాసే వ్రాత. ప్రత్యక్షంగా జరగడమే కాకుండా వాదిప్రతివాదులిరుపక్షాలుకూడా సుమారు ముప్పైయేళ్ళు పూరుకొన్నదాని విషయంలోనే సాహసించి, అందులో ఒకదానిలోని ప్రధానాంశాన్ని గూర్చి—"నేను చెళ్ళపిళ్ళవారియొద్ద ఒక్క యక్షరమైనను చదువుకోలేదనియు" ఇంకా యేమో ఎబ్బెట్రాలు అనియు వ్రాసినట్లు వ్రాసేవారు కనపడ్డ నాకు పై విషయాలలో అట్టి సందేహం కలగడానికి అభ్యంతరం వుంటుందా? అసలు వ్యక్తి "చదువుకోలేదు" అని వ్రాసెనో? మఱే విధంగా వ్రాసెనో? పరిశీలించేవారు లోకంలో నూటికి యెంతమంది వుంటారో? విజ్ఞులు విచారించాలి. విమర్శించకుండా యీ వ్రాతనే నమ్మి ప్రచారం చేయడంవల్ల కొందఱు అలా చెప్పుకొనేవారున్నూ, కొందఱు యీలా చెప్పుకొనేవారున్నూ వున్నట్టు భవిష్యత్కాలం వారికి తెలియబడుతుంది. దానితో రెండుమతాలు వున్నట్లవుతుంది. దానితో అది నిజమా? ఇది నిజమా? అనే సంకటం యేర్పడుతుంది.

భవతు యివన్నీ "నీలాపనిందలు" కావు ప్రసక్తానుప్రసక్తంగా వాట్లకి కాస్త దగ్గిఱచుట్టఱికం కలవికూడా యిందులో వచ్చి చేరినట్లయింది.


బాగా విచారిస్తే పురాణగాథలన్నీ యీలాటి సంకటానికి లోబడినట్టే కనపడుతుంది. వాల్మీకిరామాయణంలో రావణకుంభకర్ణుని లిద్దఱినీ రాముడే వధించినట్లు కనపడుతుంది. భారతంలో కుంభకర్ణుణ్ణి లక్ష్మణస్వామి వధించినట్లు వుంది. యీ భేదాలకూ ఆదీ అంతమూ వున్నట్టే లేదు. యేనాగానలో కావడంచేత వీట్లకి గతిపడితే పట్టిందనుకుందాం, మాగాథలు నిన్నామొన్నా జరిగినవాయె, మామా చేతివ్రాతలతో నిండివున్నావాయె, యెందఱో ప్రాజ్ఞులు యెఱిగివున్నావాయె. వీట్లను (యెప్పుడో కాదు వుభయపార్టీల జీవితకాలంలోనే) అన్యథాకరించి వ్రాయడాని సాహసిస్తే యేం చేసేది? అలా అన్యథాకరించడంలో యెంతో నైపుణ్యం వుంటే బాగుండేది. అదిన్నీ కనపడదు. యీకర్మం యిప్పటి చరిత్రలను అపవదించేవారికే కాదు. పూర్వగాథలను అపవదించేవారికిన్నీ వున్నట్టు నా బుద్ధికి కనపడదు.

ఆనందరామాయణమంటూ వొకటి బయలుదేరింది. అదిన్నీ వాల్మీకికృతమనే కనపడుతుంది గద్యనుబట్టిచూస్తే. దానిలో వున్నంత అనౌచిత్యమూ పరస్పరవిరోధమూ, యే గ్రంథంలోనూ కనపడ్డట్టులేదు. ఆయీ విరుద్ధకల్పనలతో గ్రంథాన్ని లేవదీసినవారెవరో తెలుసుకుందామంటే ఆధారం కనపడదు. పేరు పెట్టుకోనే లేదు. మామాచరిత్రలలో గీరతానికి యీలాటి పీడ, ఆ రోజులలో దాపరించినట్లు లేదుగాని, గుంటూరిసీమకు దాపరించింది. వాళ్ళు "యథార్థవాది"—"సత్యవాది" యిత్యాది పేళ్ళతో అసత్యాలు ప్రకటించడం వుండేది ఆ "నీలాపనిందలు" మఱికొందఱు ప్రాజ్ఞుల వుత్తరాల ద్వారా సమసిపోయేవి. ముప్పైయేళ్ళు దాటిన తరవాత ఆ యీ గాథలను బుద్ధిపూర్వకంగా అపవదించడానికి ఆరంభించారు కొందఱు. వీరి—"నీలాపనిందలు" చూస్తే ఆశ్చర్యంగా కనపడతాయి.

పూర్వం మనదేశంలో నీలిమందు తయారయ్యే రోజుల్లో ఆమందుగూనలు దిగడానికి యీలాటివార్తలు వేయడం వుండేదంటూ వినడం; ఆమందు తయారు కావడానికిన్నీ యీ అపవాదాలకీ వున్న కార్యకారణభావం యేలాటిదో? నాకు బాగా తెలియదు. ఆయీసందర్భాన్ని బట్టి యెవరేనా అబద్ధపువార్తలు వ్యాపింపజేసినప్పుడు వాట్లతత్త్వం తెలిశాక వాట్లను—'నీలి వార్తలు' అనడం మాత్రం అందఱికీ తెలుసును యీ నీలి వార్తలే, నానాటికి—"నీలాపనిందలు" గా వ్యాప్తిలోకి వచ్చాయి.

యిందులో నానావిధకల్పనలు వుంటాయి కల్పనలు యేలాటివైనా పేరుమాత్రం వొకటే. వీట్లకి విశేషించి కాస్త నామరూపాలున్నవాళ్లే విశేషించి గుఱి అవుతూ వుంటారు. యెవళ్ళు కల్పిస్తారో కాని ఆపేరుప్రతిష్ఠ లున్నవాళ్ళమీద చావువార్త వొకటి కల్పిస్తారు. ముఖ్యంగా అది యేనాల్గురోజులో లోకంలో కొంత వ్యాపించి కొందఱికి పరితాపాన్ని కలిగిస్తుంది. అంతట్లో మళ్లా యథార్థవార్త తెలిసి ఆపరితాపం వారికి తగ్గుతుంది. యెవరిమీద కల్పిత మవుతుందో, ఆదుర్వార్త వారికి—"పీడాపరిహారం" అయిందని చెప్పి సంతోషించడంకూడా జరుగుతుంది. అసలువాళ్లు

(18 వ పేజీ చూడుడు)



పురాణ (లాల్) ఖిల్లాలో గాంధీజీహత్యా విచారణ జరుగుతూన్న న్యాయస్థాన మందిరానికి ముందున్న ప్రవేశద్వారము సురక్షిత మొనర్చబడ్డది.

భారత రాజకీయాలు

పురాణ ఖిల్లా మళ్ళీ ప్రపంచ దృక్పథంలోకి వచ్చింది. భారత దేశ భవిష్యత్తు మీద ప్రభావం కల అసామాన్య సమావేశాలకు ఆట పట్టుగా అవటం. ఈ పురాణ ఖిల్లాలో ఏదో మహత్యం ఉందా అనిపిస్తుంది.

ముందు, అజాద్ హింద్ ఫౌజు సిపాయీల విచారణతో, మూలపడి, ఉన్న ఈ పురాణఖిల్లా ప్రజల దృక్పథంలో పడ్డది. ఆనాడు విదేశీయుల పరిపాలనలో, రాజద్రోహ నేరంపై విచారణ జరిగింది. అప్పుడు నేరస్థులు, ప్రజాదరణకు పాత్రులు. ప్రజల కభిమానవీరులు. కీ. శే. భులాభాయ్ దేశాయి, గర్జనలు భారతదేశ ప్రజకందరికీ, అతిరమ్యంగా వినిపించాయి. పరాయి ప్రభుత్వ విచారణనుంచి దేశం తన వీరులను విముక్తులను చేసుకొని సంతోషించింది

మళ్ళీ ఆసియా మహాసభతో పురాణఖిల్లా ప్రాశస్త్యం తెచ్చుకొంది. ఆసియాదేశాలన్నీ భారతదేశానికి ఆ ఖిల్లాలోనే జోహార్లు అర్పించి. అగ్రతాంబూలం సమర్పించాయి. ఆనాడు అక్కడికి మహాత్ముని రాకతో. యావదాసియా ఖండవాసులూ పులకించిపోయారు.

విధి 'దుర్విపాకమో, ఏమో, ఆమహాత్ముని హత్యా సందర్భవిచారణమే మళ్లీ నేడక్కడ జరుగుతుంది. ఒకనాడు జాతినంతనూ ఉత్తేజింతమొనర్చగల ఆదర్శ పురుషుడుగా కనబడి, భారతస్వాతంత్ర్యంకోసం ఏవీరుడూ పడనన్ని అగచాట్లు పడ్డవీర సావర్కారు, ఇవాళ, ముద్దాయిగా, దేశపితను హత్యచేయటానికి పూనుకొన్న కుట్రలో భాగస్వామిగా, దేశభక్తుడుగా ఎంతటి మహోత్కృష్టమైన కీర్తిని ఆర్జించుకొన్నాడో, పితృహత్యా భాగస్వామిగా అంతటి నీచాతినీచమైన అపకీర్తికి ఆస్పదం కాగల దుఃస్థితిలో నిలచాడు.

"Patriotism is a blend of Noble and ignoble sentiments"--దేశభక్తి అనేది, మహోత్కృష్ట, మహాధమ భావాల సమ్మిశ్రితము" అని డీన్ ఇంజ్ అన్నాడు. అంటే, స్వకీయమైన వర్గాలకోసం, కులాలకోసం, దేశమన్న భావాన్ని సంకుచితం చేసేసుకొని మత వర్గ విషయికమైన అభిమానాన్ని పెంపొందించుకొంటూ వస్తే, అధమస్థితికి దారి తీసి, Chau vlnism & Jingoism, ను స్వోత్కృష్టతం జాత్యహంకారాన్ని, సహన రహితమై కజ్జాకు కాలుదువ్వే స్వభావాన్ని, కూడా అలవాటుచేసి, మహాధమస్థితికి దేశాన్నీడ్చించటానికి, తగ్గుప్టబీ జాలుకూడా, ఈ "దేశభక్తి" భావంలోనే అణిగిఉన్నాయని, "దేశభక్తి" అనేవ్యాసంలో అతను ఉగ్గడించాడు. మహాత్ముడు, "దేశభక్తి" ఉద్రేకంలో ఉండే, ఈసంకుచిత విషబీజాలను నిర్మూలంచేసి, సర్వమానవసౌభ్రాత్రపూరితము, అహింసాయుతమై సర్వమతవర్గ సహన సమన్వితము, విశ్వకల్యాణాపేక్షకమయిన సత్యధర్మాచరణ నిష్టమూ, ఆత్మగౌరవ విశిష్టమూ, ప్రగతీగమకితమూ, అయిన పవిత్ర దేశభక్తినే బోధిస్తూ, ఆరీతిగే ఉద్యమం సాగించి, దేశస్వాతంత్ర్యమనేది. కేవలం, ఉద్యమంయొక్క గౌణఫలితం (Bye product) గానే సాధించాడు. కాని, "స్వదేశభక్తి"అనే ఉద్రేకంలో నిగూఢమైఉన్న పైజెప్పిన విషబీజాలకు, స్వాతంత్ర్యచ్ఛాయలు ప్రాప్తించటంలోనే. .కొంతపుష్టిచిక్కింది. దాదాపు ఏకాకిగానిలిచి మహాత్ముడా విషశక్తికి బలి అయాడు. కాని "ఫోనిక్స్ జీవితంలాగా," ఆబలిలోనే, దేశదృష్టిని ఒక్కసారి "దేశభక్తి" అన్న పవిత్ర భావాన్ని సరిగా అవగాహన చేసుకోకపోతే వచ్చే విష ఫలితాలమీదకి, ఒక్కసారి మరల్చగల్గి, ప్రభుత్వాన్ని జాగ్రత్తలోకి తిప్పగలిగి దేశానికి మళ్ళీ జీవితం పోశాడు.

ఈ మే, 27 వ తారీఖున గాడ్సేతో సహా తొమ్మండుగురు ముద్దాయిలు, పురాణ ఖిల్లా, న్యాయస్థానములో, నేరస్థుల స్థానం ఆక్రమించారు. గౌరవ న్యాయాధిపతి, ఆత్మచరణ్, ప్రత్యేకం ఈ విచారణకు న్యాయాధిపతిగా నియామితులయ్యారు.

విచారణ ప్రారంభ కార్యకలాపాల అనంతరం, జూన్ 14 తారీఖుకు వాయిదా పడింది. ముద్దాయీలకివ్వవలసిన అవకాశాల విషయం సంప్రదించేందుకు, మూడవ తారీఖున మాత్రం లాంఛనప్రాయంగా విచారణ సాగుతుంది.

నేరస్థులు తొమ్మండుగురూ, వరుసగా, నాథూరాం వినాయకగాడ్సే, నారాయణదత్తాత్రేయ ఆప్టే, విష్ణురామకృష్ణకార్కార్, దిగంబర్ రామచంద్రబాడ్జి, మదనలాల్, (గాంధీజీపై మొదటబాంబు విసిరినవ్యక్తి) గోపాలవినాయక గాడ్సే, శంకరక్రిష్టయ్య, వినాయక దామోదర సావర్కారు డి. యస్. పరాశర్, గారలు.

ఈ విచారణ సందర్భంలో లాల్ ఖిల్లా (పురాణఖిల్లా)ను చాలా బందోబస్తుగా కాపలా కాస్తూ అనుచితవ్యక్తులకు ప్రవేశంలేకుండా ఉండేందుకు తగు జాగ్రత్తతీసుకొని, న్యాయస్థానం చుట్టూ, మిలిటరీ రక్షణను, ఇనుప ముళ్ళతీగెల జాలర్లతో ప్రదేశరక్షనూ సాగిస్తూ, ప్రభుత్వం చాలా జాగ్రత్త తీసికొంటూంది.

హైదరాబాద్

గంగాపురంవద్ద బొంబాయి మెయిలుపై, రజాకార్ల దురంతపుదాడి జరగటంతో, భారత యూనియన్‌కు హైద్రాబాదు సమస్యవిషయమై, శ్రద్ధతీవ్రం కావలసివచ్చింది.


ఢిల్లీలో ఉన్న హైదరాబాద్ నాయకులు, ఇంతటి ఘోరమైన దాడీకూడా, కేవలం ప్లాటుఫారంమీది జనానికి, రైలులో జనానికి, జరిగిన చిలిపికజ్జా అని చెపుతూ, భారతయూనియన్ పత్రికలు పెద్దగా దురంతాన్ని కల్పించాయని చెప్పసాహసించారంటే హైద్రాబాదు నిజాంకు సలహాదారులైన నాయకులకు, దేశపరిస్థితులు భావించుకోగల జ్ఞానముటుంది, ప్రత్యక్ష దురంతాలను కట్టిపెట్టి జాగ్రత్తగా నడుచుకోవాలన్న జ్ఞానంకూడా, కలిగినట్టు కనిపించదు.

హైదరాబాదుతో రాయబారాలంటే ఏమిటో, జపాను విషయంలో మునుపు అమెరికాకు తెలిసివచ్చినట్లే భారత యూనియన్‌కు మేలుకొలుపు కల్గింది.


లాయక అలీ రాయబారాలలాంటి కాలవిలంబనం చేసే సంజయ రాయబారాలు, ఇకపనికి రావని తేలింది.

భారత ప్రభుత్వం ఈసమస్యను సత్వరమెటో అటు తేల్చుకోబూనినది. లాయకత్ ఆలీ ద్వారా, హైద్రాబాద్ నిజాంకు నిష్కర్షగా మూడు సూచనలు తెల్పి, ఏదో ఒక నిర్ణయానికి రమ్మని అడిగినట్లు తెలుస్తుంది. ఈ సూచనలు ఒకటి భారత ప్రభుత్వంలో చేరిపోవటం, రెండు, బాధ్యతాయుత ప్రభుత్వాన్ని స్థాపించటం; లేదా, మూడు, జనవాక్యం (Plebiscite) ఎటుందో నిర్ణయించుకోవటం.

ఇప్పుడు మూడు విషయాల్లో ఏది తేలుద్దామన్నా, నిజాం ఇంకో విపరీతవాదన లేవదీస్తున్నట్లు తెలుస్తూంది. అసలు ప్రజా ప్రాతినిధ్య సంస్థలంటూ హైద్రాబాద్‌లో ఉన్న రాజకీయ సంస్థలయొక్క, ప్రాతినిధ్య ప్రామాణ్యం, విషయమై శంకలను లేవదీస్తున్నాడు. స్టేటు కాంగ్రెసు ప్రజా ప్రాతినిధ్య సంస్థకాదని నిజాంవాదన. కాదు సంపూర్ణ ప్రాతినిధ్యమున్నదేయని భారత యూనియన్ అంటూంది. ఎన్నికలైతే ఈవిషయం ఇట్టే తేలిపోగలదు. ఈలోపునే, సర్ వాల్టరు మాంక్టను మళ్ళీ హైద్రాబాదువచ్చి, నిజాంతరపున భారత సమాఖ్యతో, రాజీనామా తదంగం నడపగలడని తెలుస్తున్నది. కానీ కాసీం రజ్వీమాత్రం "భారతయూనియన్ ఎప్పుడు కొత్తసూచనలపేరు చెప్పినా పాతపాటలే పాడుతుందని" తన పాత



మందిరంచుట్టూ కోటలో ఈ మాదిరిగా ముళ్ళ ఇనుపతీగెలతో రక్షగా కంచెవేసి బందోబస్తు చేశారు. అనుమతి లేకుండా ఎవరు లోపలి రావటానికి వీలులేదు.



మార్చి నెలలో అగ్నికాహుతియైన గోధ్రా పట్టణభస్మరాసుల్లోనుంచి మళ్ళీ సరికొత్తదైనా

ధోరణినే సాగించాడు. రజాకార్లను సంస్థానంలో ఈస్థానాన్ని పోషిస్తున్నంత సేపూ, రాయబారాలు రాయబారాలుగా ఉంటూండగానే, జరిగేవేని జరుగుతూఉంటుందని భారత ప్రభుత్వంకూడా గుర్తించింది. అందుచేత, భారత ప్రభుత్వం శాంతియుతంగానే సమస్యాపరిష్కారంచేయగల దృఢవిధానం అవలంబించటానికింకెంతోకాలం పట్టదనే అనుకోవచ్చు.

మధ్యభారత సంస్థానకూటమి

— మే28 న, గ్వాలియర్, ఇందూర్, మరికొన్ని ఇతరమధ్య భారత సంస్థానాలు కలిసీ, "మధ్య భారత సంస్థానకూటమిగా అవతరించాయి. గ్వాలియర్ మహారాజు ఈకూటమికి రాజప్రముఖులుగా ఉంటారు. ఇందూర్ మహారాజు ఉపరాజప్రముఖ్. సమాఖ్యకుప్రధాని పదవి, గ్వాలియర్ ప్రధాని లీలాధర్ జోషి, స్వీకరించారు. ఈ జులై ఒకటిలోగా భోపాల్ సంస్థానం కూడా ఈ సమాఖ్యలో చేరిపోవచ్చును.

సంస్థాన కూటమి లన్నిటిలోకీ పెద్దదైన ఈ సమాఖ్య ప్రారంభోత్సవం నెహ్రూ పండితుడు జరిపాడు. ఈ సమాఖ్య దేశాల విస్తీర్ణం 47 వేల చదరపు మైళ్లు మించుతుంది. జనాభా 70 లక్షలకు పైన బడుతుంది. ఈ మాళ్వ ప్రజాఖండం ఇన్నివందల ఏండ్ల తర్వాత మళ్ళీ ఏకకూటమిగా, ప్రజాప్రాతినిధ్య బాధ్యతాయుత పరిపాలనతో భారతయూనియన్ కండగా నిలవటం. యూనియన్‌కూ, సమాఖ్యకూడా క్షేమకరమని నెహ్రూ ప్రభృతులు తమసంతోషాన్ని వెల్లడించారు.

కాశ్మీర్

కాశ్మీర్‌లో మరల భారతసేనలు పరాక్రమించి విజృంభిస్తూ దుండగులను చాలమటుకు పారదోల గల్గుతున్నవి. ఐక్యరాజ్యసమితి నియమించిన మధ్యవర్తిసంఘం, కాశ్మీరు రావడానికి భద్రతామండలి నిర్ణయించింది. భద్రతామండలి నిర్ణయం లోని అంశాలను తాము అంగీకరించటానికి వీలు లేకపోయినా, మధ్యవర్తి సంఘము కాశ్మీరు వస్తుందంటే, అవిషయకంగా భారతప్రభుత్వాని కభ్యంతరం లేదని భారతప్రతినిధి పిళ్ళై భద్రతామండలికి తెలిపాడు. కాశ్మీర్ సంఘానికే, తదితర, భారతీయ—పాకిస్థాన్, వివాదాంశాల పరిశీలనంతా అప్పగించవలెనని చూస్తున్నది. జూనాఘడ్ లాంటివన్నీ మహావివాదాంశాలుగా చూపి పాకిస్థాన్ చర్చనింకా తనకు కావలసిన ద్రోవనే తిప్పటానికి పూర్తి యత్నాలు చేస్తూంది. అవి అత్యల్పాంశాలనీ, అవి లేకెత్తించటం అశాంతికి దోవతీయటమౌతుందనీ, భారతప్రతినిధి చెప్తూన్న యదార్థాలు భద్రతా సంఘానికి చెవికెక్కటం లేదు.

అసలు ఈ మధ్యవర్తి సంఘనియామకానికి ఉభయదేశాలూ విముఖత చూపించటంతో, ఉభయుల ఆవైముఖ్యమే వ్యాయం జరుగుతూన్నందుకు నిదర్శనమన్న భావం భద్రతామండలికి ప్రబలినట్లుంది. ఇద్దరూ విముఖులై ఉన్నప్పుడు సంఘంవల్ల ప్రయోజనమేమని, సభ్యులడుగుతుంటే, ముందు ఇల్లాంటి సంఘమునేది ఒకటి, ఒకసారి, అక్కడకువెళ్ళగస్తే ఉభయదేశాలూ, అవే సహకరించి తీరుతాయన్న పాశ్చాత్య వాణక్య నీతిని భద్రతామండలి అధ్యక్షుడు ప్రయోగించాడు.

ఐక్యరాజ్యసమితి కాశ్మీర్ ఉపసంఘం యీనెల 28 తేదీన లేక సక్సెస్‌లో సమావేశమై, జూన్ 15 వ తేదీన జెనీవాలో తొలి సమావేశం జరిపి, అక్కడినుండి సాధ్యమైనంత త్వరలో ఇండియాకు, తరలి వెళ్ళుటకు నిశ్చయించుకొన్నది. ఈసంఘంలో అర్జెంటీనా, కొలంబియా బెల్జియం, అమెరికా, జకోస్లవేకియా ప్రతినిధులు సభ్యులుగానుందురు. అర్జెంటినా ప్రతినిధిగా రికార్డో లా చొఫైల్, బెల్జియం ప్రతినిధిగా యం. గ్రాఫీ, కొలంబియా ప్రతినిధిగా యం. గ్రాఫీ, కొలంబియా ప్రతినిధిగా ఆల్ఫ్రెడో ఫెర్డినాండెజ్, జకోస్లవేకియా ప్రతినిధిగా జోసఫ్ కోర్బల్ నియమింపబడిరి. అమెరికా తన ప్రతినిధిని యింకా నియమించలేదు. ఈ ప్రతినిధులందరూ జూన్ 15 వ తేదీన జెనీవా నగరంలో సమావేశమై అటనుండి ఇండియాకు బయలుదేరుతారు.

మద్రాసు ప్రభుత్వ ఆర్డినెన్సు


లోగడ ప్రకాశం పంతులుగారు ప్రధానిగా ఉండగా ఆర్డినెన్సు రూపేణా జారీయై తరువాత ఎసెంబ్లీ ఆమోదంతో శాసనరూపం దాల్చిన మద్రాసు ప్రజాశాంతి రక్షణ చట్టాన్ని సవరిస్తూ మద్రాసు ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు యీ నెల 25 వ తేదీన ప్రకటించింది.

ఉత్తర మలబార్, కృష్ణా, తంజావూరు మొదలగు జిల్లాలలోను, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలలోను, యిటీవల కొన్నినెలలుగా కమ్యూనిస్టులు అరాచక చర్యలు సాగిస్తున్నారు. దీనికి తోడుగా సరిహద్దుగ్రామాలపై హైదరాబాద్ రజాకర్ల దాడులు ఎక్కువగుటతో పరిస్థితి విషమించింది. అవసరమైన చర్యలు తీసుకోకపోతే ప్రమాదం యేర్పడునను భయంతో యీ ఆర్డినెన్సు ప్రకటించినట్లు మద్రాసు ప్రభుత్వం తన చర్యకు సంజాయిషి యిచ్చుకొన్నది. ఇది ప్రవాసంలో ఉండి విద్రోహ చర్యలు సాగిస్తున్న కమ్యూనిస్టులను ఉద్దేశింపబడినదే.

ఈ ఆర్డినెన్సు ప్రకారం డిటెన్షన్ ఉత్తర్వులు జారీఐన వ్యక్తులకు ఆశ్రయమిచ్చిన వారు శిక్షార్హులగుదురు. 3 నెలలకు తక్కువ గాకుండా, 2 సం॥ రాలకు మించకుండా, శిక్షయున్నూ వెయ్యిరూపాయిలు జరిమానా విధింపబడును" డిటెన్షన్ ఉత్తర్వులు జారీయైన వ్యక్తుల తాలూకు కరపత్రములనుగాని, విజ్ఞప్తులనుగాని ముద్రించినా, లేక ప్రచురించినవారుగూడా శిక్షార్హులగుదురు.

ఈ ఆర్డినెన్సులో అన్నిటికన్నా ముఖ్య విషయం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 491 సె॥ ప్రకారం డిటెన్యూలు హెబియస్ కార్పస్ పిటిషన్ పెట్టుకొనే హక్కు తొలగించబడింది. హైకోర్టు విచారణ సందర్భంలో, తాము యేయే విషయాల ఎవరిదగ్గరనుండి సేకరించినది బయటపడగానే, ప్రభుత్వమునకు సమాచారము తెలిపినవారిని డిటెన్యూ తాలూకు వ్యక్తులు హింసించడం జరుగుచున్నదిగాన, హెబియస్ కార్పస్ పిటీషన్ హక్కును తొలగిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది.


ఈ ఆర్డినెన్సు కమ్యూనిస్టు విద్రోహ చర్యల నరికట్టుటనే తలపెట్టబడినప్పటికి హెబియస్ కార్పస్ పిటీషన్ హక్కును తొలగించివేయుటచే, ప్రజాస్వామ్య ప్రభుత్వము పౌరహక్కులనే హరించి వేయుచున్నట్లగుపించుచున్న విక అధికారుల నిరంకుశత్వానికి గురియైన వ్యక్తికి, మోక్షము లేదు. ప్రభుత్వం ఎంతకాలం డిటెన్యూగా పడి ఉంచితే అంతకాలము విచారణ లేకుండా డిటెన్యూగానే పడి ఉండాల్సిందే. ఇటీవల చాలామంది డిటెన్యూలు, హైకోర్టుకు హెబియస్ కార్పస్ దరఖాస్తు పెట్టుకొని విడుదలయైనారు. వీరిలో కొంతమందిని ప్రభుత్వం తిరిగి అరెస్టు చేసినట్లు తెలుస్తున్నది. డిటెన్యూలు విడుదలకావడం, మళ్ళా మరి అరెస్టు చేయడం. ఏబాధాలేకుండా చేసుకొనేందుకు ఏకంగా హెబియస్ కార్పస్‌హక్కును తొలగించివేసింది.



కోటలో న్యాయస్థాన మందిరం.



ఆధునికపట్టణాన్ని తయారుచేయటానికి బొంబాయి ప్రభుత్వమూ, ప్రజలూ, పూనుకొన్నారు.



200 మంది అపహృత ముస్లిం వనితలను లారీలలో దర్యాగంజ్ నుంచి మిలిటరీ రక్షణతో భారతప్రభుత్వం పాకిస్తానుకు పంపిస్తున్నది.

చరిత్రలోని కథలు

మహారత్నము

(గతసంచిక తరువాయి)

శ్రీ గొబ్బూరి వేంకటానందరాఘవరావు

7. ద్వంద్వయుద్ధము

ఖానునియాజ్ఞ శిరసావహించి అతని యనుచరులైన మొగలాయిరవుతులు నలుగురును తమ యిచ్చవచ్చినచోట్లకు మరలిపోయిరి. చోరులు వారి కడ్డము పోలేదు; వెనుదగలనూ లేదు. నల్ల గుఱ్ఱము నెక్కిన దొంగల నాయకుడును వాని వెంట మామూలు, జేశవాళీ గుఱ్ఱములపై చోరులు ముప్పదిమందియు జాజి గుఱ్ఱముపై దౌడుతీయుచున్న మొగల్ ఖానుని వెంటబోవుచుండిరి.

ఇపుడు మొగలీఖానుని జాజి గుఱ్ఱమునకు కళ్లెపుబిగి బాధ లేదు. ఆకుపచ్చ తివాసివంటి నేల. "అమ్మయ్య! నా నిర్బంధపీడ వదలినది. ఇక స్వేచ్ఛగా పోగల"నని ఆ యశ్వరాజము జయసూచకముగా నుత్సాహముతో జూలెగరవైచి రెక్కలుగలట్లు వాయువేగముతో మెఱుపులు మెరసిన ట్లెగిరిపోవుచుండెను.

దొంగలనాయకు డెక్కిన తురుష్కహయము శ్యామచ్ఛాయ గలిగి బలిష్ఠమైన జంతువే యయినను, లేడికాళ్లు లేక ఱెక్కలు గల దివ్యాశ్వమున ట్లెగురుచు, మేఘములమీద పోవునట్లు అతివడిగా దౌడుతీయుచున్న మొగల్ జాజికి చాల వెనుకబడిపోయెను.

దొంగలపెద్ద సహజముగా స్థూలకాయుడు; దానికితోడు లోహమయమైన కవచమును కూడ దొడిగినాడు. ఈ రెండు బరువులు మోయుచు తురుష్కాశ్వము తొందరగా బోజాలకున్నది. ఒక్క బక్క కౌతుతో పోరాటమునకు ఇవి యెల్ల ననవసరమనియు, బరు వెంత తగ్గిన నంత మే లగుననియు ననుకొని చోరుడు తాను తొడిగిన కౌతుల యంగీని, కవచమును గూడ విప్పి విసరివైచెను.

మరికొంతసేపటికి జాజి గుఱ్ఱముపై నున్న మొగల్ యోధుడు తిరిగి చూడగా, శ్యామాశ్వముపై దొంగలపెద్ద తప్ప మరెవ్వను కానరారైరి. వానిని చూచు సరికి మొగల్ ఖానునకు కోపోద్రేకము కలిగినది. అరికాలుమంట నెత్తి కెక్కినది. "వీని యమ్మకడుపు మాడ? ఈ దరిద్రపు ముండకొడుకు నాకు సైతానువలె దాపురించినాడు. మావారి నందరిని చంపినాడు. అంతటితోనైన నూరుకోడు! మా కోటలో నన్నుండ నీయడు. వీని యబ్బసొమ్ములు, తాత సొమ్ములు నాకడ నున్నట్లు నన్ను తఱుముకొని వచ్చుచున్నాడు — మా తాతలనాటి మహారత్నము వానికి కావలెనట? వీని యాళ మండ! మా తాతసొమ్ము ఈ గాడిదెకొడుకున కెట్లువచ్చు ననుకొన్నాడు? వీని పని పట్టించవలె! పట్టి గట్టిగా శిక్షించవలె. అంతేకాని వీని కొక్కనికి బెదరి పారిపోనేల? అనుకొనుచు ముకరాబ్ ఖానుడు గమనము మందముచేసి, ధనుర్బాణపాణియై శత్రున కెదురు నడచెను.

చోరు డీ ప్రకారము జరుగునని ఎన్నడు ననుకోలేదు. "ఎంత పని చేసినాను. చేజేతల కవచమువిప్పి నిష్కారణముగా విసరివైచినాను. అడుగో—హజారత్-ఖాను విల్లు నమ్ములను దీసి ప్రచండముగా నా మీదికి తఱుముకొని వచ్చుచున్నాడు. అలుగు దగిలిన ప్రమాదము." అనుకొనుచు, చోరనాయకుడు తన గుఱ్ఱపు మెడమీద వ్రాలి పండుకున్నట్లుండి స్వారిచేయుచుండెను. మొగల్ యోధుడు వి ల్లాకర్ణాంతము దిగిచి గుఱిచూచి బాణము ప్రయోగించెను. గాలిలో రివ్వుమనుచు వచ్చివచ్చి యా యలుగు నల్ల గుఱ్ఱపు శరీరమును భేదించి చొచ్చెను. దెబ్బతో గుఱ్ఱము తూలి నేల గూలిపోయెను. గుఱ్ఱముతో చోరుడుకూడ జారిపడెను.

మొగల్ ఖానుడు గుఱ్ఱముతో దొంగకూడ పడి చచ్చె ననుకొనెను. వాని తలమీద పెద్ద బఱువు జారిపడినట్లయి, ఖానునిగుండె తేలిక యయ్యెను. వాని మనస్సున మితిలేని సంతోష మతిశయింపజొచ్చెను.

పిమ్మట మొగల్ ఖానుడు జాజి గుఱ్ఱమునుండి దిగి, కదలక, చచ్చినట్టే పడియున్న శత్రుడు తెగటారెనో, లేక ఇంకను గుటుగుటు జీవముతో నున్నాడో చూతమని, దొంగల నాయకుని చేరనరిగి వంచి చూచెను.

దొంగలపెద్ద నిజముగా చావలేదు. చచ్చినట్లు నటించి పడియున్నాడు. ముకరాబ్ ఖానుడు తన సమీపమునకు రాగానే చోరుడు ఉవ్వెత్తుగ లేచి, రెండు చేతులతో ఖానుని గట్టిగా పట్టెను. వారు కాంక్షించుచున్న రత్నమణి యపుడు వాని పట్టులో జిక్కియున్నది.

"దూరదృష్టి లేక చీకటిలో బడి క్రొవ్విన శత్రునకు చిక్కినాను" అనుకొని ఖాను డొక్కక్షణకాలము స్తబ్దుడై నిలిచెను. అంతలోనే ధైర్య మవలంబించి, చేకటారు పట్టుకొని చిత్తజల్లువలె గబగబ పలుసార్లు చోరుని చేతులపై బొడిచెను. ఆ పోట్లవర్షమునకు తాళలేక చోరుడు పట్టు విడిచిపెట్టి కత్తి దూసెను. ఖానుడును అంతలో కత్తి దీసెను.

అపు డా యిరువురిమధ్య ద్వంద్వ యుద్ధము ఘోరమయ్యెను. చోరుడు బహు బలిష్ఠదేహుడు కాని ఖానునికాలు తేలిక; ఖడ్గ యుద్ధమున చోరునికంటె మిక్కిలి నేర్పరి. అప్పటికి సూర్యుడు పడమటకు చాల వ్రాలి అస్తమింపనై యున్నాడు. కొంతసేపు ఆగినచో, ఖానుని కటారు పోట్లచే చోరుని చేతులనుండి స్రవించుచున్న రక్తధారలతో చోరుడు నీరసించి త్వరలో సొమ్మసిల్లి పడగలడు. కాని అంతవఱకును బందెటి దొంగ ఊఱకుండునా?

అదియునుంగాక వెనుకనుండి తఱుముకొని వచ్చుచున్న దొంగ లొక రిద్దరైన తమ నాయకుని కలిసికో గలిగినచో వ్యవహారము విషమించగలదు. కాబట్టి యెంతమాత్రము ఊఱకుండరా దని నిశ్చయించి, ముకరాబ్ ఖాను, కత్తి కటారులు రెండు చేతులను పట్టుకొని కవచము లేని చోరుని గుండెలపైని, వేష్టనము లేని శిరస్సుపైని, వీలుచిక్కినకొలది గట్టిగా బొడుచుచు, నరుకుచు, గాయములు చేయుచున్నాడు.

పైనుండి చిత్తజల్లువలె చోరుని దేహముపై పడుచున్న యీ పోట్లకు, దెబ్బలకు తట్టుకోలేక చోరుడు, ఖడ్గప్రహారముచేత ఖానుని చంప నిశ్చయించి సులువుగా కత్తి నెత్తి సత్తువపూని యొక్క దెబ్బ కొట్టెను. ఖాను డా దెబ్బ తగలకుండ తప్పించుకొన యత్నించెను. చోరుని కత్తి ఖానుని శిరస్త్రాణమున జిక్కుకొని విరిగిపోయెను. పిడిమాత్రము చోరుని చేతిలో మిగిలినది. "బోడిపిడి! ఈ కత్తిపిడి నా కెందు"కని చోరు డా పిడిని విసర్జివైచి గండ్రగొడ్డలి తీసి ఖానుని ప్రహరింపనెంచెను. ఖానుడు తేలికగా ప్రక్కకు అడుగువైచి దెబ్బ కందక తప్పించుకొనెను. మరల సావకాశముగా గండ్రగొడ్డలి నెత్తి చోరుడు పరతెంచులోపల ముకరాబ్ ఖానుడు చే ఖడ్గముతో చోరుని గుండెలపై సత్తుతగా కొట్టెను. పిడివఱకు ఖానుని కత్తి చోరుని వక్షస్థలమున నాటుకొనిపోయెను. మూలుగుటకైన వడవులేక చోరు డా దెబ్బకు తారున చచ్చెను.

అప్పటికి సూర్యు డస్తమించి కొంతసేపైనది. చోరుని పక్షపు టనుచరు లెవరైన గుఱ్ఱముల నెక్కి వచ్చుచున్నారేమోయని ముకరాబ్ ఖాను దశదిశల పరికించి చూచెను. డెక్కల చప్పుడేమైన వినవచ్చుచున్నదేమోనని చెవి భూమి కానించి పరిశీలించెను. ఎక్కడను ఏమి శబ్దమే వినరాలేదు. "దొంగలేదో వెడవారిపట్టి పోయిరి; ఇట వచ్చుటలే"దని ఖాను నిశ్చయించుకొనెను. వాని మనస్సు అప్పటికి స్థిమిత పడెను.

ఆ నాటి యుదయమునుండి క్షణమైన విశ్రాంతి యెట్టిదో యెఱుగక పందెములు గట్టినట్లు బహుదూరము స్వారి చేసి చేసి, తుదకు ఘోరమైన ద్వంద్వయుద్ధము గావించి యప్పటికి గెల్పుగొని యున్నందున ఖానుడు పూర్తిగా అలిసిపోయినాడు. మఱియొక్క అడుగు పెట్టుటకుగాని, మరల గుఱ్ఱము నెక్కుటకుగాని అశక్తుడై యున్నాడు. ఆ సమీపమున నేదో గోడ కనబడుచున్నది. ప్రొద్దుపోయినప్పటినుండి ఉత్తరపుగాలి లేగినది. ఫుండువంటి యా చలిగాలి బడలిన తన శరీరమునకు తాకకుండ నా రాత్రి యా గోడచాటున పండుకొనుట కాతడు నిశ్చయించెను. తలక్రింద కేమియు గనపడక, గుఱ్ఱపు జీనే తలగడచేసికొనువాడై, ఖాను తన గుఱ్ఱమును బిలిచెను. అదివచ్చి ఖానుని ప్రక్కనే పండుకొనెను. జీనే తలగడగా నమర్చుకొని, ఖానుడు సొమ్మసిల్లినట్లు గాఢముగా నిద్రపోయెను.

8. భాగ్యదేవత-జులేఖ

ఆఫ్ఘనిస్థానములో శ్రీమంతుడును, మిగుల బలవంతుడునైన సామంత రాజులలో డోస్ట్ మహమ్మ దొకడు. ఖాను డిపుడు నిద్రించుచున్న ప్రదేశము యీ మహమ్మదుప్రభుని యధికార పరిహద్దులలోనిదే. ఆ లోయ సమతలమై మిగుల సారవంతమైనది ఆ లోయలో "ఘూల్మర్" అను పేరు గల నది యొకటి మధురజలముతో ప్రవహించుచున్నది. ఆ నదీజలమాహాత్మ్యము చేత నా ప్రదేశము ఫలవంతము, సస్యవంతము సంపచ్ఛోభితమునై యొప్పుచున్నది ఖాను డా రాత్రి పండుకొనిన ప్రదేశమున కెదుట కొంత దూరములో నున్న కొండపై డోస్ట్ మహమ్మదు నివాసమున్నది. చలిగాలి తగులకుండ ముకరాబ్ ఖానుడే గోడచాటున నాటిరాత్రి పండుకొనెనో ఆ గోడ డోస్ట్ మహమ్మదుగారి యుద్యానవనముయొక్క ప్రహరీగోడ. ఆ యుద్యాన వనములో తియ్యని పండ్లఫలనొసగు వృక్షజాతులు లెక్కకు మీరి యున్నవి. ఈ ఫల విక్రయము వలన నా మహమ్మద్ సాహేబు ఏటేట నెన్నో వేల రూపాయలు సంపాదించుచున్నాడు.

అంతేకాదు. ఆ వనసమీపమున ప్రవహించు ఘూల్మరనదియిసుకలో బంగారు రేణువులున్నవి. ఇట్లు జాంబూనదమిళితములైన యా యిసుక నుపాయముతో వడియకట్టి బంగారము నేర్పరించి యా ప్రభు వపారలక్ష్మీకటాక్షమునకు పాత్రు డగుచున్నాడు.

అది వసంతకాలము. ఆ వఱకు మోళ్ళయిపోయిన చెట్లన్నియు చిగిర్చి పచ్చని యాకులతో కనుల పండువు చేయుచున్నవి. మరికొన్ని చెట్లు కాయలు కాచినవి. ఇంకను కొన్ని పండ్లు పండినవి.

ద్రాక్షతీగెలు పండ్లగుత్తుల భారమును మోయలేక పోవుచున్నవి. వనవాటికాప్రియుడగు మహమ్మద్ ప్రభువు వేయించిన యీ యుద్యానవనములో నాటి ప్రాతఃకాలమున చెలికత్తెలతో విహరింపగోరి యాతని యేకైకపుత్రిక, పూర్ణయౌవనవతి, జులేఖా కన్యకామణి యందు ప్రవేశించి సహజ సుందర మందగమనముతో నడచి వచ్చుచున్నది.

అది యేమోగాని నాటి యుదయమున నా బాలికకు నాలుగు గోడల మధ్యనున్న యుద్యానవనవిహారమాత్రముతో సంతృప్తి కలగలేదు. ప్రహరీదక్షిణపుగోడలో నమర్చిన దర్వాజా తెరువవలెనని యా బాల చెలికత్తెల కాజ్ఞ యిచ్చెను. పెద్ద చెలి యా దర్వాజా తెఱుచుటకు ఒప్పుకోలేదు.

"అమ్మా! ఇదంతయు తిరిగి చూచినారు కదా? చాలలేదా? తల్లీ! గోడ వెనుక నేమి యుండునో? మన కేమి కంటబడునో? అడవి జంతువులో? గ్రద్దలవంటి కనుమ దొంగలో? ఏమో? ఎవ రెఱుగుదురు? ఈ యినుప గడియ సామాన్యము కాదు. చాల బరువైనది—నేనైతెరువలేనమ్మా" అని యేమేమో అడ్డంకులు చెప్పుచున్నది. కాని దర్వాజా తెరువలేదు.

జులేఖ:—"నీ వొక్క తెవు గడియ తీయలేవా? నీరసమా? పోనీలే! నీవలన గాకున్న మన మందరము కలిసి గడియ పైకెత్తుదము. అప్పు డెందుకు రాదో చూతము. సూర్యోదయమైన తరువాత ఇప్పు డింకను వన్య మృగములు గోడవెనుక నెందు కుండును? ఈ యుద్యానవనసమీపమునకు వచ్చుటకు ఏ కొంప దొంగలకు గుండె లున్నవి? చూతముకాక! రండు!" అని చెలికత్తెలను బిల్చి, యినుపగడియ నా ముగ్గురును ప్రయత్నముతో పైకి తేల్చి దింపి, తలుపులు తెఱచిరి. అప్పటికి కొంచెము ప్రొద్దెక్కినది. లోకబాంధవుని కిరణములు రవంత తీక్ష్ణముగా ముకరాబుఖానుని మూసిన కనరెప్పలను తాకుచున్నవి. దానితో బాలికల సంభాషణాకలకలము, దర్వాజా గడియ తేల్చి దింపినపుడైన చప్పుడులు—వీటి యన్నిటి సమ్మేళనమువలన నొడ లెఱుగక గాఢనిద్రలో నుండిన ఖానునకు తెలివివచ్చెను. అతడు కనులు తెఱచి చూచుసరికి ఎట్ట యెదుట తనముందు సాక్షాత్కరించిన భాగ్యలక్ష్మివలె జులేఖా కన్యామణి కాన్పించెను. అప్పుడే దేవలోకమునుండి యవతరించిన యప్సరసవలెను, నిలుకడగనిన మెఱుపుతీగెవలెను జులేఖ ఖానుని కనులకు మిరుమిట్లు గొలిపెను. వారి చూపు లేకమైనవి; ఏకమై మరలకున్నవి. ఇంకను పరపురుషుని, పూర్ణయౌవనుని చూచుచు నిలిచినచో చెలికత్తెలేమందురో యేమోయని బిడియపడి, మనస్సునకెంతమాత్రము నిష్టము లేకున్నను, విధిలేక యామె మేలిముసుగు సవరించుకొనినట్లభినయించెను, సుందరరూపుడగు నా యువకుని రూపామృతమును తనివితీరక ఓరచూపులతో గ్రోలుచుండెను. బాలార్కుని కిరణ జాలములతో, ప్రాతఃకాలమంద మారుతము లామెవినీల కుటిల కుంతలములపై కేళి సలిపి, సాటిలేని యామె సౌందర్యమునకు వన్నెవెట్టుచుండెను.

సమస్తబంధుజనుల నొక్క పెట్టున గోల్పోయి యేకాకియై, దరిద్రుడై, కడు బడలి యొడలెఱుగక నిద్రించుచున్న తన్ననుగ్రహింప దివినుండి వెడలి వచ్చిన భాగ్యలక్ష్మివోలె తన ముందు నిలిచి తన్ను కటాక్షించుచున్న దేవకన్య యొక్క సురూపామృతమును గ్రోలుచు, తనివితీరక, ముకరాబ్ ఖానుడు సగౌరవముగా లేచి, ఆమె సన్నిధిని వినతుడై "భగవంతుడు మీ యభీష్టముల నొసంగి చిత్తశాంతి ననుగ్రహించును గాక!" అని యతడు సప్రేమముగా విన్నవించెను. "మీరుకూడ భగవంతుని కటాక్షమునకు పాత్రులై ఆయన దీవెనలతో చిత్తశాంతి బడయుదురుగాక" యని మధురవాక్యములతో మెల్లిగా గొణుగుకొనుచు, జులేఖ, చెలికత్తెలకు జంకి మెల్లమెల్లగా నడుగులు వేయుచు తిరిగి తిరిగి చూచుచు ఎట్టకేలకు మరల ఉద్యానవనమున ప్రవేశించి దర్వాజా బంధించెను.

ముకరాబ్ ఖానున కత్యంతానందము నొసగిన వెలుగు ఆమెతోనే అదృశ్యమైనది. బాలసూర్యుడు సహస్ర కిరణములతో ఎల్లరకును వెలుగిచ్చుచున్నను, జులేఖ నిర్గమించుటతో ఖానుని కనులకు కారుచీకట్లు క్రమ్మినట్లయినది.

శరీరసంబంధముగల నేత్రము లిట్లు చీకటిలోనున్నను, అతని మనోనేత్రమునకే చీకటులంటలేకపోయెను. ఏమనగా, అచ్చుపడినట్లే సుందరి వదనారవిందము మెఱుపుతీగవలె దేదీప్యమానమై అతని హృదయమున నాటుకొనియున్నది. మరల్చుకొందమన్నను అతని మనస్సు మరొకవంకకు బోకున్నది. ప్రథమసందర్శనమునందే ఆమె నాతడు గాఢముగా ప్రేమించెను.

అయితే స్వజనమును గోల్పోయి, తల దాచుకొనుటకు నీడయైన లేని ముకరాబ్ ఖానునికా బాలిక లభించుట సాధ్యమా? తా నెక్కడ? బంగారు ఇసుకతో మెఱయు ఘూల్మర్ నదీప్రసాదమైన సుక్షేత్రఖండమున కధిపతి, శ్రీమంతుడునైన డోస్ట్ మహమ్మదు పుత్రిక జులేఖ ఎక్కడ? వారి ముందు నిలుచుటకు కూడ తన కప్పటికి తాహతు కనబడుటలేదే! లేకేమి? నిన్నటి ఉదయ మీ పాటికి అంతయు బాగుగానే ఉన్నది. నిన్న సాయంత్రము ఇంచుమించుగా వంశక్షయమై అతని బ్రతుకు పరమ సంశయస్థితిలో పడినది. ఇటువంటి యద్భుత పరిణామ పరివర్తనములు ఏన్నో చూచికదా

(21 వ పేజీ చూడుడు)

కథానిక:

స్వగతం

రచన: "నారిర్"

ఆ చిన్న మాట...నాలుగుగోడల విశ్వంలో ఒక విప్లవం తెచ్చింది. తను అనుకోలేదు, కలలో కూడా...ఇలా జరుగుతుందని...కానీ, అది జరగనే జరిగింది. అమృతపాత్ర పగలనే పగిలింది. అందులోని మధురరసం నేలలో యింకిపోయింది. ఆశకలాలు శూన్యంగా చూచినయి. నేల ఒక నిట్టూర్పు విడచినట్లు తోచింది. ఒక విషాదగీతికను చదివి...అనంతంలో కలసిపోతుందేమో.. భయంకూడా వేస్తుంది. ఆ మధుర సన్నివేశాలు జ్ఞాపకంవచ్చేకొలది...ఆ చిన్న సన్నివేశం కాలగర్భంలో కరగిపోయేలాగుంది. కానీ, ఆ ద్వేషానికి పట్టపగ్గాలులేవు...ప్రచండ యానం చేస్తూంది. ఆ ఘర్షణ ఎంత చక్కగా అమరింది!...బాధ, సంతృప్తి అనూనంగా పెనవేసుకున్నవి. కానీ సవతి తల్లి బిడ్డలు మిళితమవలేకపోయినై. దానికే ఇంత బాధతో కూడిన తృప్తి!

"దీని కంతటికీ పెద్ద కారణమేమైనా వుందా?"

"ఏమి లేదంటూ," తడబడినవి, పెదవులు... కాని హృదయం హోరుమన్నది.

"ఉన్నది......ఉన్నది."

"ఛా, నైచ్యానికి పాలుపడుతున్నావ్... నిందితుడుకాని, నిందితురాలుకాని తన్ను సంరక్షించుకోలేని అదను చూసి... వెనకపోటు పొడుస్తున్నావ్. నీ పురుషత్వాన్నే స్థాయిగా తీసుకుని, ఆ పునాదులమీదనే నీ ఆరోపణలు చేస్తున్నావ్...కానీ...ఒకసారైనా ఆలోచించావా, అవి ఎంత సంకుచితాలో?"

"మరి, నేను అంత ఆలోచించలేదనేనా... నీ సందేహము? నేను ప్రాణానికి ప్రాణంగా చూస్తున్న వ్యక్తిపై సంకుచిత ఆరోపణలు చేస్తున్నాననేనా? ఎంతగా నిందలు మోపుతున్నావు?"

"అదికాదు...ఆ వ్యక్తితో నీ సన్నిహితత్వాన్నీ...మీయిరువురి ప్రేమనీ, నేను సంశయించనంతే...కానీ, నీ పురుషహాంకారాన్ని అలా ప్రక్కకు నెట్టావా యీ సందర్భంలో?"

"ఏమో, నీవు చెప్పేది నాకేమి తెలియడం లేదు"

తను నడుస్తున్నాడు... తెలిసిన త్రోవే. దానికై అవే పోతున్నై. పాదాలు, గుంపును తప్పుకుంటుందా ఉత్సిత శరీరం. ఆ దిగుడులో ఊతగా పట్టుకున్నాడు. తను ఆ యినుపకమ్మిని. అక్కడ మెట్టు పగిలింది...ఆ బ్రిడ్జిది. కాలు గుంటలో పడింది, పరధ్యానంలో బెణికినట్లుంది కూడా.

పద్మతో తనకు పెళ్ళయినతర్వాత రైలులో వచ్చిన మొదటిరోజు...కబుర్లుచెపుతూ...కళ్ళతో త్రాగుతూ నడుస్తుంది..."అమ్మోయ్"... ఒక చిన్న కేకవేసింది వాడుకలేనిచెప్పుల్లో వణికిపోయింది...తనమీద వ్రాలిపోయింది. ఆ పగిలిన మెట్టుమీద పడింది కాబోలు నిలుపులేని పాదం. కాలు బెణికింది కాబోలు...ప్రక్కన పోతూన్న ప్రయాణీకులంతా తనకేసి చూశారు. ఈర్ష్యగా...అలానే తన ప్రాపుతో క్రిందకు దిగినది...నును సిగ్గుతో. "వెయిటింగు రూము"లోకి దారితీశాడు తను. బెణికిన పాదం పట్టుకొని, పరిచేయబోయాడు తను. నమ్రత, భయం ...ఆదుర్దాలతో గబుక్కున పాదాన్ని లాగేసుకుంటూ, లేచి నిలబడినది. "బాగైంది," అంటూ తన్ను తాను తొందరపడిస్తూ లేచినది.

తన్ను చూసి, చిరునవ్వు మొగం పెట్టాడు, ఆ పేపరు కుర్రాడు. ఎందుకలా నవ్వుతాడు.

అలాగే కుంటుతూ నడుస్తూంది పద్మ. "ఎక్స్‌ప్రెస్" పేపరు అడ్డుపెట్టాడు. ఆ కుర్రాడు, ప్రయాణానికి "హిందు"లో సినిమాలపేజి ముందుకు త్రోశాడు...ఖాతాదారుడి, రుచి తెలిసిన బట్లరులాగు, తను వార్తల్లో మునిగి పోయాడు కాబోలు. చిన్నగా దగ్గింది తాను న్నానంటూ...తన ఆలస్యం ఎడ విసుగెత్తినట్లుంది, పద్మకు. విభ్రాంతుడై ఒక అడుగు వెనక్కి వేశాడు...ఆ పేపరు కుర్రాడు. తెలుసుకున్నాడల్లేవుంది. యిప్పుడు తానొక్కడేకాదని. ఇన్నినాళ్ళ పరిచయాన్ని విస్మరిస్తూ...ఎంతగా పెనవేసుకుంటుందీ, వివాహబంధము...సొంత ఆస్తిని చూసుకున్నట్లే!

చేతిలో బ్రష్, బూట్‌పాలిష్ డబ్బా, తన బూట్లు దుమ్ముతో నిండివున్నాయి అంటున్నాయి అతనికళ్ళు.

అతని కళ్ళలోని నీలిమ...తన బూట్లు! తన ముఖంకేసి చూసి, పద్మ నవ్వింది. ఆ రోజు పద్మ కుంటడం చూసి పాలిష్ అబ్బాయి నవ్వాడు. తక్షణమే న్యూనతతో తలవంచుకుని, ముందుకు కదలింది, పద్మ.

"హల్లో" అంది ఎవరోమరి, తెలిపోను ఆపరేటరు.

"ఇప్పుడే వచ్చినారల్లేవుందే," అని సంబోధించింది, తన పరిచయాన్ని తెలియజేస్తూ. ఆ నాడుకూడా. పద్మకేసి, ఎగాదిగా చూసింది, అప్పుడు. తనలాగే గుడ్లు అప్పజెప్పి నిలుచున్నాడు. పద్మచేతిపట్టు తన వ్రేళ్ళమీద చల్లగా ఘనీభవించింది.

హృదయం చల్లబడింది, ఆ చల్లటి యినుపకమ్మి తగిలాక. శీతల తుషారాలు తగిలినప్పుడులా...వివేచనాశక్తి, సహనంతో ముందుకు జరిగింది. కారణం కనుగొనలేని మందడుగు.

ఎప్పుడూ తాము ఎగతాళిగా అనుకున్న మాటే...ఈ రోజు యిలా వికటించింది! తనే ఎంతో సానుభూతి చూపేవాడు, ఆ యిల్లాలి సహనానికి, తను నిందించేవాడుకూడా, అతనిని ...కానీ ఈ రోజున పద్మ అంటే...తనకెందుకింత కోపం వచ్చింది?

ఛా, తను ఎందుకింత అవ్యక్తంగా ప్రవర్తించాడు?...ఏదో పొరుగింటివాళ్ళ మాటకోసం, ఎందుకలా తన ప్రాణంలా చూసుకుంటున్న పద్మమీద కోప్పడ్డాడు? నానా దుర్భాషలాడాడు! చిరాకుగా డ్యూటీ మీదకి వచ్చాడు.

మొదటినుండి తుదివరకు ఇదే తంతు...ఎంతటి అసంతృప్తి. చూడు ఆ తల్లి ఎలాగు చూస్తుందో, ఆ కుర్రడికేసి, చెల్లెల్ని అలా మొరటుగా నెట్టేడకేనా?

తను చిన్నప్పుడు చెల్లెల్ని ఒకపరి కొట్టాడు. తప్పుచేసిందని. అది ఏడుస్తూ అమ్మ దగ్గరకు వెళ్ళి చెప్పింది. అమ్మ, సంగతేమిటి? అని విచారించనయినా విచారించక...తన్ను చావమోదింది. "చెల్లెల్ని కొట్టొచ్చా?" అంటూ ఏం? ఎందుకు కొట్టకూడదు, తప్పుజేస్తే?... తన్ను తప్పుచేయందే చావమోదుతున్నప్పుడు... అమ్మను మరి...

ఆ అబ్బాయి తనకేసి బిక్కగా చూచాడు. చెల్లెలిమీద ఈర్ష్య తన చెవిలో గుసగుస లాడింది. ఎంతగా బాధపడిందో...ఆ చిన్నగుండె. పాపం! తన సానుభూతిని కనుగొన్నాడులావుంది, తనకేసి వచ్చాడు ఆ కుర్రాడు. అప్రయత్నంగా, ఆ పాలబుగ్గల్ని కితకితలు పెట్టున్నై, తనవ్రేళ్లు! తాను చిన్నప్పుడు ఇలాంటి సన్నివేశంలో పడిన బాధ వేయిము ఖాలుగా కనుపించింది, ఆ చిన్ని ముఖంలో, తన్నప్పుడు అనునయించే వాళ్లు కూడాలేరు! తానిప్పుడు అనునయించ గల్గుతున్నాడు...!...ఏమిటో, పిచ్చి తలపులు!

"డ్యూటీ"కి వేళైంది. త్వరగా వెళ్ళాలి. ఆలస్యమైతే పెద్ద డాక్టరు కోప్పడుతాడు. ఏనిమిదైందిలాగుంది, బళ్ళోకి వెళ్తున్నారు విద్యార్థులంతా.

అలాగే వెళ్ళేవాడు తనూ బడికి. రోడ్డుమీద...ఆ వేళనుంచి...ఈ వేళకు తూలుతూ! ఎన్నిసార్లు జట్కావాలాలు, కారు డ్రైవర్లు విసుగుపడేవాళ్ళో...ఏమేమో తిట్టేవాళ్లుకూడా ...తనకేసి పిచ్చివాడికి మల్లేచూచి నవ్వుకునే వాళ్లు, తోటికుర్రాళ్ళు!...పళ్లుయికిలించేవాళ్లు, ఆ అమ్మాయిలు తెలివి తక్కువ దద్దమ్మని చూసినట్టు...కాలుతున్న సిగరెట్టుపీకత్రొక్కి చిందులు వేసినప్పుడల్లా!...పిచ్చివాళ్ళకేం తెలుసు. స్కూలుకు ఆలస్యమవడం, బెంచి ఎక్కడం తన కెంత అలవాటైందో, తన్ను చూసి కిచకిచలాడడం కూడా అంత పరిపాటై పోయింది, ఆ విద్యార్థినులకు.

తను చక్కగా వ్రాశాడు పరీక్షల్లో. మొదటి మార్కు వస్తుందని కలలుకన్నాడు కూడా... కానీ పేపర్లు యిచ్చిన రోజు తెలిసింది. మొదటి మార్కు ఒక అమ్మాయికి వచ్చిందని, తను చూశాడు కూడా ఆ పేపరుని తనదానికంటె ఏం బాగుందని?...తను అడిగాడు మాస్టర్ని, ఏంలేదు, కానీ...అర్థోక్తిలోనే నిలచిపోయాడు, మాస్టరు. విద్యార్థిని అనేనా?

స్త్రీలు...ఎందుకీ అనర్హమైన, అధికృత యివ్వడం. స్వశక్తిమీద తెలివితో సంపాదించుకున్న స్థానాలకుగానీ విలువ, మగువలు...తమల్ని ప్రోత్సహించాలి. అని స్థానాల్ని అర్హతల్ని దోపిడిచేస్తా రెందుకో.

ఎందుకలా, అనూయగా వెకిలిగా చూస్తారు. ఆ చదువుకుంటున్న అబ్బాయికేసి వారికేసి చూడలేదనేనా?

తను వీలున్నప్పుడల్లా రీసెస్‌లోకూడా ఒక నిముసం వృధాచేసేవాడుకాదు. ఓనాడు, ప్రొఫెసరులేక ఒక గంట వ్యవధి దొరకింది. తాపీగా ఫౌంటెన్‌దగ్గర కూర్చొని, షెర్లాక్‌హోమ్స్ తిరగవేస్తున్నాడు తను. కాలేజిగంట తన్ను మేల్కొలిపింది. తను హాలు వేపునడిచాడు, తను పుస్తకాలు సర్దుకుంటూ. ఏమిటో వెధవ గోల, మనకెందుకులే, అని విసవిస నడుస్తున్నాడు తను. వస్తున్ననవ్వును అణచి పెట్టుకుంటూ, తనకేసి చూస్తున్నాడు ప్యూను. "బట్టే" "బట్టే", ఆ హాలులో ప్రతిధ్వనించింది. విద్యార్థిని వెనుకనుండి విసవిస నడచి వచ్చింది. "పాపం" తన వీపుమీద చేయివేసింది. తను ఉలిక్కిపడ్డాడు. తన తలపులు వెనక్కి వెళ్లినై. తనెవ్వరికైనా హానిచేసానా? అని తర్కించుకోడానికి. "ఏమిచేయలే" హామీ యిచ్చింది. మనస్సు, ధైర్యంగా తలెత్తి చూచాడు తను. శిబరూపంలోవున్న "బట్టే", చక్కని అంగసౌష్ఠవంతో, తన ముఖంలోకి నవ్వింది. "బట్టే" వల్లించుకున్నాడు తను; గొల్లుమన్నై ఆకాకలీకంఠాలు తను తలవంచుని వచ్చాడు.

తలవంచుకునేరావాలి, మరి. ఆ గేటు కాపలావాడి నిర్లక్ష్యాన్ని చూసాంటూ... ఎలా తలెత్తుక రావడం. వాడి కంటికి వైద్యాలయాధికార్ల డాక్టర్లు నలుసుల్లాగా కనుపట్టారేమో? పెద్ద డాక్టరుగారువస్తున్నా, అంతేకానీ, ఓనర్సు వస్తుందంటే, అంత హడావుడి పడతాడెందుకు? ఏవో దుష్టశక్తులు పనిచేస్తున్నై, వీటి వెనకాల.

ఆ సన్నివేశాన్ని, తలచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. తలవంచుకునే వెళ్తున్నాడు, తను ఆ గేటు గుండా, ఏవో గాలిమేడలు కట్టుకుంటూ; "సార్" అనే సంబోధన తన పాదాల్ని బంధించింది. ముందు, వెనుక పరకాయించాడు, తను. చూపుమేర దూరంలో ఎవరూలేరు. మరి నాలుగడుగులు వేశాడు తను ముందుకి. మరలా, అదే సంబోధన. వెనుదిరిగి చూచాడు తను. "మిమ్మల్నే, సార్" అందుకున్నాడు, ఆ నిర్లక్ష్యపు వెదవ. మరలా మెదలకుండి పోయాడు. శ్రీవారి దగ్గరకు రావాలని కోరుతున్నారేమో గేటు దొరగారు. "మీ కోసం, ఎవరో కాచుకకూర్చున్నారండి." వెధవలయ్యారులే, అందామనిపించింది. వెధవ, లేవనైనాలే పీకనులమేస్తామనిపించింది. "ఒరేయ్, రామూ డాక్టరుగారుకోసం, ఎవరో వచ్చివున్నారని చెప్పావుట్రా." విసవిస నడచి వచ్చింది. ఆ నర్సు, "చిత్తం, చెప్పానమ్మా అంటూ లేచినిలబడ్డాడు. ఆ పీనుగ. నర్సుకున్నంత గౌరవం, డాక్టరుకు కూడాలేదు. పమిదల్లోవేసి కాల్చినట్లయింది హృదయం.

స్పిరిటు దీపంలో కాలుస్తుంది, యింజక్షను సూదిని, లీలావతి ప్రక్కనచేరి చూస్తున్నారు. ఆ విద్యార్థులంతా. "గుడ్‌మార్నింగ్, రావుజీ" ఆమె తన్ను సంబోధించింది. అప్పుడే తెలుసుకోగల్గారు, వాళ్లంతా, చిరుచెమ్మటపోసి ఆమె ముఖం కళకళలాడుతుంది.

ఆ కళకళలాడేముఖమే, తనొక్క పరిమళించింది. చర్మ పరీక్షలో ఆరితేరాడు తను. ఆ వైద్యాలయంలో. మెట్టుమీదినుండి, మెట్టుమీదికి మల్లే, ఎక్కాడు తను ప్రముఖ నిర్వాహకులలోకి. తనతోకూడానే వచ్చింది. సహాయ నిర్వాహకగా, లీలావతి. తన కెన్నోమార్లు అమూల్యమైన సహాయం చేసింది. తానెంతో పైకి తీసుకువచ్చాడు కూడా, ఆవిడని. తనో చెల్లెలి మాదిరి చూచేవాడు లీలావతిని ప్రపంచం ఎన్నుకున్నా. అలా వస్తున్న వాత్సల్యము ఒకపరి కుంటుపడింది.


ఆ రోజు ఒక పర్వదినంలాంటిది. ప్రభుత్వం కొంతమందికి ఆయా విశేషాలలో, ఆ దేశపు శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఇతోధిక శాస్త్ర శిక్షణ యివ్వాలని నిర్ణయించింది. చర్మ పరీక్షలో ఆరితేరినవాడిని ఒకరిని పంపవలసిన అవసరం. రాష్ట్రవైద్యాలయానికే వచ్చింది. తన సహచరులంతా, ఎంతో అభినందించారు, తన సామర్థ్యమని, ఆ అవకాశం. నిజానికి తనకంటె మిన్నలెవరూకూడాలేదు. తను, ఆ సదవకాశాన్ని జారవిడువదలచుకోనూలేదు. వైద్యాలయాధికారికూడా తన్నే సమర్థుడిక్రింద తెలియ వ్రాశాడు. ఆ తలంపుతోనే, తాను బిచాణా కట్టి సిద్ధంగా కూర్చున్నాడు. కానీ...ఆ తాకీదురానే వచ్చింది. స్త్రీ విద్యను ప్రోత్సహించే వుద్దేశంతో, లీలావతి ఎన్నుకోబడిందని. ఆశీస్సులు అందుకోవచ్చేలాగు, అందిస్తూనే, ఆమె మెత్తనికరాలు విషసర్పంలాగు పెనవేసుకున్నై, స్పిరిటు దీపం మంట వెలవెల పోయింది.

నిప్పుకణిక మాదిరి, ఎర్రబడింది, అనూయ ఆమె తన పనిమీద వెళ్లిపోయింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ముందుకుపోతున్నై తన పాదాలు. మంచియైన ఫినైల్‌వాసన ముక్కులు పగులకొట్టుంది. హడావుడిగా పరుగెత్తాడు ప్యూను, తనకేసి.

అలాగే పరుగెతాడు, అతను ఆ రాత్రి. తను డ్యూటీలో వున్నాడు. తన వార్డులో ఒక రోగి విపరీతమైన బాధపడుతున్నాడు. భయంకరమైన మంటలట, వళంతా, చస్తున్నానని తలమోదుకున్నాడు. నివారణానికి ఓయింజక్షను యివ్వడానికి తయారయ్యాడు, తను. ప్రక్కనే వార్డులో గొల్లుమన్నారు. అప్పుడే వచ్చాడు, అతను. తన భార్య చనిపోబోతుందని, తను రక్షించాలని కాళ్లా వ్రేళ్లా పడ్డాడు. తన రోగిని చూసి, తర్వాత వస్తానని సముదాయించాడు అతనిని. "ఆరోగ్య స్త్రీ అండీ" ప్రక్కన అందుకున్నారు, ఎవరో. తన వళ్లు మండింది. కాని అతన్ని చూసి జాలిపడ్డాడు తను, ఎలాగైతేనేం, తను ఆమెకు చికిత్సచేసి తన వార్డుకు పరుగెత్తాడు కానీ...అప్పటికే అంతా అయిపోయింది. తనరోగి, ఆ మంటనుండి, ఈ ఐహిక సంబంధాలనుండి విముక్తుడయ్యాడు. తనెంతగానో బాధపడ్డాడు. తను చికిత్సచేసిన స్త్రీ యెడల అనూయ పడ్డాడు కూడాను. తాను ఆ విణ్ని చూడకపోతే, తన రోగే బ్రతికేవాడేమోనని. దేనికైనా పిలుపు రావాలి. సముదాయించుకున్నాడు తను.

"మిమ్మల్ని ఫోనులో పిలుస్తున్నారండి," తెలియ చెప్పాడు ప్యూను.

"పద్మ భావిలో దూకింది" ఆ యినుప గొట్టంలో వినపడింది. తను, అలాగే కదిలాడు, అక్కడనుండి...అంతే మరి.



బ్లాచ్మన్‌పట్టణం. పిల్లలు స్వహస్తాలతో ఇళ్ళు, పార్కులూ, రోడ్లూ పట్టణమంతా స్వంతంగానిర్మించుకొన్నారు.

పిల్లల పట్టణం

పిల్లలకు చదువుచెప్పటంలో ప్రశస్తమైన పద్ధతి ఏదో, ఆ చెప్పవలసిన చదువు ఎల్లాంటిదో, ఏ చదువు ఎల్లా చెప్తే, భావిపౌరులుగా, ప్రయోజనపరులుగా, పిల్లలెల్లా అవగలుగుతారో అన్న సమస్యలు ప్రపంచమంతటా, విద్యాబోధకులను, విద్యాశాఖా ప్రవీణులను అలయిస్తూనే ఉన్నాయి.

పిల్లలకు చెప్పే చదువులో పిల్లల కుత్సాహం కల్గించాలన్నది. ప్రాథమిక సూత్రమే. కాని ఏది ఉత్సాహంకల్గిస్తూందో, ఏది, విషయేతర కుతూహలాన్ని మాత్రమే రెచ్చగొట్టూ, చెప్తూన్న చదువు మనస్సుకే అంటకుండా పోకుంతో చెప్పటం చాలా కష్టం. శిశుమానసిక శాస్త్రవేత్తలు చాలామంది, ప్రాథమిక విద్యావిధానాలను అనేకమైనవాటిని సూచించారు. ప్రభుత్వాలుకూడా, చాలావాట్లను అమలులో పెట్టి చూచాయి. కాని ఆ విధానాలలోని ఏ అంశ గ్రతల్లనో ఏమో, పూర్వపు భట్టీయపు చదువులే మెరుగా అని అనకొనే అభ్యుదయ నిరోధక భావాలనే పక్కి ప్రజలో కల్గించేటంత అసమగ్రాలుగా అయిపోయినయి. ఈ విషయాన్ని ఉదాహరించటానికి, శ్రీ చింతా దీక్షితులుగారి ఏకాదశికథల సంపుటిలో, కొడుకున్నవీన "పద్ధతుల్లో చదువుచెప్ప యత్నిస్తూన్న తండ్రివి" చూపెట్టిన కథా, భారతిలోని, "ఇంటి అల్లుడొస్తే తన ప్రాక్టికల్ విజ్ఞానమంతమా చూపిస్తూ నవీన పద్ధతిని వంట చేయబూనిన కూతురు" కథా, పరికిస్తేచాలును. ఆకథలు కేవలం సునిశితహాస్యంకోసం శ్రీదీక్షితులగారు రచించినవే. ఉద్దేశపూర్వకంగా గాని అనుద్దేశపూర్వకం గాగాని, ఈ నవీన విద్యాబోధన పద్ధతులను ఆయన "ఎద్దేవా" చేయటం ప్రయోజనంగా పెట్టుకోని ఉండకపోవచ్చును. కాని ఆచదువుల పరిస్థితిలో ఉన్న యాదార్థ్యత వల్లనే ఆకథలు అంత చక్కని హాస్యకావ్యాలుగా తయారయాయి.

శిశువుకు, బోధనాసమయంలో కుతూహలం గల్గించాలి, ప్రత్యక్షజ్ఞానము సమకూర్చిపెట్టాలి, అనే సూత్రాలు భట్టీయపు చదువు విధానం కన్నా చాలా మెరుగే. కాని సరియైనవిధానం లేకుండా, వీటిని అమలులో పెట్టటంలోనే అవకతవకంతా జరుగుతుంది.

"చదువుతూన్న చదువులో పిల్లదికి ఉత్సాహం ఉండాలి, సంతోషం ఉండాలి, ఆ చదువులందు జీవితంలో ఎదుర దిగదులన్నీ చదును చేసికొని చక్కచేసికొనేందుకు ప్రయోజనకారిగా ఉండాలి" అని చూసుకొంటే, ఈ విధానం చక్కగా అవలంబిస్తున్న విద్యాసంస్థ, కాలిఫోర్నియాలోని, బ్లాచ్మన్ పట్టణంలో కనబడుతుంది.

అధునిక విద్యాసంస్థల కన్నిటికీ మార్గదర్శిగా కనబడుతుండే విద్యాసంస్థ. "మిసెస్ బినా ఫుల్లర్" అనే ఆమె ఈ విద్యాసంస్థను స్థాపించింది. అమెరికాలో విద్యావిధాన పండితుడు డ్యూయీ, "పిల్లలబడి అనేది, పిల్లలకు జీవితంగానే ఉండాలి" అన్న సూత్రము నిర్వచించాడు. "ఆయన సూత్రానికి, ప్రత్యక్షంగా కన్నుల చూచి, ఆ స్వాదించగల విశిష్ట రూపాన్నియ్యటానికే నేను చేసిన ప్రయత్నమంతా" అంది ఆమె.

పదిహేనేళ్లక్రింద, సూక్ష్మ బీజరూపాన ఆమె స్థాపించిన విద్యాసంస్థ నేడొక "పిల్లల పట్టణం" రూపందుకొంది. లాస్ ఏంజెలీస్ పట్టణానికి నూరుమైళ్ల ఉత్తరాన్న ఓ, చిట్టడవి అంచున, సాంటా మేరియా పట్టణ పరిసరాలో జనపథాలకు దూరంగా ఆమె, ఈ "బ్లాచ్మన్ సిటీ" అనే చేరిటి పిల్లల పట్టణాన్ని స్థాపించింది. పట్టణం ఎంతో పెద్దదిగాదు. 20,000 చదరపు అడుగులు మాత్రమే వైశాల్యము. కాని ఆ కాస్తపట్టణంలోనే, చిన్నిపాయిదాలో, ఆధునిక విధానంలో పిల్లలు స్వయంగా నిర్మించిన, రాజబాటలు, చక్కని సౌకర్యాలున్న ఇళ్లూ, తదితరపట్టణ ముఖ్యకార్యకలాపాలన్నీ నడిపే, తపాలా ఆఫీసు, బ్యాంకు, గ్రంథాలయం, వస్తుప్రదర్శనశాల, వైద్యశాల, వార్తాపత్రికా కార్యాలయం, వ్యాపారకేంద్రమయిన ఛేంబర్ ఆఫ్ కామర్స్, బాటసారులకు తీర్థయాత్రికులకు సౌకర్యాలుగూర్చే, వసతిగృహాలు ఇన్ఫర్మేషన్ బూరో, చిల్లరదుకాణాలు, పెద్దదుకాణాలు, పిండిమరలు, పచ్చికసలాలూ చెట్లూ, శుభ్రంగా, అందంగా ఉంచిన పార్కులూ, సరస్సూ, ఇల్లా పట్టణానికి ప్రయోజనమూ, అందమూ, కల్గించే ప్రతి చిన్నవిషయమూ ఉన్నాయి.

ఆ పట్టణం పాలించుకొనేవాళ్లూ, నడుపుకొనే వాళ్ళూ పట్టణపౌరులూ, అంతా పిల్లలే. వాళ్ళే, తమ పురపాలకాధ్యక్షుని ఎన్నుకొంటారు. వాళ్లే తమ పురపాలక సభ్యుల నెన్నుకొంటారు. వాళ్ల ధనం చెలామణీ అంతా వాళ్లే అచ్చేసుకొన్న ప్రత్యేకరకం కరెన్సీలో ఉంటుంది. వాళ్ళ బ్యాంకులు, దుకాణాలు, తపాలాఆఫీసులు, ఇత్యాదులు, నడిపే పిల్లలకు జీతాలు, ఆ నాణాలలోనే నియమితంగా ఇస్తారు.

బాలవైద్యులు ప్రాథమిక చికిత్సలను బాగా నేర్చుకొని, చిన్నచిన్న అనారోగ్యాలన్నిటికీ అక్కడే మందులిస్తారు. ఇళ్ళుకట్టుకోడం ఇంటి యాజమాన్యం, సరిగ్గా ఇల్లు నడుపుకోటం, ఖర్చులూ జమలూ, ఆధునిక పద్ధతులలో స్వయానికి లెక్కలువ్రాస్తూ బ్యాంకింగ్ విధానాలునేర్చుకోవటం, తోటలు పెంచటం, ఆకు, కాయ, దుంప, కూరలను, పండించి, ఫలితం అందటం, వడ్రంగం, ఒకటేమిటి, ఇల్లా అనేకమైన ప్రయోజనకరమైన జీవిత వృత్తులను, "ఏదో నేర్చుకోక తప్పకవచ్చిందికదా" అన్న బాధతో కాక కులాసాగా, తమాషాగా, జీవితబాధ్యత వహిస్తున్నమన్నా హుందాతనంతో, తమ యిష్ట ప్రకారం తాము కట్టుకున్నపట్టణంలో సగర్వంగా, ఉత్సాహంతో, ప్రతిభాస్ఫోరకంగా, నిర్వహిస్తూనేర్చుకొంటారు.


మొట్టమొదట మిసెస్ ఫుల్లర్, చిన్నబళ్లో పంతులమ్మగా ఉంటూ ఉండేది. అప్పట్లో, లోకంటి పాటగా, నిర్జీవంగా ఉండే, చదువును, అలవాటు జేసుకోటానికి పిల్లలుపడే బాధంతా, చూసేది. ఆమెకు ఉపాధ్యాయత్వము జన్మసిద్ధము. ఆమె మనస్సుకు, పిల్లలమనస్తత్వాన్ని అవగాహన చేసుకొనే శక్తి అపారంగాఉండేది. చదువుకు అలవాటు పడేందుకు వాళ్లు పడే బాధా, ఆటపేరట ఏపనిచేయించినా, వాళ్లకుండే ఉత్సాహము శక్తి—ఇల్లు కట్టుకున్నా, రైలు ఆట, తపాలాఆట, తోటపనుల ఆట,—ఇల్లాంటివేవి చెప్పినా, వాళ్లల్లోకలిగే ఆసక్తి, ఇవన్నీ బాగా పరిశీలించి అవగాహన చేసుకుంది. పిల్లల విద్య గరపటానికి ఉత్తమవిధానం, ఒక్కటే అని ఆమెకు పొడగట్టింది. పెద్దవాళ్ళయ్యాక జీవితంలో వాళ్ళు వాళ్ళు చెయ్యాల్సిన పనులన్నీ, ఆటలుగానే, ఆటలే జీవితంగానూ, బాలప్రాయంలోవాళ్ళకు చక్కగా సమకూర్చిపెట్టాలని అవగాహన చేసుకొంది.

కాలిఫోర్నియా, నూనెగనుల కార్మికుల పిల్లలకు, బ్లాచ్మన్ జిల్లాలో, విద్యాకేంద్రము స్థాపించవలసిన అవసరం వచ్చింది. ఆ అవసరాన్ని, మిసెస్ ఫుల్లర్ తన అభిమానపద్ధతికి అనువుగా వినియోగించుకొంది.

మొట్టమొదట ఆ ప్రాథమిక పాఠశాలకున్న వల్లా రెండే గదులు. కార్మికుల పిల్లలు ఆ గదుల్లో క్రిక్కిరిసి ఉండేవారు.

స్వల్పంగా తన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. అక్కడే ఒకమూల, చిన్న విభాగం చేసి, "దుకాణం" అని పేరుపెట్టింది. అక్కడి సామాను కాపలా, ఇచ్చిపుచ్చుకోటాలు, యజమాన్యం, అంతా ఒకరిద్దరు పిల్లలమీద పెట్టింది. ఇంకోమూల, చిన్న కటకటాల తలుపూ, దాంట్లో ఒక ఇనుపఅల్లిక కిటికీ పెట్టి, "బ్యాంకు అని బోర్డువ్రాసింది. ఆ బ్యాంకు నడిపేందుకు మరికొందరు పిల్లలు ఉత్సాహంతో బయలుదేరారు.


పిల్లలతో "పట్టణం" కట్టుకొందామంది. పిల్లల



పిల్లలు స్వతంగానడుపుకొంటున్న పట్టణ తపాలాఆఫీసు.



పిల్లల స్వంతంగా నడుపుకొంటూ



పిల్లలచిత్రకళాప్రదర్శనాలకు ప్రసిద్ధచిత్రకారులు తమ చిత్రాలను ఇచ్చారు. పిల్లలు వాటి అలంకరణంలో వివేచన చూపిస్తున్నారు.



పిల్లల గ్రంథాలయం.

ంతో పాటికి పట్టపగ్గాలు లేకపోయాయి. తమ ఇళ్ళు తామే కట్టుకొంటామన్నారు.

ఇళ్ళప్లానులు వాళ్ళే కలిసి గీసుకొన్నారు. ళ్ళ అలంకారాలు ఆడపిల్లలు స్వయంగా నాస్తామన్నారు. ఏయే వస్తువులు కావాలో ట్లన్నిటికి పెద్దపెద్ద వ్యాపారసంస్థలకు వాళ్ళే ్వయంగా ఉత్తరాలు వ్రాశారు. ఈ పిల్లల త్తరాలుచూసి, ఆ వ్యాపారాల్లో వాళ్ళు రిసిపోయి, అందరికన్నా ముందు పిల్లలకు వలసిన సప్లయిలు చేసేందుకు ఉత్సాహ డ్డారు.

నూసెకనుల కంపెనీ అధ్యక్షుడు, స్వయంగా ంతభూమిని ఈపట్టణనిర్మాణానికి, దాన ట్టాతో ఇచ్చేశాడు. తక్కినకంపెనీలు, ఇసుక, న్నం, కలప, కంకర, సిమెంటు, రంగులూ, న్నీ పంపించాయి. ఆ వృత్తులలో ప్రవీ లంతా, స్వయంగావచ్చి, పిల్లలకు సలహా స్తూ దగ్గరుండి పనుల్లో సాయంచేశారు. నూసె నుల అధ్యక్షుడు, స్వయంగా తనూ ఓ లీ నమూచే బాడీగా పుచ్చుకొని పిల్లలతో, లుపులూ, ద్వారబంధాలూ, వాసాలూ యారుచేసాడు.

గురువులకూ, శిష్యులకూ కూడా ఈ బోధనా పద్ధతి, అమితోత్సాహంకల్గించేది. లెక్కలంటే, క్కలంటే తలనొప్పి పోయింది. ఇప్పుడు డంగంలో, చతురశ్రాలు, వైశాల్యాలు ట్టాలంటే, స్వంతపనిలాగా త్సాహం, ఆనందం, పుట్టుకొచ్చాయి. గారుబిల్లులు, బ్యాంకు లెక్కలకోసం, ప్రతి వాడికి స్వంతఅవసరంగా. నేర్పవలసివచ్చాయి.

స్వంత తపాలాఫీసు నడుపుకోవటంలో, జాగ్రఫీ పాఠంలోని, కొండల, నదుల, ఎగుడుదిగుళ్ళు, బంజరనాలూపోయి, ఉత్తరంవెళ్ళే,వచ్చే, ప్రతి ఊరూ, ఎక్కడెక్కడిదో, ఆ ఊరు వింతలేమిటో, ఊరికెటుపోవాలో. ఏమేమి కావాలంటే, ఏ ఊళ్లో దొరకుతాయో, ఏ ఊళ్ళో ఏమి ప్రసిద్ధో, ఎక్కడ ఏ కాలంలో ఎండ తెక్కువో, వాన తెక్కువో, శీతువు ఎల్లా ఉంటుందో, ఉత్తరాల రాకపోకల్లోనే, తపాలాఫీసు నడుపుకొనే విజ్ఞానంలోనే, స్వానుభవంగా అన్నీ తెలవటమేకాకుండా, తెలియని కొత్త విషయాలమీద ఉత్సాహం బయలు దేరింది. ఫ్రెంచి, ఇంగ్లీషు, జర్మన్ తపాలా బిళ్ళలతో ఉత్తరాలు వస్తూంటే, ప్రపంచ నానాదేశాల విషయాలు ఉత్సాహం కల్గించ సాగాయి. అక్కడక్కడి వాళ్లకున్న జీవిత సమస్యలుకూడా, సూక్ష్మంగా ఆ ఉత్తరాలను బట్టే, కులాసాకబుర్లుగా అవగాహనమౌతూ వచ్చాయి. పర దేశాలుఅంటే, ఆదరం, అభిమానం, స్నేహం, సర్వమానవ సౌభ్రాతృత్వానికి బీజాలు—ఆ, తపాలాఆఫీసు నడుపుకోవటంలో పై పూతగా, పసిమనస్సులకు, అలుముకొంటూ వచ్చాయి.

పదిఏళ్ల బట్టీ, ఈ పిల్లల పట్టణమైన "బ్లాచ్మన్ పట్టణం" విద్యాబోధకుల కందరికీ, కాశీరామేశ్వరాలవంటి తీర్థక్షేత్రస్థల మయింది. బోధనాపద్ధతుల నేర్చుకోటానికి. పంతుళ్లు, విద్యార్థులూకూడా అక్కడికిపోయి చూసివస్తూంటారు.

చదువుపేరైనా తలపెట్టకుండానే అక్కడి పిల్లలకు కల్గిన విజ్ఞానాన్ని చూసి, ఈ పండితులంతా ముక్కుమీద వేలువేసుకొని తిరిగి వస్తూవుంటారు.

ఆపిల్లల పట్టణంలో ఎదిగివచ్చిన పిల్లలకు, బైట ప్రపంచంలోకి వచ్చేటప్పటికి వృత్తులకు కొదువ లేదు. "బ్లాచ్మన్" పట్టణంలో మొట్టమొదట చిల్లరదుకాణం నడిపిన పిల్లడు, ఇప్పుడు కాంటామారి యీపట్టణంలో, పెద్దదుకాణం పెట్టుకొని వృద్ధిలోకి వచ్చాడు. అతనికి సహాయంగా చిన్నవాడు ఆచిల్లరదుకాణం నడిపిన మరిద్దరు పిల్లలు మరో రెండుపట్టణాలలో, అల్లాగే వృద్ధిలోకి వచ్చారు. "పిల్లల పట్టణం" ఆరోగ్యశాఖలో ఉంటూండే బాలికలను, ప్రభుత్వము పెద్దపెద్ద ఆస్పత్రులలో, నర్సులుగా వెంటనే తీసుకొంది. "బ్లాచ్మన్ పట్టణం"లో పిల్లల బ్యాంకులో కాషియర్‌గా ఉన్న బాలుడు పక్కనున్న పట్టణంలో, స్వంతబ్యాంకు నడుపుతూ అభివృద్ధిలో ఉన్నాడు. మొదటి పురపాలకాధ్యక్షుడు, తన స్వంత పుస్తకాలను స్థాపించి, చక్కగా నెరవేర్చుకొంటున్నాడు. ఈనాడు తను యిళ్ళను, ఆదర్శగృహాలుగా ఉంచి చక్కగా నడుపుకొంటున్నామంటే, చిననాడు "బ్లాచ్మన్ పట్టణం"లో తాము, ఇళ్ళు నడుపుకొన్న అనుభవ సుకృతంవల్లనేఅని, అక్కడినుంచివచ్చి పెద్దలైన పిల్లలు చాలామంది చెప్పుకొంటారు.

అమెరికాలోని పెద్దలంతా, ఈ (పిల్లల పట్టణం) పేరు చెప్పుకొన్నప్పుడల్లా, ఓ గొప్ప విషయాన్ని సాధించిన సంస్థలాగా దాన్ని చెప్పుకొంటారు. ఈ సంస్థ విషయమై కొత్త విషయాలు తెలుసుకొందామనుకొన్న వారివ నుంచి ఈ పట్టణానికి రోజూ అనేకమైన లేఖలు వస్తాయి. ఇల్లాంటి ప్రాథమిక విద్యాబోధన ప్రయోగాలను మన ఆంధ్రులుకూడా ప్రయత్నించిచూస్తే. ఉపయోగం ఉండదా?



'న్న ఫ్యాన్సీదుకాణాలు.



పిల్లల మ్యూజియంలో రకరకాల, తపాల స్టాంపులను పోగుచేసి, క్రమంలోఅమరుస్తున్నారు.



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు' రచన: **లూయీ కెరోల్**

8

అనుకరణం : **"ఆప్లవాన్"**

ఇందాకటి తెల్లకుందేలే, మళ్ళీ అడుగులో అడుగేసుకొంటూ, ఏదో పారేసుకొన్నట్టు చుట్టూ నేలంతా కలయజూసుకొంటూ, ఎప్పటి మాదిరిగానే గొణుగుకొంటూ, "అయ్యయ్యో ఈ బోసి చేతులూ, ఈ రూపం, నన్నూ చూస్తే, రాణీగారు ఇంకనన్ను బతకనిస్తుందా? వెంటనే ఉరితీయించేస్తుందే! అసలివన్నీ ఎక్కడ పారేశానో, గొడవ! నామతి మండిపోనూ, అయ్యో, హాయ్యో!" అని గొణుగుకొంటూ వస్తూంది.

పాప, వెంటనే, కుందేలు, మురుగులూ, విసనకర్రా కోసం వెదుకుకొంటూందని గ్రహించింది. కాని అవి ఏమయ్యాయో! పాపకూడా, మంచి పిల్లలాగే, వాట్లని వెదికిపెట్టి, కుందేలుకు సాయం చేద్దామని, తనచుట్టూ వెదకడం మొదలుపెట్టింది. కాని ఏమీ ఎక్కడా కనబడలేదు. ఇందాక తన చేతిలోనే ఉండాల్నే! ఎక్కడ పోయాయో! కన్నీటి మడుగులోనుంచి ఈదుకొచ్చి నప్పటినుంచి అన్నీ తారుమారైపోయినట్లేఉన్నయి. ఇందాకటి ఆ హాలు, ఆ గాజు బల్ల, ఆ చిన్న తలుపూ, అన్నీ ఏమైపోయాయో పూర్తిగా మాయమే అయిపోయినట్లున్నాయి.

పాప అల్లాగే నెమ్మదిగా వంగివంగి చూస్తూ, తనచుట్టూ అటూఇటూ, వాటికోసం చూస్తుంది.

ఇంతలో కుందేలు పాపనుచూసింది. "ఓసి: అప్పలమ్మా' ఇక్కడేం చేస్తున్నావే; పనిమానేసి, దొంగవేషాలు వేసి ఇక్కడ తిరగుతున్నావా! పో! పో! పో! పోయి ఇంటికి పరుగుత్తికెళ్ళి, ఓవిసనకర్రా, జతమురగులు, వెంటనే పట్టుకురా! పరుగెత్తి ఇక్కడనున్నట్టు రావాలి, తెలిసిందా! పో! పో! ఇంకా నిల్చున్నావే" అని గదమాయించింది.

పాప పరుగెత్తుతూ "వాళ్ళ పనిచేసే మనిషి అప్పలమ్మ ననుకొన్నట్లుంది. నేను అప్పలమ్మ నేవిటి! బాగుందే! తీరానన్ను మళ్ళీ చూశాక అప్పలమ్మ కాదని గుర్తిస్తే, ఈ కుందేలు భలేగా ఆశ్చర్య పోతుంది. అయినా, దీని మురుగులూ, విసనకర్ర దీనికి తెచ్చియ్యటమే మంచిది, అదే! దొరికితేమాట" అనుకొంటూ పరుగెత్తుతూంది.

ఇంతలో ఒక చక్కని చిన్న యిల్లు కనబడింది. ఆ యింటి వీధితలుపు మీద, ఇత్తడి అక్షరాలతో "శ్రీ శశకంగారు" అని చెక్కిఉంది.

"శంగా రేమిటి; కుందేలుకాదూ ఓహో, శశకం గారూ గాబోలు." అనుకొంటూ, తలుపు తట్టకుండానే, తోసుకుని మేడ మెట్లమీదకి గబగబా ఎక్కడం ప్రారంభించింది.

పైకి ఎక్కుతూన్నంత సేపూ, అసలుఅప్పలమ్మ కనబడి, మురుగులూ, విసనకర్రా తను తీసుకొనే లోపలే తననుకనిపెట్టి, "ఆసి దొంగా!" అంటూతరిమేస్తుందేమో అని పాపకు కొంత, భయం పుట్టింది.

"అసలు అయినా బలే గమ్మత్తుగా ఉంది; ఇప్పుడు కుందేలుకు నౌకరీపని తయారయిందే నాకు. సరి! సరి! రేపటినుంచి, ఇంక దీనకూడా నాకు పనులు చెప్పడం మొదలుపెట్టుంది కాబోలు! ఇంకనుంచి" "ఏయ్ పాపా! ఇల్లారా! అల్లాబైటికి పోవాలి ముందు పదూ!" "ఏయ్ పాపా! నాకు కొద్దిగా పనుంది గాని, ఈ ఎలుక కన్నందగ్గిర కాసేపు కాపలాఉండి, ఎలక పారిపోకుండా చూడూ, ఎలకపారి పోకూడదు జాగ్రత! తెలిసిందా!" అంటూ, ఏవేవో పనులు చెపుందిగాబోలు. ఆ!—ఎందుకు చెప్తుందిలే! అల్లా అందరిమీద అధికారాలు చెలాయించటం మొదలు పెడితే, మా యింట్లోవాళ్ళుమాత్రం దాన్ని అక్కడ ఉండనిస్తారా యేమిటి?"

ఇల్లా అనుకొంటూండగానే, పాప ఒక చిన్న గదిలోకి వచ్చేసింది. ఆగది శుభ్రంగా అందంగా అలంకరించిఉంది. పాప అనుకొన్నట్టుగానే, (ఎల్లా అనుకొందో, ఎందుకనుకొందో, మరి!) అక్కడ మేజాబల్లమీద రెండు మూడు జతలు మురుగులూ, మూడు నాలుగు విసనకర్రలూ ఉన్నాయి.

పాప ఓజత మురుగులూ ఓవిసనకర్ర తీసుకొని ఇంక వెళ్ళిపోదా మనుకొని ఇట్టే వెనక్కి తిరిగేలోపల అక్కడ ఓ అద్దం కనబడింది. ఆ అద్దం పక్కనే ఉన్న ఓ చిన్న సీసామీద పాప కళ్ళు పడ్డాయి. ఈ మాటు ఆ సీసామీద "నన్నుతాగు" అని కాగితంఏమీ అంటించిలేదు. అయినా, పాప ఆ సీసా మూతతీసి, సీసామూతి నోట్లో పెట్టుకొని సీసాలో ద్రాకవం త్రాగటం మొదలుపెట్టింది. "తప్పకుండా ఏదో తమాషా జరిగితీరుతుంది. ఎందుకో! నే నేదైనా, తిన్నా, తాగినా జరిగితీరుతూనేఉంది. ఈమాటు మళ్ళీ పెద్దదాన్నవుతా నేమో! లేకపోతే అస్తమానం ఇంత బుల్లిపిల్లనుగా ఉండటం కూడా విసుగ్గానే ఉంది." అనుకొంటూ పాప సీసాలోదంతా గుటకూ గుటుకూ త్రాగటం మొదలుపెట్టింది.

పాప అనుకొన్నంతా జరిగింది. సీసా సగం కాళీ అయేటప్పటికే, పాప తల ఇంటికప్పుకు గట్టిగా అదుముకొని నొక్కేస్తూంది. పాప అడావుడిగా సీసా క్రింద పెట్టేసి "ఇహచాలు! ఇహచాలు!

బాల

సుబ్బయ్య యుక్తి

పిల్లల కథలు **డి. ధనంజయ**

ఒక వూళ్ళో సుబ్బయ్య అనేవాడు ఒకడు ఉన్నాడు. అతను మంచివాడు. ఒకరి జోలికి పోడు. మంచివాళ్ళని మనం లోకువగా చూస్తాం. అందులో సుబ్బయ్య ఏమీ లేనివాడేమో, అందరూ మరీ నీచంగా చూసేవారు. సుబ్బయ్యకి 'వెర్రాడు' అని పేరుపెట్టారు.

ఒకరోజున ఒకడు వచ్చి సుబ్బయ్యతో 'ఈ చేతిలో అర్ధరూపాయి వుంది; ఈ చేతిలో రూపాయి వుంది. నీకు ఏది కావాలి?' అన్నాడు. సుబ్బయ్య కొంతసేపు ఆలోచించి 'నాకు నిజంగా ఇచ్చేస్తావా?' అన్నాడు. "అలాగే" అన్నాడు ఆ మనిషి. సుబ్బయ్య 'నాకు అర్ధరూపాయి కావాలి. ఆ వెధవ రూపాయి వద్దు' అన్నాడు. అందరూ నవ్వి చప్పట్లు కొట్టారు. సుబ్బయ్యకి ఆ మనిషి అర్ధరూపాయ యిచ్చి అందరితోనూ 'వీడు వట్టి వెర్రాడు. అవునా, కాదా?' అన్నాడు. అవును 'అవును' అని అందరూ మళ్ళీ చప్పట్లు కొట్టారు.

అప్పట్నుంచీ ప్రతివాడురూపాయ అర్ధరూపాయ, పావలాబేడా, అణా, అర్ధణా తీసుకువచ్చి 'నీకు ఏది కావాలి' అని సుబ్బయ్యని అడిగేవాడు. సుబ్బయ్య ఎప్పుడూ తక్కువ నాణెమే తీసుకునేవాడు. దానికి అందరూ 'హాహా' అంటూ నవ్వేవారు. కొన్నాళ్లకి సుబ్బయ్య తనకి యిలా వచ్చిన డబ్బుఅంతా చూసుకున్నాడు. రెండువందల రూపాయలు ఉన్నాయి. వాటితో ఒక చిన్న కొట్టు పెట్టాడు ఆ వూళ్ళోనే. 'వెర్రాడికొట్టు' అంటూ అందరూ సరదాగా సుబ్బయ్యని ఏడిపిస్తూ అక్కడే కొనేవారు. సుబ్బయ్య వర్తకం పెద్దదైపోయింది. కొట్టు పెద్దదయింది. రెండేళ్ళకి సుబ్బయ్య ఒక చిన్న డాబాకూడా కట్టకుని ఒక చక్కని పిల్లనికూడా పెళ్ళి చేసుకున్నాడు.

ఇప్పుడు సుబ్బయ్యని సుబ్బయ్యగారు అంటున్నారు. ఇప్పుడు సుబ్బయ్య అందరితోనూ ఇలా అంటాడు: 'మీ రందరూ తెలివిగలవాళ్ళ మనుకుంటున్నారు. ఒకర్ని మోసగించడం, ఏడిపించడం, పేర్లు పెట్టడం గొప్ప కాదు. నిజానికి మీ రందరూ మూర్ఖులు. అయినా మీకు ఎప్పుడూ కృతజ్ఞుణ్ణి. ఈ కొట్టుకీ, యిల్లుకీ, ఇప్పటి నా అభివృద్ధికీ మీ తక్కువే' కారణం.

అందరూ సిగ్గుపడి తల వంచుకునేవారు. సుబ్బయ్య ఎప్పుడూ బీద వాళ్లనీ, లేనివాళ్ళని దయతో చూసేవాడు. మంచి పేరుకూడా సంపాదించుకున్నాడు.

ఇంతకంటె ఇంక ఎదగకుండా ఉంటే నయం. అయినా ఇప్పుడీ, తలుపులో ఎల్లా పట్టేది, ఎల్లా బయటికి పోయేది? అంత ఎక్కువగా తాగకపోతే ఎంత బాగుండేది! అన్నీ ఇల్లా చేసుకేడవటమే అవుతోందే! కర్మ!" అనుకోటం మొదలుపెట్టింది పాప.

కాని ఇప్పుడేమనుకొని ఏంలాభం. పాప అల్లాగే ఎదిగి ఎదిగి పెద్దదైపోతోనే ఉంది. మోకాళ్ళమీద కూలబడినా గది పట్టటం లేదు. తలుపుకు ఒక మోచేయి ఆనించి, ముడుచుకొని ముడుచుకొని నేలమీద జేంగిల పడుకొంది. ఇంకా ఎదుగుతునే ఉంది. ఓ చేయి కిటికీలోంచి బైటి పెట్టింది. ఓ కాలు. ఇంటి కప్పులో చిమ్నీ ఉంటే ఆ గొట్టంలోకి పెట్టింది. ఇంకా గదికన్నా పెద్దదై పోతూన్నట్లేఉంది.

"ఏడ్చినట్లే ఉంది! ఇంతకన్నా ఇంకేం చెస్తాను. ఇంకెంత ఎదిగినా ఇల్లా ఉండల్సిందేనే! తీరా ఏమై పోతానో గొడవ.!" అని గట్టిగా అనుకొంది.

పాప అదృష్టంవల్ల యేమో, ఆ సీసామందు ప్రభావం అంతటితో ఆగింది. పాప ఇంక ఎదగటం ఆగిపోయింది. కాని ఆ యిరుకులో కాలు కదిపేందుకూ చేయికదిపేందుకూ, ఆఖరుకు మెడతిప్పుకొని ఒత్తిగిలి పండుకునేందుకూ వీలులేక చాలా ఉత్కృష్టంగా ఉంది.

"అబ్బ! ఇంతకన్నా ఇంటిదగ్గరే హాయిగా ఉండేది, అస్తమానం ఎదగటం, కుంచుకుపోవటం ఏమీ ఉండేదికాదు. ఎలకలు కుందేళ్ళూ, ఆజ్ఞలివ్వటం ఏమీ ఉండేదిగాదు- ఆ కుందేటి బొరియలో పడిపోకుండా ఉన్నా బాగుండేదే! ఆ—అయినా, ఈ బతుకుకూడా ఓమాదిరి గమ్మత్తుగానే ఉంది: అసలు ఇప్పుడు నే నేమయిపోయానో! మునుపు, పిట్టకథలూ అవీ చదువుతూంటే, ఆకథల్లోదా న్నయిపోతే బాగుండేదనిపించేది! కాని ఎప్పుడూ అల్లా అవటం అసంభవం అనుకునే దాన్ని! ఇప్పుడు నాదీ అల్లాంటి కథే ఐపోయిందే—ఈ కథకూడా ఎవరైనా రాస్తే బాగుండును—ఎందుకూ నేనే ఎదిగాక రాస్తా:" అని, ఎదగటం అనే టప్పటికి నిట్టూర్చి, "ఇప్పుడిక్కడ ఇంక ఎదిగేందుకు జాగా ఎక్కడుంది?" అనుకొంది.

"అయితే ఇంకెప్పటికీ ఇంతకన్న ఎదగనన్నమాటేనా! అదీ ఓమాదిరి లాభమే ఎప్పటికీ ముసలిదాన్నవను—కాని, ఎప్పుడూ పాఠాలు చదువుకొంటూనే కూర్చోవద్దూ! ఉహూ! ఆపనిమాత్రం వద్దుబాబూ." అనుకొంటూనే, మళ్ళీ తన్నుతనే కోప్పడుకొంటూ,

"ఓసి తెలివితక్కువ పాపా! ఇక్కడ పాఠాలెల్లా నేర్చుకొంటావే! ఇక్కడ నీకేసరిగ్గా జాగాలేదాయెను, ఇంకా పుస్తకాలు కూడా ఎక్కడ పడతాయి!"

అంటూ కాసేపు ఓపక్షం, మరి కాసేపు రెండోపక్షం, ఆలోచనలతో మాట్లాడుతూ, తనతో తనే సంభాషణ, ఇద్దరున్నట్లు నడుపుకొంటూంది, పాప. కాసేపటికి బైట ఏదో గొంతుక వినబడి, పాప తనమాటలు ఆపేసి, వినటం మొదలుపెట్టింది.

"అప్పలమ్మా! అప్పలమ్మా! ఓసేయ్ అప్పలమ్మా ఎక్కడికి పోయావే! మురుగులూ, విసనకఱ్ఱా త్వరగా తీసుకురా" అన్న కేక వినబడింది. ఆకేకతో, తనకోసం వెనక్కు వస్తూన్న కుందేలు తప్పటడుగులూ వినబడ్డయ్.

ఆలస్యం చేసినందుకు పాప ముందు కంగారుపడి వణికిపోయింది. అసలిప్పుడా కుందేలుకన్నా తాను వెయ్యిరెట్లు పెద్దదా న్నయానన్న మాటే పాప మరిచిపోయింది. ఇందాకటి బుల్లిపిల్లగా ఉన్నప్పటి దాననే అనుకొని భయంతో వణికిపోయింది. ఆ వణకటంతో, ఇల్లంతాకూడా పాప వణుకుకి భూకంపం వచ్చినట్లు గజగజా కదుల్తూ అడిలిపోయింది.

ఇంతలో కుందేలు తలుపుదగ్గరకువచ్చి తలుపు లోపలికి తొయ్యబోయింది. కాని లోపల పాప మోచేయి తలుపుకు గట్టిగా ఆనుకొని ఉండబట్టి తలుపు లోపలికి తోసుకోలేదు. "ఈ తలుపు రావడంలేదే, పోనీ చుట్టూ తిరిగివెళ్ళి, కిటికీలోంచి లోపలికి వెళ్తాను" అని కుందేలు గట్టిగా అనుకొంది.

"లోపలికి వస్తావుగా? చూస్తాను" అనుకొంటూ, పాప కుందేలుకిటికీ దగ్గరకువచ్చిన చప్పుడవగానే, గబుక్కున చెయ్యిచాచి, కిటికీలోంచి కుందేలును పట్టుకుందామని గుప్పిలి విసిరింది.

చేతికేమీ అందలేదు. కాని. ఒక కీచుకేకా, గలగలా అద్దాలు పగిలిన చప్పుడూ వినబడ్డాయి. కుందేలు, అక్కడ ఎక్కడో పడ్డదేమోనని పాప అనుకొంది.

"తాట్-తాట్" అంటూ కుందేలు కోపంతో కేకలేస్తోంది. "తాటి-తాటీ-ఎక్కడేడుస్తున్నావు రా పట్టడూ"

ఇంతలో మరోసన్నని గొంతుక వినబడింది. "ఇక్కడేనండి, తాటిముంజెలు తవ్వుతున్నానండి"—అని పట్టడు జవాబిచ్చాడు "ఛా! తాటిముంజెలు తవ్వుతున్నాడ! నా మొహం ఏంకాదూ—ఇల్లావచ్చి నన్నుకాస్త పైకిలాగు"

మళ్ళీ ఇంకొంచెం అద్దాలు పెట్లి చిటిలిన చప్పుడయ్యింది. బహుశా పట్టడు కుందేలును బైటికి లాగాడేమో!

"ఓరేయ్ పట్టా! ఆ కిటికీలో, అది ఏమిటిరా!"

"అదేదో సెయ్యనుకుంటానండి;"

"సెయ్యేంటిరా నీబొంద! మడ్డివెధవా! అంత చెయ్యుంటుందిరా కిటికీఅంతా . నిండిపోయి, తెలివి తక్కువ మొగమూ!"

"సిత్తవండీ, కిటికీ అంతా నిండి పోయినమాట నిజమేనండి, అయినా సెయ్యేనండి బాబూ."

"మరి అయితే ఆ కిటికీలో చెయ్యేందుకొచ్చిరా! ఆచెయ్యి అక్కడుంటానికేంపనుంది? వెంటనేపోయి, ఆ చెయ్యక్కడనుంచి తీసెయ్యి."


తరువాత కాసేపు నిశ్శబ్దం. అప్పుడప్పుడు రహస్యం మాట్లాడుతున్నట్లుగా గుసగుసలు వినబడుతున్నాయి,

"సిత్తమండీ, ఆసెయ్యక్కడుండకూడదండి, అల్లా ఉండటం నాకూ ఇట్టంలేదండి." కుందేలు, రహస్యం చెపుతున్న గొంతుకతోనే, కోపంగా, విసురుగా, "ఓరిపెంకివెధవా! అల్లానుల్చోక, ముందు పోయి ఆచెయి అక్కడినుంచీ తీసేయ్" అని అంది.

పాపఇంక ఊర్కోకూడదని, గట్టిగా పట్టుకో పోతున్నట్లు వేళ్ళు సాచి, చెయ్యి మళ్ళీ కిటికీలోంచి గాలిలోకి విసరింది.

ఈమాటు ఒక కేకకు రెండుకీచు గొంతుక కేకలు వినబడ్డాయి. మళ్ళీ అద్దాలు చిట చిటా ఇంకా ఎక్కువ పగిలిన శబ్దంఅయింది. "ఆచిటచిట పగిలే చప్పుళ్ళేమిటో, అన్ని అద్దాలు నేలమీద ఉంటాయా" అనుకొంటూంది పాప.

"మరి ఇప్పుడు వాళ్ళేంచేస్తారో: ఈ కిటికీలోంచి చెయ్యట్టుకొని నన్ను బైటికి లాగుతారేమో! వాళ్ళు అల్లా నన్ను బైటికి లాగగల్గినా బాగుండునే! ఇక్కడిల్లా ఎంతోసేపు పడిఉండటం ఏం బాగుళ్ళేదు" అనుకొందిపాప.



కథా గేయం:



ఆణి ముత్యం

'ప్రసాదరావు'

ఒక్క కూతురు, కొడుకు, వారికి
చక్కన్నీ చుక్కల్లు కలిగా,
రిల్లు కలకలలాడుతూ, దినముల
వెళ్ళబుస్తారోయ్. 1

తమకు బాల్యమునందు కరవై
భ్రమల గొల్పిన వేడ్కలన్నీ
ముద్దుగా పిల్లలకు గూర్చి
మురిసి పోతారూ. 2

కాయ కష్టాల్ లెక్కసేయక
కాసు కాసును పోగుచేసీ,
భావిసౌఖ్యాల్ వారి కమరుప
పాటుపడ్తారోయ్. 3

ఆరీతి సంసార మది యొక
అమృతవార్ధియ గాగ నీదుచు,
ఆణిముత్యాల్ కొంత కాల
మ్మట్లు గడిపారూ. 4


పచ్చ పచ్చని కాపురాలను,
పండు సంసారాల చూచిన
మెచ్చరో దేవతలు ఈర్ష్యతో
మండిపోతారో! 5

స్వర్గమీ భువి ననుభవించు, ని
సర్గరమ్యత లూడ్చి, బుగ్గిగ
జేసి విడిచినగాని వారల
కూసుపోదేమో! 6

ఒక్కనాడొక ఓడ తెరకొన
కెక్కి అణీ పనుల నుండగ
గాలిపాటున కొయ్య విరిగి
కూలిపోయాడూ. 7

కాలు సేయియు విరిగి, ఇంకే
కూలికీ కాకుండ పోగా,
ఆలుబిడ్డల తలిచి జాలితో
పాలిపోయాడూ. 8

కావ్యరస విమర్శ :



స్వారోచిషమను సంభవం

స్వరోచి యుదయము

శ్రీ కొణిదెన బాలకృష్ణయ్య

మున్ను వి ప్రాకారమునఁగూడుచో శంకఁ
గనుమూయఁ బనిచెనా ఖచరభర్త.........
మేటి గర్భంబు నెలలు తొమ్మిదియునిండె".
"తేజంబబ్జ భవాండ గేహమునకున్.
దీపాంకుర చ్ఛాయయై
రాజిల్లన్ గ్రహపంచకంబు రవిఁజే
రన్ బోని లగ్నంబునన్
రాజీవాక్షి కుమారుఁ గాంచెనుమనో
రాజన్య మాన్యున్ జనుల్
జేజేవెట్టఁ బ్రసూన వర్షమమర
శ్రేణుల్ ప్రవర్షింపఁగన్".
"స్వరుచి స్ఫురణను శశి భా
స్కర పావకతారకా ప్రకాశము లెల్లన్
విరళములం సేయ నతనికి
స్వరోచియనినామమిడి రచటిమనుజులెల్లన్".

వరూథిని కుమారుని గన్నది. అతని పేరు స్వరోచి. వానికి "రుచి" స్ఫురణాదిక యోగ్య లక్షణములును, ఔన్నత్యమును, పుట్టుకతోడనే నైసర్గికములై యున్నట్లు పై పద్యముల(దెల్లము. "ప్రవరదేహ సమిద్ధశిఖిదీప్తి శాంబరీమహిమచే సంగ్రహించిఁ ట్టి గంధర్వమూర్తి సౌఖ్యానుభూతి జలనమేసిన మానసాబ్జమున నిలువవెలసె దేజోమయంబైన వృద్ధినట్టి మేటిగర్భంబు" అను వాక్యము ప్రవర తేజస్సంపదను గూర్చి యభివర్ణించుచున్నది. ప్రవర తేజము అగ్నిదత్తము. కావుననే దాని నంతగ పెద్దన నిర్వహించెను. అతడు రేపునుమాపు హవ్యములచేత నగ్నిభట్టారకుని దృప్తి గావించుచుండువాడు. ఆహితాగ్ని. పరమభక్తుడు—కర్మిష్ఠి—యను దినమునౌపాసన కర్మము, వైశ్వదేవాదికములయందు—

మంత్రము—
"మయిమేధాం మయిప్రజాం
మయ్యగ్ని స్తేజోదధాతు
మయిమేధాం మయిప్రజాం
మయీన్ద్రి ఇన్ద్రియం దధాతు
మయిమేధాం మయిప్రజాం
మయి సూర్యోభ్రాజో గధాతు".
"ప్రత్నోషిక మీడ్యో అధ్వరేషు
సనాచ్ఛహోతా నవ్యశ్చ సత్సి
స్వాంచాగ్నే తనువం పిప్రయస్వా
స్మభ్యంచసౌభగ మాయజస్వ".
"పాహినో అగ్న ఏనసే స్వాహా"
"పాహినో విశ్వవేదసే స్వాహా"
యజ్ఞం పాహివిభావసో స్వాహా"
"అగ్నయే స్వాహా"
"విశ్వేభ్యో దేవేభ్యస్స్వాహా"
"త్వం తదాప ఆపోజ్యోతీ
రసోఽమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్".

అను వేదమంత్రములచేత నవ్యాజభక్తియుక్త చిత్తవృత్తితోను పాసించుచుండ నగ్నిదేవు డతనికి వశుడై యనుగ్రహించి స్వీయతేజోవిభూతి నా ప్రవరదేహమున జొన్పి యతనికి సన్నిహితుడై, యిష్టార్థసంధాయకుడై యుండెను. కావుననే "వరూథినీ! వహ్ని సత్కారణాదృష్టినొసంగు సౌఖ్యము లెఱుంగన్ శక్యమే నీకు?" అని యగ్నిమాహాత్మ్యము దనకు దెలిసినటుల వ్యతిరేకార్థముచే సూచించెను. అతడింటికి బోవు సందర్భమున నగ్నిదేవుఁడు ప్రవరునిపైగల యనుగ్రహ మింతటిదని తెలిసి యున్నదిగదా మనకు. లోకస్థితికారణుఁడగు నీ యగ్నిహోత్రుని దివ్యతేజఃపుంజము, తొలుత ప్రవరునియందు జేరి; యందుండి గంధర్వునిచే గ్రహింపబడి, యతనికలన వరూథినీ గర్భమున బ్రవేశముగాంచి "స్వరోచి" యను నామమున నవ్యర్థవంతుడగు పురుషశ్రేష్ఠుని రూపమున నుదయించెను. ఆ కారణమున పెద్దన యీ సందర్భమున వరూథినీ గర్భమును, ఆమె పుత్రునియొక్క ప్రకాశమును, అంతగా గౌరవించి పెద్దగ పొగడి చెప్పెను. ఇందలి వాక్యార్థభావములను దర్కించి క్షేత్ర—బీజముల ప్రాముఖ్యమును శారీరక మానసిక తత్త్వశాస్త్రాభిజ్ఞులగు పెద్దలు నిర్ణయింతురుగాత.

చతుర్థాశ్వాసము స్వరోచిజననముతో బ్రారంభము. ఇందీవరాక్షగంధర్వుని శాపవిమోచన వృత్తాంతముతో సంపూర్ణము. స్వరోచి.

"సంయమి సమాజ వినిర్మిత జాతకర్ముఁడు- పరివర్ధితుడు"

"ఉపనీతుడు. నిగమార్థవేది" "వివిధాయుధంబులన్ గఱకరి. రణస్థలులగద్దరి" "నిర్మలకాంతి విలాసరేఖలన్ మెఱసినవాడు" "వేదండము తొండమును పరిశోధించను దివిజుం డెడమ గుడి, నిబిడజ్యానాదము రోదసినిండగ"

ఇట్టిడు. దివ్యశక్తియు—బ్రహ్మతేజస్సమృద్ధియు—అరి భయంకర క్షాత్ర ధర్మ ప్రవృత్తియు—సర్వోచియందుగలవు. ఏతాదృశ ప్రభావ గరిమావిష్టుడగుటచే "స్వారోచిషుని" దనయునిగ గాంచు భాగ్యమునకు బాత్రుడయ్యెను. మందరాద్రియందు విశ్వకర్మ నిర్మించిన పట్టణమునందు నివసించి నిర్జరత్వము, నైజతను ప్రకాశ—నిగమార్థవేదిత్వాదికములవలన బ్రహ్మత్వమును—మృగయావిహార, రాక్షసవిజయ, ఆర్తార్తి హరణాదికములగలన క్షత్రియభావమును స్వరోచి తనయందు బ్రకాశింప జేసికొని యున్నాడు. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, ఆశ్రమధర్మముల నిర్వహించిన వాడేయనఘుడు. "ఆత్మకున్ చేదతనంబు మేలె? మతిమృత్యువు డాగడిచోట లేదొకో?" "మృత్యుదేవి గన్నబ్రామనొదవదు" "చావదలపోసి మానవు, దేవగదుష్కీర్తి వొరయకే దినములు పొందె.

వెడలునట్లు గడవగ, దైవంబటమీద మేలు తాన ఘటించున్"

అని స్వరోచివచించిన వాక్యములాతని యాధ్యాత్మిక తత్త్వానుభవమును దెలుపుచున్నయవి. మృత్యుభీతిలేని ధీరుడని స్థాపించుచున్నయవి. సర్వోచిచే పెద్దనార్యుడు సేయించిన ధైర్యగుణవర్ణనాపూర్వకమగు నీపద్యము మిగులహృద్యము దానినిట నుదహరింతును.

"బుద్ధీంద్రియక్షోభ ములకు బెట్టనికోట
విపదంబురాసి దుర్వికృతి కోడ......
ధైర్యగుణః; మట్టి ధైర్యంబు దక్కబోర
దగ్గతింతురె యకటమీ తరమువారు"

ఇతనికి భార్యలు ముప్వురు. మనోరమ—విభావసి—కళావతి, యనువారు. వీరి గాథలు కొన్ని గలవు. ఒక్కొక యువతి యొక్కొక విద్యనొసంగి స్వరోచిని బరిణయమై యాతనితో నిరంతర క్రీడావిలాసముల దవిలి సంచరించుచుండిరి. వారందఱు తమకై తాము స్వరోచిని వరించిరి. ఇతడు మృగయా విహారలంపటుడు—కామ పరతంత్రుడుగ, జూపట్టెడి. ఇతని కామ లాలసతను తిర్యగ్జంతువులను, హంసీ చక్రవాకీయుగళమును, మృగదంపతులును, నేవగించి యన్యాపదేశముగ బ్రబోధించినను దెలివిగనడయ్యె. కాని యన్యకాంతాభిరతిలేక, స్వభార్యల యందుఁ దవిలియుండె గావున నది తప్పుకాదు. అపత్యప్రాప్తి కలుగునంతదనుక స్వరోచి తృతీయ పురుషార్థోపాసనమును వీడజాలడయ్యెను. పుత్రులుకలుగ, దనవిద్యాప్రభావమున బురములు నిర్మించి వారి నభిషిక్తుల జేసి కృతకృత్యుడయ్యెను. తన స్త్రీలోలతను హంసీప్రముఖము లెగతాళిసేయునపు "డుస్సురనుచు" వగచియు దానికి స్వస్తి జెప్ప నేరక వివేకము చొప్పు దొరగి కొన్నివందలయేండ్లు గడపెను దేవకాంతాతనూభవుఁడు.

ఒకనాడతడు వేటకు జనియొక యడవి పందిపై బాణమేయ, బోవయాడు జింకయొకటి పఱువిడివచ్చి యా రాజునుజేరి మనుష్యవాక్యములతో "రాజా! ఈ పందినీ కేమి యొగ్గొనర్చెను? ఆబాణమునాపై బ్రయోగించి నన్ను నిగ్రహింపుము" అనెను. ఉభయులకు గొంత సంభాషణముసాగెను. అవలనాజింక "నృపశేఖర! చెదరిపోకనా మనంబునీయెడ నిల్చినది. మన్మథప్రదరపరంపరా నిహతిబాల్పడి వ్రేగుచున్న దానను. నాయదట డంగింపుము"అనెను. అంత "నేను మానవుడను. నీవు హరిణాంగనవు. మనకిద్దరకు మిథునోచితకృత్యము లెటుల జరుగును? "నను నాలింగనముసేయుము" అని జింకపలుక స్వరోచియటులొనర్చెను. హరిణ మొక సౌందర్యరాశియగు లతాంగియై పొల్చెను. ఈవింతకు గారణమేమియని యతడడుగ నామె యిట్లనె—

"నావుడు నమరకాంతాతనూభవుఁజూచి
యిర్వనదేవత నేనరేంద్ర......
పడయుము నాయం దపత్యంబు దీననీ
కగుఁ బుణ్యలోకసంప్రాప్తి యనిన
యిట్లుకాకని యయ్యంబు జాయతాక్షి
కకచిత్తంబుతోడ నంగీకరించె......
యంతగర్భిణియై శుభంబగు దినమున.
గాంచెన్ బుత్రువిశాలనేత్రుఁ
బృథు వక్షః పీఠవిభ్రాజితున్......
సుగుణరత్నానీ రత్నాకరున్."

ఈపుత్రుడే స్వరోచిషుడు. ఇతని విషయ లేశముతో మనుచరిత్ర కావ్యము ముగియుచున్నది. పైన నుదహరించిన సీసము స్వరోచి ప్రభావమునకు లక్ష్యముగనున్నది. ఈతని పుణ్యలోక సంప్రాప్తికి వీనినిమ్మళంక జీవనమే హేతువనుట సత్యమూరము కానేరదు. దేవపూజ్యుడగు స్వరోచి సంగమమునకు వనదేవత దివిజప్రార్థితయైవచ్చి రమించి పుత్రుగాంచె ననుటలో నతని సర్వాతిశాయిత్వము సహస్రముఖముల బ్రకాశించుచున్నది. అట్టి లోకోత్తరౌన్నత్యమునకు శమాది గుణసంపదయే మూలకందము. దీనినిబట్టి నాలుగైదాశ్వాసములును, నాఱవ యాశ్వాసభాగమును నాక్రమించిన స్వరోచి జీవితగాథ శాంతరసభూషితమై యొప్పాలాఱుచున్నది. శ్రీ రాయలు కోరిన కథలలో మూడవది స్వరోచికథ. దీనియందు మనోరమాదుల యుపకథ లంతర్భూతములు.

మను చరిత్రమున స్వారోచిష జననముతో స్వరోచి తెఱచాటునకు బోవుచున్నాడు. ఈ కావ్యమున కాధారమగు మార్కండేయ పురాణమున మనుజననానంతరమున గూడ స్వరోచి భార్యా సహితుడై విహరించుటాది విషయము జెప్పి స్వరోచి జీవితము పసంహరింపబడి యున్నది. కావుననే పెద్దనార్యుడు ప్రకరణానుసరణముగ స్వరోచిని జూపించి యవసరము దీఱ నాతని నవలకు బంపెను. మార్కండేయ పురాణము నందలి యీ భాగము నించుకంత ఉల్లేఖించుచున్నాను. దీనితో స్వరోచి సంపూర్ణ జీవితము దెలియగలుగుదుము.

స్వారోచిష జననమునకు దరువాత "నొకనాడు గిరినిర్ఝర మనోహర ప్రదేశంబుల విహరించుచు నా స్వరోచిర్విభుండు హంసమిథునంబు గనియె, నంత నా హంసహంసి కిట్లనె."

....
రాయంచ యిట్లను విను భోగైక
సక్తులసంతత సంగపరులు......
పుత్రిపౌత్ర వృద్ధిఁబొంది నేడును విష
యోప భోగనిరతి. నున్నవాఁడు."

"వకామినీ పరతంత్రుడైన యీ స్వరోచి నాకు సదృశుండుగాడు. నేను వివేకఁబునంజేసి భోగంబులు పరిహరించితి నవిన హంసవచనంబులు విని యా స్వరోచి జాతోద్వేగుఁడై భార్యాసహితంబు వనంబునకుం జని ఘోరతపం బొనరించి నిష్కల్మషత్వంబు నొంది యమరలోకంబున కరిగె—"

ఈ భావమును సూచించుటకే పెద్దనార్యుడు భవిష్యదర్థ ప్రతిపాదకంబగు "నీకగు బుణ్యలోక సంప్రాప్తి" యను మాటను వనదేవతచే బల్కించి యున్నాడు. మార్కండేయము గూడ స్వరోచి "జాతోద్వేగుడు— నిష్కల్మషుడు — అమర లోకమున కరిగెను."

అను నిర్వచనములచే వానికి గలిగిన వైరాగ్యమును, శమాదిసంపత్తిని, స్థాపించుచున్నది. ఈ హేతువును బట్టి స్వరోచియాఖ్యాయిక యందును శాంతరసమే పరమావధిగనిన దని నిశ్చయింపనగునుగదా? ఈ గాథలు—బాధలు, అన్నిటికి గార్యకారణ సంబంధమున నేర్పడిన సన్నివేశముల ఫలోదయ స్వరూపుడు

స్వారోచిషుడు

పదునలువురు మనువులలో నితడు రెండవవాడు. వీని నిర్మాణమునకు సంకల్పించి పరమేశ్వరు డెరికోరి సిద్ధ రూపమున నరుణాస్పద పుర నివాసియగు ప్రవరాఖ్యునింటికి వచ్చి యతనిని హిమవత్పర్వత కందరాంతములకు దరలించు కొని పోయెగాబోలు. ప్రవరదేహ సమిద్ధవైశ్వానర తేజరూప బీజాంకూర ఫలముగదా స్వారోచిషుఁడు. కావున శాంతిదాంతి దయాసత్య శౌచ నిరతుడై యాబాల్యమునుండియు భగవత్పరతంత్ర నిరతుడై పొగడొందెను. అచ్యుతుని గూర్చి చిర తపంబాచరించెను. భగవానుడు శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమయ్యెను. శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహము నీ క్రింది పద్యమున పెద్దనకవి చిత్రించియున్నాడు.

"నీలమేఘముచాయ డీలుసేయగజాలం
మెఱుఁగుఁజామన చాయ మేనితోడ...
నెదుర బ్రత్యక్షమయ్యె లక్ష్మీశ్వరుండు"

ప్రత్యక్షమైన వెన్నుని స్వారోచిషు డర్థవంతములగు వాక్యముల బునః పునః ప్రణామములతో; స్తుతియొనర్చెను. భగవంతుడు ప్రసన్నుడై "వత్సా! వరంబు వేడుమనుటయుం బ్రసాదంబని స్వారోచిషుం డిట్లనియె

దేవభవద్దాస్య సుఖం
బె వేడెదదయకు దగుదు. నే సాలోక్యం
బీ వేయితరములొల్లన్
నావుడు నాతనికిఁ బద్మనాభుండనియెన్"
"సాలోక్యముదుదినిచ్చెద
నేలుమిలద్వితీయమనువ. వీవై నయధ
ర్మాలోలబుద్ధిఁ దిరముగ
వేలుపులకుఁదపసులకును విధికిఁ బ్రియముగాన్

"చం అని మహిమన్ మనుత్వమున
కాతనిఁ బట్టము గట్టి.........
నవ్విభుండుఁ బ్రజలం బ్రజ
లట్లరసెన్ గృపామతిన్"

కృతాద్యదియుందు సనకాదుల నమస్కృతులఁ గైకొనుచు దర్శనమిచ్చిన వందారు జనమందారుడు పరమేశ్వరుడు, స్వారోచిషుని తపః ప్రభావమున బ్రసన్నుడై కావ్యాంతమున దక్షభక్తునికి ద్వితీయమను రాజ్య పట్టాభిషేక మొనర్చుచు సాక్షాత్కరించి మనలనందఱ దన చంద్రికా శీతలకటాక్షపరంపరలచే ననుగ్రహించెను. స్వారోచిషుని యుత్తమ చరిత్రమును నిస్సంశయముగ శాంతరసప్రతిపాదకముగ రచించి యీఘట్టముతో పెద్దనకవి కావ్య పరిసమాప్తి యొనర్చుటవలన నీభాగము రసాస్వాదన కార్యమున శ్రమగల్పించని దయ్యెను. స్వారోచిషుని పాలనమున బ్రజలు సుఖించిరి.

ఫలితార్థము

ప్రవరాదుల స్వరూప స్వభావములను పరిశీలించితిమి. వారిలోఁ

ప్రవరుఁడు:—
"నాకరణుల్ దర్భలు నగ్నులున్
బ్రియములై నట్లనవ్యముల్ గాహడల్
తిరమే చెప్పకు మిట్టి తుచ్ఛ
సుఖముల్ మీసాలపై దేనియల్" అనెను.
గంధర్వుఁడు మాయాప్రవరుడయ్యెను :—
"ఎవ్వడుమీ దెఱుంగక....... రౌరవమునం
బడబాలును నిందపాలునై" అను ధర్మము నాశ్రయించి తప్పించుకొన్నవాడు.

కులాసా కబుర్లు

కవులు ఎండిపోతారా?

శ్రీ జి. యస్. సూరి

అవును. కవులుగూడా ఎండిపోతారు ఉడిగిపోయిన కాపువలె, అడుగుతగిలిన ఖనిజంవలె, ఎండిపోయిన పాడివలె, ఇంకిపోయిన జలలవలె కవిత్వం ఇగిరిపోతుంది

కవులంటే కేవలం పద్యాలు వ్రాసేవాళ్లేకాదు. రచయితలందరూ,—సాహిత్య రచయితలవరకైనా—కవులే. అంతేగాదు గాయకులు, నర్తకులు, నటులు, చిత్రకారులు మొదలైన వాళ్ళుకూడ కవులే. ఎందుచేతనంటే, రీతిభేదం ఉన్నప్పటికీ, భావాన్ని రంజకంగా వ్యక్తంచేయటమే లలితకళల ప్రధానలక్షణం కాబట్టి సౌందర్యదృష్టి, కల్పనాశక్తి, శిల్పనైపుణ్యం అన్నిటికీ అవసరం కాబట్టి అందువల్ల కవులన్నా కవిత్వమన్నా సమయానుకూలంగా సమన్వయం చేసుకోవాలి.

కవితాశక్తి ఏవయసులోనైనా బయటపడవచ్చు బడిలో వేయకముందే గొప్పగా సంగీతం పాడినవాళ్ళు ఉన్నారు నూనూగు మీసాలనాడే పెద్దకావ్యాలు వ్రాసినవాళ్ళు ఉన్నారు. మైనారిటీ వెళ్ళకుండానే మహత్తర చిత్రాలను వ్రాసినవాళ్ళు ఉన్నారు కాని, సాధారణంగా మరీ పడుచుతనంలోగాని మరీ వృద్ధాప్యంలోగాని ఉన్నత శిఖరాలను అందుకున్నవాళ్ళు అరుదు. శాశ్వతంగా నిలచిపోయే కవిత్వం మధ్యవయసులోనే బయల్పడినట్లు కళారాధకుల జీవిత చరిత్రలు తెలియజేస్తున్నవి బెర్నార్డుషా మాదిరిగా తొంభైయేండ్లు నిండినగూడా కలం విదిలించినప్పటికీ పిపప కాలపు రచనలు పూర్వస్థాయిని అందుకోలేకపోయినవి ఇంగువకట్టిన గుడ్డలను జ్ఞప్తికి తెస్తున్నవి.

నిలకడలేదని లక్ష్మీదేవిని ఆడిపోసుకుంటారు గాని, సరస్వతీదేవి కూడా అంతే కాకపోతే, లక్ష్మి వదలిపోయేప్పుడు వెనుకకు తిరిగిచూడకుండా వెళ్లిపోతుంది; సరస్వతి వెనుకకు అప్పుడప్పుడు తిరిగి చూస్తూ వెళ్లిపోతుంది. ఆ అమ్మవార్ల పూనికలో ఇంతే భేదం అందువల్ల వారి ప్రసన్నత ఉన్నప్పుడే పని చక్కబెట్టుకుంటే రాణిస్తుంది ఆ తరువాత ఎంత మథించినా గరళంతప్ప అమృతం పుట్టుకురాదు.

అసలు కవితాధోరణి బయలుదేరటానికి కారణమేమిటాఅని తెలుసుకుంటే అది ఎందుకు క్షీణించిపోతుందీ అనే విషయం విశదమవుతుంది పూర్వజన్మసుకృతం, సరస్వతీ ప్రసన్నం అందుకు కారణమనే సిద్ధాంతాన్ని మనం అవునూ కాదూ అనలేముకాబట్టి ఆ ప్రసక్తిని వదలివేతాం ఇక మానవస్వభావాన్ని పరిశోధించిన శాస్త్రజ్ఞుల విషయాన్ని ఆలోచింతాం ఫ్రాయిడ్ సూత్రాలను అనుసరించే తత్వజ్ఞులు కవితాధోరణి కామేచ్ఛ (సెక్స్)లో అంకురిస్తుందంటారు ఆ లక్షణానికి సంబంధించిన ఉత్సేకం పంచేంద్రియాలనూ చురుకుచేసి మనసును పులకింపచేస్తుందిట కళాస్వరూపంలో వ్యక్తమవుతుందిట ఈ తతంగమంతా వ్యక్తికి తెలియకుండానే జరగుతుందిట అందువల్ల బిడియపడవలసిన అగత్యంలేదు

ఈ సిద్ధాంతం ఎంతవరకు నిజమో చెప్పలేముగాని, కేవలం నిర్హేతుకమైన వాదమనిమాత్రం అనేందుకు వీలులేదు రచన ప్రారంభించిన పరిస్థితులను చూస్తే ఇది కొంతవరకు రుజువవుతుంది. —క్రొత్త కవులందరూ సాధారణంగా ప్రేమగీతాలతోనో ప్రణయప్రధానమైన కథలతోనో ఆరంభిస్తారు. లేకపోతే దానికి మరోరూపమైన ప్రకృతిసౌందర్యాన్ని ఆరాధిస్తారు సంసార తాపత్రయాలలో మునిగిపోయినతరువాత ఈ ఆవేశం క్రమంగా క్షీణిస్తుంది దానితో పాటు కవితాశక్తికూడ అడుగంటుతుంది అప్పటి రచనలను చూస్తే తరువాత దశలో వారికే ఆశ్చర్యమవుతుంది వాటిని వ్రాసినది తామేనా అని శంకించుకునే వరకూ వస్తుంది ఈలాంటి తాత్కాలిక కవులను లోకం అసలే గమనించదు. కామేచ్ఛ సంపూర్ణంలో పడగానే ఎండిపోతారు ఈ ప్రణయకవులు.

ఈ సందర్భంలో గమనించవలసిన విషయం మరొకటిఉన్నది ప్రణయగాథలను గానంచేయటానికి ఈ కామేచ్ఛేయాలకారణం అన్నమాట నిజమని ఒప్పుకున్నప్పటికీ, విరివిగా ఈకామ విషయానికి ప్రాధాన్యత ఇస్తువ్రాసే రచయితకు కామేచ్ఛ అధికంగా ఉంటుందని భావించటం పొరపాటు రచనప్రారంభించి నప్పటినుంచి పరలోకానికి ప్రయాణంకట్టేవరకు ఈలాంటి రచనలనే వ్రాసేవాళ్లకు కామేచ్ఛ సవ్యమైన మార్గంలో నడవడంలేదని ఊహించవచ్చు ఈ రచనలను వ్రాయటంలోను చదివి సంతోషించటంలోను వాళ్ళకు కలిగే ఆనందమూ తృప్తి అసలైన అనుభవంకన్న కలుగదు ఒక్కొక్కప్పుడు అసలైన అనుభవంవాళ్ళకు వశంకాకపోవటంకూడ కద్దు. అందువల్ల ఈ తరగతికి చెందిన కవులు అంతంతమాత్రాన ఎండిపోరు

బంగారాన్ని మేలిమిగా తయారుచేసినట్లు, తమకు తెలియకుండానే కామేచ్ఛను పుటంవేసి మహత్తరశక్తిగా మార్చగల ప్రతిభావంతులు అక్కడక్కడ అవతరిస్తారు. ఈవిధంగా సిద్ధించిన శక్తిని కవితారూపంగా వినియోగిస్తారు. ఉత్తమశ్రేణికి చెందిన వారీ కవులు. వీరి శిల్పాలే చిరస్థాయిగా నిలచి ఉండేవి ఎలెక్ట్రిక్ బ్యాటరీవలె వీరి శక్తి క్రమంగా క్షీణిస్తుంది. చివరవరకూ కొద్దో గొప్పో మిణుకుమిణుకుమంటూనే ఉంటుంది వారి రచనలోని ప్రాశస్త్యంకూడ దానిని అనుసరించే ఉంటుంది, కవితాశక్తి విజృంభించినంతకాలం ఈ కవులు తమ రచనలతో లోకాన్నంతా ముగ్ధులనుచేసి, ఆ శక్తి తిరిగిపోగానే సభలలో ఉపన్యాసాలు ఇవ్వటంతోను, శిష్యకోటినిచుట్టూ కూర్చోపెట్టుకుని స్వీయకవితను వినిపించటంతోను సరిపుచ్చుకుంటారు.

ముందు చెప్పినవిధంగా అవతరించిన కవితాశక్తిని జీవితంలో కొన్ని పరిస్థితులు మరింతగా రెచ్చగొట్టుతాయి. మన పూర్వకవులను గురించి ఏదో స్థూలంగా తప్ప జీవిత వివరాలు తెలియకపోవటంవల్ల ఈ విషయాన్ని వారి చరిత్రలో విశదీకరించటానికి వీలుపడదు ఇప్పటివాళ్ళు అందుకు అనువుగానే ఉంటారుగాని వాళ్ళను ఇక్కడ ప్రస్తుతించటానికి మాకు దమ్ములు చాలవు అందువల్ల పాశ్చాత్య కవులను పేర్కొంటూ అవకాశం ఉన్నచోట మనవారి విషయంకూడా సూచిస్తాను.

అనారోగ్యం కవితాశక్తిని ప్రజ్వలింపచేస్తుంది మామూలు మనిషికి జ్వరంవస్తే ఏవిధంగా మాటలు దొర్లిస్తాడో కవితాధోరణి ఉన్న వ్యక్తి రచనలను ఆవిధంగా బరికిపారేస్తాడు కీట్సుకవిని క్షయరోగం ఉద్వేగపరిచింది. అమెరికన్ రచయిత, డిటెక్టివ్ కథలను మొదటగా వ్రాసినవాడు ఆలెన్‌పో మతిభ్రమణంతో బాధపడేవాడు రష్యన్ నవలారచయిత డాస్టొవస్కీకి అప్పుడప్పుడు పిచ్చిఎత్తేది. దృష్టిపోయినతరువాత మిల్టన్‌కవి గొప్పకావ్యాలను వ్రాశాడు

నిషావస్తువులుగూడ ఆవిధంగానే కవితాశక్తిని ప్రోత్సహింపగలవు ద్రాక్షరసంవల్ల ఆవేశం తెచ్చుకుని వ్రాసిన కవులు ఎందరో ఉన్నారు డాక్టరు జాన్సన్ ఎడతెగకుండా టీ తాగేవాడు టీ లేకపోతే కలం సాగేదికాదుట. డ్రయిడన్ అధికంగా పొడుం పీల్చేవాడు పోప్ కాఫీధూమాన్ని ఆఘ్రాణిస్తూ పద్యాలు అల్లిపారేశేవాడు నల్లమందు సహాయంతో డీక్విన్సీ రసవంతమైన వ్యాసరచన చేశాడు ప్రీస్ట్లీచుట్టగాని పైపుగాని కాలుస్తూ ప్రసిద్ధికెక్కిన నవలలు వ్రాశాడు

స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు కవితాశక్తి తెంచుకుని బయటపడుతుంది ప్రపంచ కథకులలో ముఖ్యుడైన ఓహెన్రీ జైలులో పడినతరువాత గొప్పకథలు వ్రాశాడు. డాస్టవస్కీ ఉత్తమనవలలు చాలవరకు జైలులో వ్రాసినవే ప్రధాని జవహర్లాలు నెహ్రూ తన అమూల్య రచనలన్నిటిని జైలులో వ్రాయగలిగాడు తెలుగు నవలలో ఉన్నతస్థానం ఆక్రమించిన మాలపల్లి ని ఉన్నవ లక్ష్మీనారాయణగారు జైలులోనే వ్రాశారు.

దారిద్ర్యంకూడ అలాగే తోడ్పడుతుంది వాల్టర్ స్కాట్ వారానికొక నవలవ్రాసి తండ్రి చేసిన అప్పులన్నీ తీర్చాడు. ఫ్రెంచి రచయిత బాల్జాక్ నెలకు రెండుమూడు నవలలు వ్రాసి విపరీత ధనం ఆర్జించి తరగని అప్పులు తీర్చేందుకు బాధపడేవాడు. ఎడ్గార్ వాలెస్ గుఱ్ఱపు పందేలలో పోగొట్టుకున్న డబ్బును పూడ్చేందుకు ఇరవై నాలుగు గంటలలో నవలను తయారుచేసేవాడు.

ఈపైన ఉదహరించిన వాళ్ళందరిలోను కవితాశక్తిని ప్రకోపింపచేసిన అంశాలు అంతరించగానే రచనాపటిమ తగ్గిపోయింది ఆరోగ్యం బాగుపడితే పూర్వం మాదిరిగా నడిచేదికాదు జైలులోనుండి బయటికి వచ్చిన తరువాత అంత ఉత్తమ రచనలను చేయలేకపోయినారు దారిద్ర్యం తీరినతరువాత చప్పటి రచనలు బయలుదేరేవి

కాబట్టి ఏకారణంవల్లనైతేనేమిగాని ఒకే స్థాయిలో కవిత్వాన్ని నడిపించినవారు లేరు చాల అరుదు కాలక్రమాన ఎంత ప్రసిద్ధికెక్కిన కవి అయి ఎండిపోక తప్పదు ఎవరైనా ఇది కాదంటే నమ్మకండి

స్వరోచి —

"మృత్యువుడాఁగెడి చోటలేదొకో- మృత్యుదేవి కన్నుఁబ్రామ నొదవదు—"

అని పరులబోధించిన ధీరుడు. మఱియు వనదేవతచే "నీకగు బుణ్యలోకప్రాప్తి" యనిప్రబోధింపబడిన మహనీయమూర్తి

స్వరోచిషుడు —

"దేవ, భవద్దాస్య సుఖంబే వేడెద
సాలోక్యం బీవే యితరములొల్లన్"

అనుచు శ్రీ మహావిష్ణువును బ్రార్థించి, యనుగ్రహము గొన్నవాడు.

ప్రవరస్వభావము ననుసరించిన శాంతరస భావము క్రమముగ సాగి ఉత్తరోత్తరాభివృద్ధి గాంచి (Climan) స్వారోచిషునియందు రూఢియైన స్థాయిగొన్నది వీరిలో స్వరోచి, కుటుంబజంజాలపటల మగ్నుడై చెడకుండ భగవంతుడాతని రక్షించుటకై "విభావసి" యను భార్యమూలమున నతనికి "సకల మృగపక్షిజాతుల భాషల నెల్ల దెలియు"

విద్యనుపదేశము సేయించి, యతడు స్త్రీలోలత నరణ్యముల దిరుగాడుచుండు వేళల పక్షులచేతను, మృగములచేతను, ప్రబోధము జేయించియున్నాడు. ఆ ప్రబోధమే స్వరోచికి వైరాగ్యోదయ కారణమైనది. ఇదంతయు దైవ ఘటనము కలిధ్వంసకమగు కథలు గావలయునని ప్రార్థించిన శ్రీకృష్ణరాయల యభిమతము దీర్ప పెద్దనగారు తన కావ్యమున నీరసమున కాశ్రయమిచ్చిన కృతిభర్త, యభిలషితము దీర్చిన వాడగునో యోజింపవలెను. రాయలు వైష్ణవ భక్తాగ్రణి పెద్దనయు నట్టివాడే. ఇతివృత్తమున గూడ గవికి స్వతంత్రత లేకుండ రాయలవారే "స్వారోచిషమనుసంభవము — మార్కండేయపురాణోక్తము" అని నిబంధించిరి రససముచిత కథలతో—కలిధ్వంసక మహిమతో గృతి రచింపవలె పెద్దనార్యుడు. శృంగారాది రసములకు గలి ధ్వంసకమగు మార్గ నిరూపణ మొనర్చు యాత్మపరిశుద్ధి, యమరత్వముగూర్చు ప్రభావముగలదా? శృంగారరసాదికము లుపాసించినచో హృదయపరివర్తనము గలిగి, చిత్త నిరూఢి యేర్పడి విషయవైరాగ్యము కలిమి జితేంద్రియత్వము సిద్ధించునా? శమాదిషట్క సమృద్ధి యలవడునా? ఈ ప్రభావము శృంగార రసమునకు లేదుగదా! తొలిపద్యమున సనందాదులను, మాయాప్రవర సందర్భమున శాంతరస మొలుక బ్రహ్మతేజమును, వాక్యమును, స్వారోచిషుని పలుకులలో "సాలోక్యము నాకీవే" యను మాటను బ్రయోగించుటయందే కవి తన చాతుర్యమునుచూపి తన కావ్యము శాంతరసప్రధానమనుటను చెప్పక జెప్పుచున్నాడని తలంతును శాంతరస చిహ్నములగు విభావాను భావవ్యభిచారి భావములు ముఖ్యముగ ప్రవర, స్వరోచి పాత్రలయందు బరిణతిగొన్నవి ఈ యాఖ్యాయికయందు గంధర్వుఁడు బంగారమునకు టంకమువంటివాడు. ప్రవరతేజము నావహింపజేసికొని చరించినవాడగుట అస్వతంత్రుడు, శాపభీరుడునగుట వీని గొడవనంత గదడవక విడుచుట మంచిది ఈ గ్రంథమున శృంగార—శాంతములు, అంగాంగీ భావముల వెలయుచున్నవి. అట్లున్నగాని కథలయందు రససముచితత్వము—కలి ధ్వంసక ప్రభావము నెలవుకొనదు.

మనుచరిత్రము శాంతరసప్రధాన మనియు, నదియ పెద్దన కవి హృదయమనియు, స్వధర్మాచరణ పరతంత్రత, ఆశ్రమధర్మ నిర్వహణము, విషయ వైముఖ్యము, జితేంద్రియత్వము, భగవద్భక్తి, వర్ణధర్మము, స్త్రీధర్మము, మున్నగు మానవ జీవితమున కావశ్యములగు విషయముల దెల్పి, వారు పాపరహితులై, కలిధ్వంసకులై యైహికాముష్మిక సిద్ధివడయునటుల నుపదేశించుటే కావ్య ప్రయోజనమనియు ఈ లక్ష్యమును దాటక పెద్దన కావ్యనిర్మాణమొనర్చి కృతకృత్యుడయ్యెననియు నీచర్చవలన నిర్ణయింపగలుగుచున్నాము మనుచరిత్రౌచిత్యమును గుర్తించినవాడగుటనే రాయలవారు కృతినందుకొను నవసరమున పెద్దన యొక్కిన పల్లకిని దనచేతబట్టి యెత్తెను

శాంతరస ప్రధానముగ గావ్యరచన మొనర్చుట చాల కష్టమైనపని. కావుననే యిట్టి కావ్యములు విరివిగ జూపట్టవు ఇట్టి యమూల్య రచనా సంవిధానము పెద్దన కొక్కనికే చెల్లినది. ఇటుల గాదుగదా, దీని ననుకరించుచునుగూడ కావ్యసృష్టి యొనర్చుట ప్రయాసకరము అందుచేతనే మనుచరిత్రవంటి కృతి వేఱొకటి పుట్టకున్నది నేటివఱకుగూడ. విమర్శనములుమాత్రము చాల గలవు

నేనీ వ్యాసమును వ్రాయుచుండిన కాలమున బ్రహ్మశ్రీ కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రి శర్మగారు "మనుచరిత్ర హృదయావిష్కరణ" మను గ్రంథమును రచించుట దెలిసి శ్రీవారి నా గ్రంథము నొండు ప్రతిని బంపుటకు బ్రార్థించితిని శిష్యవాత్సల్యతమై వారా గ్రంథమును బంపిరి వారికిచట నా కృతజ్ఞతను వెల్లడించుకొనుచున్నాను. ప్రణాళికయందు శ్రీవారి గ్రంథమును, నా యీ విమర్శనమును భిన్న మార్గముల నడచినవి శ్రీ శర్మగారి రచనము మనుచరిత్ర కావ్యసర్వస్వమును బరామర్శించి గ్రంథౌన్నత్యమును స్థాపించుచున్నది.

ఆంధ్రకవితా పితామహుడిమ్మహాకావ్య సృష్టి గావించి, దీనిని శాంతరసప్రధానముగ బోషించి శ్రోతృపాఠకజనబృందమీయ పూర్వ కావ్యరసాస్వాదన మొనర్చి యమందానంద రస కందళితహృదయులై నందనందనుని పాదారవింద ప్రసాదమునొంది నిత్యకల్యాణ మనుభవింపుడని యాచంద్రతారార్కము భిక్షునిడి యశఃకాయుడై ప్రకాశించుచున్నాడు రాయలవంటిరాజును, పెద్దనవంటి కవీశ్వరుని, మనుచరిత్రవంటి మఱియొక కావ్యమును సర్వేశ్వరుడింకొకసారి ప్రసాదించి తన తెలుగు బిడ్డల మురిపెముల దీర్పగావుత

పరాసు సన్యాసి - రోజర్ సెమిత్రైజ్

శ్రీ జి. యల్. నరసింహారావు

మెడలో రుద్రాక్షమాల, మొలకు ఒక కాషాయగుడ్డ తప్పితే ఒంటిమీద మరో వస్తువేమీ లేకుండా విశాలనేత్రాలు కల్గి, కోటేరువేసినట్లున్న నాసికతో వెడల్పయిన ఛాతీతో దబ్బపండువంటి శరీరఛ్ఛాయకల్గిన ఒక వ్యక్తి ఇటీవల బెజవాడ బందరు, రాజమండ్రి, బాపట్ల మొదలైన పట్టణ పౌరులను ఆశ్చర్యచకితులను చేశాడు.

డబ్బు. ఇస్తే పుచ్చుకోకపోవడం. పుచ్చుకొన్నా దానిని వెంటనే ఇతర్లకు ఇచ్చివేయడం చూస్తే చాల విచిత్రంగా కనిపించింది.

"మానవునికి అవసరమైనది డబ్బు కాదు. అది వేరేఉన్నది. ఈ డబ్బు మానవుని అథఃపాతాళానికీ ఈడుస్తుంది. పక్షులు, జంతుజాలాలు, డబ్బులేకుండా జీవిస్తున్నప్పుడు నేనెందుకు జీవించలేను?" అని అతడు ఒక ప్రశ్నకు సమాధానముగా చెప్పాడు. అతడు ఇట్టి జీవితాన్ని పక్షిజీవితమంటున్నాడు కాని నిజానికి అది మాన్యమైన మహర్షి జీవితమే!


మహనీయమైన మహర్షి జీవితాన్ని సాగిస్తూ అజ్ఞాతుడుగా వుంటున్న ఈ మహానుభావుడే రోజర్ సెమిత్రైజ్ (Roger Semeteys) ఫ్రెంచి దేశీయుడు. బెజవాడలో డాక్టరు నమశ్శివాయగారి ఇంట ఒకరోజు ఆతిథ్యము స్వీకరించి అందరినీ ఆనందపరవశులను చేశాడు. ఆతిథ్యం అంటే మరేమీ కాదు. అరటిపండ్లు భుజించడమే!

ఫ్రెంచి దేశీయుడయినవాడు భారతదేశం ఎందుకువచ్చినట్లు?—వచ్చి ఈకాషాయవస్త్రాలేమిటి? ఇతని గమ్యమేమిటి? అనే ప్రశ్నలు అందరినీ గందరగోళ పెట్టినవి.

రోజర్ సెమిత్రైజ్ తన దేశంలో నాగరకహీనుడుగా పరిగణింపబడ్డాడు. యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు, యుద్ధంలో పాల్గొననందుకు, చాలకాలం కారాగృహంలో పెట్టబడి బాధింపబడ్డాడు. మాంసాహారమును విసర్జించినందుకు, బ్రహ్మచర్యాన్ని అలంబించినందుకు, తళుకుబెళుకులు తగ్గించి నిరాడంబర జీవితాన్ని గడిపినందుకు, ఈతనికి సంఘంలో స్థానంలేకపోయింది.

అవి నీతికి, యుద్ధాలకు, పరపీడనకు దారితీస్తున్న పాశ్చాత్య నాగరికతఎడల వైముఖ్యం పొంది,విసిగి, తుదకు ప్రఖ్యాతిగాంచిన హైందవ సంస్కృతివైపు, హైందవ ఆధ్యాత్మిక సంపద వైపు ఆశతో ప్రయాణమయ్యాడు. గాంధీజీని కలుసుకోవాలని అనుకున్నాడు. కాని ఆ భాగ్యానికి ఆయన నోచుకోలేదు.

పాస్‌పోర్టు లేకుండా అశేష కష్టాలుపడి సింహళంవరకూ రా గలిగాడు. అక్కడ దింపి వేస్తే ఆ దేశంలో పర్యటన చేశాడు. యోగాస్వామి అనే మహానుభావుడు ఈతనిమనస్తత్వాన్ని కనిపెట్టి హిందూ వేదాంతాన్ని బోధించి గాయత్రీమంత్రల చెప్పి, పవిత్రత, త్యాగం యొక్క చిహ్నమయిన కాషాయవస్త్రాలిచ్చి 'భారతదేశంలోని ఆధ్యాత్మికా కాంతులగు మహనీయులందరినీ సందర్శించు. నీకు దారి కనబడుతుం'దని చెప్పి దీవించి పంపాడు. అప్పటి నుంచీ అతను అలాగే సంచరిస్తూ తన పవిత్ర కార్యక్రమంలో తన గురువును చూచుకుంటూ, నదులలో స్నానంచేస్తూ, తనకు కావలసింది ఎక్కడ దొరుకుతుందని చెబుతారో అక్కడికి పరుగెడుతూవున్నాడు. "భాషలు తెలియక పోయినా భావాలు సంభాషిస్తాయి' అంటాడు. పుస్తకాలలో వుండే దివ్యజ్ఞానం ఆయనకు చాలదు. అసలు చదవడు. చదివి పూరుకోడు. అతడు కర్మయోగి. ప్రస్తుతము ఒక 'అన్వేషణ' లో వున్నాడు. గాంధీగారి కొల్లాయిగుడ్డ, నిరాడంబరజీవితమే తనను ఎంతోకాలంక్రిందట మార్చివేశాయని చెప్పాడు.



రోజర్ సెమిత్రైజ్—మత స్వీకారంలో 'కాశీకుమార్'గా మారాడు. ఎప్పుడూ ఉత్సాహంగా చిరుహాసంతో ప్రకాశవంతంగా తేలి పోతూ వుంటాడు.

సెమిత్రైజ్ ఒక గొప్పఋషి. చిన్నపిల్లవాడుకూడా—ఈ రెండు మనస్తత్వాలు అతనిలో కనపడుతూ వుంటాయి. పిచ్చుకలు ఆడుకుంటుంటే చూచి ఆనందంతో ఫ్రెంచి సంగీతగీతాలు గానంచేసి తన్మయం పొందిన హృదయమాతనిది. వాన కురుస్తుంటే ఆరుబయట కూర్చుని తడిసిపోతూ చినుకులతో ఆడుకుంటూ ప్రకృతిలో మైమరచిపోయిన మనస్తత్వమాతనిది.

ఏది పెడితే అది తిని పెట్టకపోతే మంచి నీరయినా అడగకకూర్చునే ప్రవృత్తి ఇతనిది. 'Cause' కన్న 'Faith' నే ఎక్కువ నమ్ముతున్నవాడు. మీ గురించి మా పత్రికల ద్వారా మావాళ్లకు పరిచయం చేస్తామంటే 'వద్దు. వద్దు. నన్ను మాయలోకి దించకండి' అన్నాడు. భారతప్రజల అందఱను కొనియాడుతూ నిజమైన స్వేచ్ఛ భారతదేశంలోనే వుంది అని వుద్ఘాటించాడు.

సెమిత్రైజ్, స్వామి శివానందను సందర్శించాలని హృషీకేశం పయనమయ్యాడు ఈతడు ఒకనాడు పరిపూర్ణజ్ఞానంతో మహత్తరశక్తిని సంపాదించి భారతవర్షసందేశాన్ని జీవితధర్మాన్ని పాశ్చాత్యులకు ప్రబోధించి పాశ్చాత్య సంస్కృతిని నూతనమార్గాన్ని పట్టిస్తాడేమో అనిపిస్తున్నది.

నీలాపనిందలు

(7వ పేజీ తరువాయి)

రొఖల్లో చేసినపని తప్పపనేఅయినప్పటికీ దాన్ని మంచిపనిగానే జమకట్టి సరిపెట్టుకోవడం సర్వత్రా లోకంలో ఆచారంగా వుంది గాని యీ అపనిందను వేసినవ్యక్తి యెవడో వాడు "ఫలానా" అని తెలియడమంటూ వస్తే లోకం ఆవ్యక్తిని సుఖసుఖాల క్షమించడమంటూ వుండదని వ్రాయనక్కఱలేదు పూరూ పేరూ తెలియకుండా బయలుదేరే వాట్లవిషయమే బయటికి వస్తే, సుఖసుఖాల క్షమింపరానిదిగా వుండేటప్పుడు, పూరూ పేరూ కనపడేటట్లుగానే కొందఱు అపవాదలు ప్రచురించడం చూస్తే, చాలా ఆశ్చర్యంగా కనపడుతుంది. యీవిషయంలో సజీవులకి సంబంధించినవి కొంత కుంతవ్యాలే అనుకున్నా కీర్తిశేషులకు సంబంధించినవి బొత్తిగా క్షంతవ్యాలు కావు, అలాటివాట్లనుగూర్చి లోకం కలిగించుకోవడం ఆవశ్యకమయినా కలిగించుకొన్నట్లు కనపడదు, అపవాదకుల వుద్దేశం కీర్తిశేషుడికి కళంకాన్ని ఆపాదించే తాత్పర్యం కలది కాకపోయినా తుదకి కళంకాన్ని ఆపాదించేదిగా పరిణమించినప్పుడు—"ఇది యుక్తమేనా? మీకు" అని నిర్మొగమాటంగా అడిగి యికముందేనా యిట్టి "నీలాపనిందలు" ప్రచారం చేసి లోకపరితాపానికి కారకులు కాకుండా వుండడానికి తగ్గవుపాయం చేయకపోవడం,లోకులతప్పుగా నాకు తోస్తూ వుంది. యిట్టి కుకల్పనలవిషయంలో వారు పెద్దలనిగాని విద్వాంసులనిగాని కవులనిగాని ఆలోచించి పూరుకోవలసి వుండదు.

"శ్లో॥ యుక్తియుక్తం వచో గ్రాహ్యంబాలాదపి సుభాషితమ్, వచనం తత్తు నగ్రాహ్య మయుక్తంతు బృహస్పతేః".

బాగా ఆలోచిస్తే లోకం అలాటి వ్యక్తులని మందలించవలసి వుంటుం దనడంకంటే యే కాలకర్మదోషంవల్లనో అలాటి కుకల్పన చేయడం తటస్థించినప్పటికీ, అడుగునబడి వున్న తమప్రాజ్ఞతను బయటికి తెచ్చుకొని పశ్చాత్తాపపడి, అపశ్చాత్తాపాన్ని స్వయంగా లోకానికి తెల్పడంలోనే విశేషం వుంది. కాని బుద్ధిపూర్వకంగా చేయాలని చేసినపనికి అలాటి సుయోగం యేలా సంఘటిస్తుంది? యిట్టి అయుక్తకార్యాలు చేసే వ్యక్తులకి యేచిక్కు కనపడదు గాని ఆయావ్యక్తులు వసించేదేశానికి చిక్కు కలుగుతూ వున్నట్లు యీమధ్య వొకానొక సందర్భం గోచరించింది. బంగాళాదేశంలో మహాత్మున్ని గూర్చి చేసిన (చెప్పువిసరడం) అపచారానికి బాధ్యత ఆదేశంలోనేకాక భరత ఖండంలో సర్వత్రా పేరుమోసి వున్న శ్రీ బోసు మీదికి రావడం పత్రికాపాఠకులందఱూ యెఱిగిందే కనక విస్తరించవలసి వుండదు. చతుస్సముద్రాలు వుండగా దక్షిణసముద్రానికే బంధనం తటస్థం కావడమనేది ఆ సమీపంలో రావణాసురుడు వుండడంవల్లనే అని వొకకవి చమత్కరించి వున్నాడు. సర్వథా దుస్సహవాసంవల్ల ప్రాణికోట్లకే కాదు, జడపదార్థాలకు కూడా కీడు మూడడం సర్వానుభవసిద్ధం కనుక యీ విషయం జాగ్రత్తగా గమనించవలసి వుంటుంది యిప్పటికాలానికిన్నీ పూర్వకాలానికిన్నీ భేదం వుంటుందని విశ్వసిస్తే తప్ప, అకాలమూ యీకాలంవంటిదే అయేయెడల, ఆనాటి చరిత్రలలో యేభాగం సత్యమో, యేభాగం సత్యేతరమో? నిర్ణయించడానికి మానవమాత్రుడు సమర్థుడు కాడు. జ్ఞానదృష్టి కలవారు అనగా—"అతీంద్రియజ్ఞానస్థులే" ఆయాగాథలయందు వుండే యాథార్థ్యాన్ని నిర్ణయించ తగ్గవారు. వ్యాసాదులు అట్టివారనే కారణంచేతనే భారతాదికం మనకు విశ్వాస్యమవుతూ వుంది. లోకంలో—"సత్యకాలం" అనేపదం వాడుకలో వుంది. కాని అది యెప్పుడు అమల్లో వుండేదో? సరిగా చెప్పలేము. క్రమంగా సత్యానికి దుర్దశ వచ్చి వుంటుందిగాని అమాంతంగా ఒకటేసారి వచ్చి వుండదు. కొంతకాలం యీ దుర్దశ పామరజనంలో అక్కడక్కడ దృశ్యాదృశ్యంగా వుండి క్రమంగా అంటువ్యాధిలాగ అలుముకొని తరవాత తరవాతయిది—పండితులనుకూడా ఆశ్రయించింది. పండితులనగా "యిది మంచీ యిది చెడ్డా" అనే వివేకం కలవారుకదా? అట్టివార్కికూడా యిదేంకర్మమని అనుకోవడానికి అవకాశం లేదు. యేమంటే కొన్ని అకృత్యాలు అవలంబించి తద్ద్వారాగా పామరులు పొందుతూ వున్న తాత్కాలిక లాభాలు చూచి కళ్ళుకుట్టి క్రమంగాఅలాటి వ్యాపారాలలోకి పండితులుకూడా దిగుతూ వున్నట్టు యిప్పటి ప్రపంచకం సాక్ష్యమిస్తూనే వుంది గనక విస్తరించవలసింది లేదు. యిది అలాటిది కాకపోయినా అంటే?—"ఆబ్రాహ్మణచ్చండాలపర్యంతమూ" జంకవలసిందే, అయినా క్రమంగా జ్ఞానులలో కూడా వ్యాపించడానికి కారణం యీ "నీలాపనిందకులకు" యేవిధమైన అపకారములున్నా దైవమూలకంగా వచ్చినట్లు లేకపోవడమే దానితోటి—"అసత్యకల్పన" మంటే—సర్వసాధారణమైనట్లు కనపడుతుంది. యీకల్పన కూడా వొకటే విధంగా వుండదు. కొందఱు లాభాపేక్షతో దీన్ని ఆశ్రయిస్తారు. కొందఱు యే ప్రయోజనమూ లేకుండానే దీనిలో వ్యాపకం చేస్తారు. యెవరెందుకు దీనిలో దిగినా, యెప్పుడో వొకప్పుడు యిది తగినంత ప్రాయశ్చిత్తము చేసితీరుతుందిగాని పూరికేపోదు. కాస్త నలుగురిలో తలెత్తుకు తిరిగే యే వ్యక్తికిన్నీ యీ నీలాపనిందా కారకత్వంలో పాల్గొనగూడదు. పాల్గొనడమే అనర్థదాయకమైనప్పుడు యీవత్తు యాజమాన్యమూ వహించవలసివస్తే, యిక చెప్పేదేమిటి?

యీ నీలాపనిందలకు గుఱియైన వ్యక్తులు చాలామంది వుంటారుగాని యీకాలంలో తి॥ వెం॥ కవులు గుఱిఅయినంత యెవ్వరూ అయివుండరు. గీరతంలోనున్నూ గుంటూరిసీమలోనున్నూ విశేషించి వుంటుంది. ఆ గ్రంథద్వయంలోనున్నూ—యీ నీలాపనిందలకు ముఖ్యంగా పరిశీలించతగ్గది. గుంటూరిసీమ గీరతంలో—

ఉ॥ కట్టుచునున్నవారు గృహకాండము నారకమందు" అనే పద్యాలు ప్రచురించిన తరవాతేనా అపవాదకులు భయపడి వెనక్కు తగ్గినట్లు కనపడుతుందిగాని గుంటూరి సీమ విషయంలో తుట్టతుద దాకా వొకటేపోకడ; అయితే ఆసీమలో పలువురు యోగ్యులు వుండి వెంటవెంటనే యథార్థాన్ని ప్రచురించి సహాయం చేయడంవల్ల కొన్నాళ్లకేనా అరొంపెలోనుండి బయటబడినట్లు గలిగాం గాని లేకపోతే యేమయేదో? చెప్ప జాలను. ఆయావ్యక్తులందఱినీ కాదుగాని, అందులో వొకటి రెండు వ్యక్తులు జ్ఞాపకం వస్తే యిప్పటికికూడా వొళ్ళు జలదరిస్తుంది. యెప్పుడో ఆకాలం అంతరించిపోయిందంటే—"తురకబ్బెరా తురకభాష" అన్నట్టు మళ్ళా యిప్పుడు అలాటివారు బయలుదేఱి యేవెట్టివెఱ్ఱి అసత్యాలో వ్రాయడంచేత యేదోకొంత—"పిల్లిమీదా యెలకమీదా" పెట్టి నాల్గుమాటలు వ్రాయడం!

యింతే, స్వస్తి—



ఇటీవల పరశురామక్షేత్రి అయిన కింగ్స్వే శరణార్థి శిబిరదృశ్యం.
12 వేలకుపైగా శరణార్థులు నిరాశ్రయులయినారు.

శాస్త్ర విశేషాలు :

శరీరము-సాధనము

శ్రీ పారనంది జగన్నాదస్వామి

మనము దేని సాహాయ్యమున ఆలోచన చేస్తూ జ్ఞానమును సంపాదిస్తున్నామో, దేని ద్వారా మన భావములు పుట్టి పొంగి పొర్లుతున్నవో, దేని ఆదేశమున శరీరవృత్తులన్నీ నడుస్తున్నవో ఆ వస్తువునకు మనస్సు అని పేరు. దానియొక్క వ్యాపారాలను, దానిసంపుటిని, దాని స్వరూపాన్నీ అనన్యాపేక్షముగా విచారించుట జ్ఞానసంపాదనమే కాకుండా జీవితధర్మాలను చక్కగా నెరవేర్చుటలో సహకారిన్నీ అవుతుంది.

అట్టి మనస్సునకు సాధనముగా శరీరము ఉపయోగపడుతూ ఉంటుంది; ముఖ్యముగా ఉపయోగించే శరీరాంగములు నరములు, వెన్నుపాము, మెదడు, మాంసకండరములు. శరీరమంతా ప్రతీ అంగుళములోను నరములు చక్కగా అల్లుకొని ఉన్నవి; వీటి ద్వారానే శరీరవృత్తులకు ఆవశ్యకమైన మనఃప్రబోధము నడుస్తూ ఉంటుంది. ఎట్లంటే—జ్ఞానముకలుగజేసే చోదనలు జ్ఞానేంద్రియములనుండిన నరములద్వారా మూలస్థానమైన మెదడుకి పోవును; అచ్చటినుండి ప్రవర్తక చోదనలు మాంసకండరములకూ కర్మేంద్రియములకూ ప్రవహించును.

ఒక్కొక్క విధమైన సంస్కారమును గ్రహించుటకు ఒక్కొక్క విధమైన సెల్లులు (cell) కల జ్ఞానేంద్రియ మున్నది. సంస్కారము కలుగునపుడు ఆ సెల్లులలో పుట్టే ఒకవిధమైన మార్పు అచ్చటినుండి మెదడుకు పోయే నరములద్వారా ఒకవిధమైన శక్తిరూపమున ప్రవహిస్తుంది. తీగె ద్వారా ప్రవహించే విద్యుచ్ఛక్తివలె ఈ శిరాశక్తి (nervous) ఉంటుంది.

ఈ శిరానిర్మాణముయొక్క పరిణామము చాలా చిత్రముగా ఉంటుంది. ఒక్క సెల్లే శరీరముగా గల అల్పప్రాణిలో ఆ సెల్లు ఒక్కటే అన్ని పనులను చేస్తుంది. ఎక్కువ సెల్లులు దేహముగా గల ప్రాణులలో ఒక్కొక్క సెల్లుకు ఒక్కొక్క వ్యాపారము నిర్ణీతమవుతుంది. ఆహారము ఉందని తెలుసుకొనే సెల్లుకున్నూ, అట్టి ఆహారమును గ్రహించుటకు ప్రవర్తించే సెల్లుకున్నూ అనవరతసంబంధము ఏర్పడుతుంది. ఇట్లు సంబద్ధమైన గ్రాహక ప్రవర్తక శిరాఖండము (Sensori-motor arc), శిరావ్యూహము (nervous system) అంకిలికి మూలము; అనగా ఈ మూలఖండముల సంఘాతములద్వారానే శిరావ్యూహము అంతా సిద్ధమైనదని చెప్పవచ్చును. ఒక మాంసకండరము ప్రవర్తించుటకు కరణము ఒక ఖండము. అనేకమాంసకండరములు ప్రవర్తించి ఒక వ్యాపారాన్ని చేయవలసి వచ్చినప్పుడు ఒక శిరాఖండముగాక చాలా ఖండములు సాధనము లవుతవి. కాని వ్యాపారము మాత్రము ఒకటే అవడముచేత ఆ ఖండములన్నీ అన్యోన్యము సంబంధములుకలవి అయి, విడివిడిగా ప్రవర్తించక ఒకదానితో ఒకటి కలిసినవిగా అగును. అప్పుడు ఒక చిన్న శిరాసంఘాతము ఏర్పడుతుంది. అట్టి కూర్పులు అనేకములు ఒకదానితో ఒకటి సంబంధము కలవియై క్రమముగా ఈ మెదడు నిర్మాణము సిద్ధమైనది. ఇంత చక్కగను చిక్కగను సంబంధాలు ఏర్పడినవి కాబట్టే మనుష్యవ్యాపారాలుకూడా ఇంత చిక్కగను చిత్రముగను ఉంటూ ఉన్నవి.

మనుష్యుడనగా బాహ్యముగా కనబడే శరీరమే అని భావించే రోజులలో వచ్చిన విభాగము ప్రకారమే ఇప్పటికిన్నీ రోగముల విభజన నిలిచి ఉన్నది. నిజముగా మానసికరోగాలు అని అనుకొంటూ ఉన్న వాటిలో కొన్ని రోగాలు శరీరసంబంధమైనవే. మెదడుకి తగిలే దెబ్బలచేత మెదడులో ప్రసక్తమైన వికృతులవలన పుట్టే మనోవికారములు శారీరక రోగాలా, మానసిక రోగాలా? అలాగే గర్భము మొదలైన అంతరాంగములలో పుట్టే దోషములవలన వ్యక్తమయే వికారాలు మానసికములైనా శారీరక రోగాలుగానే వైద్యుల చికిత్స ప్రణాళిక జరుగుతూ ఉంది. ఈ ఉదాహరణములవల్ల మనః శరీరముల సన్నిహితసంబంధము తెలుస్తూ ఉన్నది వీటిని కేవలమనోరోగాలుగా భావించ వీలు పడదుగదా. కేవల మనశ్శాస్త్రవిషయమైన మానసికరోగాలు లేకపోలేదు.

—



ప్రకాశంపంతులుగారు ప. గో. జిల్లాలో నైజాంసరిహద్దు పర్యటన జేయునపుడు రిజర్వుఫారెస్టులోగూడ జీపులో ప్రయాణముచేయుట.

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

"తనా ఫ్లాసీవ్నా కూడా కులాసాగానే ఉన్నారు."

"నాకోసం ఎదురుచూస్తున్నారు కాదూ!" ఆ ముసలి సేవకుడు మెడ ఒకపక్కకి వంచి సాభిప్రాయంగా చూశాడు.

"యవ్‌గనీ వాసిలివ్! వాళ్లని చూస్తే ఎంతో బాధ కలుగుతుంది, నిజంగా."

"ఆ, ఆ, చాల్లే, ఇంక నోరుముయ్యి. తొందరగానే వస్తున్నానని వాళ్ళతో చెప్పు."

"చిత్తం", టిమోఫీచ్ నిట్టూర్పుతూ అన్నాడు.

అతను బయటికి వెళ్ళిపోతూ తలమీద టోపీ రెండుచేతులతోనూ చెవులు మీదికి లాక్కున్నాడు. బాగా శిథిలమయిపోయిన ఆ గుఱ్ఱపు బగ్గీ ఎక్కాడు, వెళ్లిపోయాడు. కాని బండి పట్టణంవేపు కాదు పోతా.

ఆనాటి సాయకాలం ఓడిన్‌ట్సోవ్ సతి బజరోవ్‌తో తన గదిలో కూర్చుండి, ఆర్కాడీ ముందుసావడిలో కొట్యా వాద్యాన్ని వింటూ పచారు చేస్తున్నాడు. ముసలి రాకుమారి మేడమీద తన గదిలోకి వెళ్లిపోయింది. ఆమెకు అసలు అభ్యాగతులంటే సరిపడదు. అందులో ఈ జులా మురకపు నవీను"లంటే అసలే అసహ్యం. వారితో కలిసి కూర్చోవలసి వచ్చినప్పుడు ముఖం ముడుచుకుని ఉండేది, కాని తన గదికి పోయిన తరువాత సేవకురాలి ఎదురుగా ఆమె వారిని దూషిస్తున్నప్పుడు ఆమె టోపీ జుట్టు, అన్నీ ఆమె తలమీద నాట్యంచేసేవి. ఓడిన్‌ట్సోవ్ సతికి ఇదంతా తెలుసును.

"మీరు అప్పుడే వెళ్లిపోతానంటున్నారు?" ఆమె ప్రారంభించింది, "అయితే మీ వాగ్దానం?"

బజరోవ్ అదిరిపడ్డాడు. "ఏంవాగ్దానం?"

"మరచిపోయారా? నాకు రసాయనశాస్త్రం కొంచెం చెపుతానన్నారు."

"వెళ్లకతప్పదు. మా నాన్న ఎదురుచూస్తుంటాడు; ఇంక నేను ఇల్లా తిరగడం కుదరదు. మీరు "సామాన్య రాసాయనిక సూత్రాలు" అనే పుస్తకం చదువవచ్చు. చాలా స్పష్టంగా తెలుస్తుంది, మంచి పుస్తకం. మీకు కావలసినదంతా అందులో ఉంది."

"కాని మీ రన్నారు జ్ఞాపకంఉందా, వట్టి పుస్తకాలు చదివినందువల్ల ...... ఏదో నాకు జ్ఞాపకంలేదు, మీరు సరిగ్గా ఏమన్నారో, కాని నా అభిప్రాయం బోధపడిం దనుకుంటాను మీకు జ్ఞాపకం ఉందా?"

"వెళ్లక తప్పదు." బజరోవ్ మళ్లీ అన్నాడు.

"వెళ్లడం ఎందుకు?" ఓడిన్‌ట్సోవ్ సతి గొంతుక తగ్గించి అంది. అతడు ఆమెవేపు చూశాడు. ఆమె తల పడకకుర్చీ మీద వెనక్కి ఆన్చిఉంది. మోచేతులవరకూ ఆచ్ఛాదన లేని ఆమె చేతులు రొమ్ముమీద ముడుచుకొని ఉన్నాయి. కాగితపు గొట్టంలోఉన్న విద్యుద్దీపపు వెలుగులో ఆమెముఖం వెలవెల బోతున్నట్టు అనిపించింది.

"ఉండడం ఎందుకు?" సమాధానంగా బజరోవ్ అన్నాడు.

ఓడిన్‌ట్సోవ్ సతి తల ఒకపక్కకి కొద్దిగా వాల్చింది. "ఎందుకని అడుగుతున్నారా? నాతో గడిపిన ఈరోజులు మీకు సరదాగా గడవలేదూ? మీరు వెళ్లిపోయినా ఇక్కడ అంత బెంగపెట్టుకునేవాళ్లెవరూ లేరని మీ రనుకుంటున్నారా?"

"లేరని నాకు తెలుసును."

ఓడిన్‌ట్సోవ్ సతి ఒక ముహూర్తంపాటు మాటాడలేదు. "మీ రలా అనుకోడం పొరబాటు. కాని మీ రలా అనుకుంటున్నారని నేను నమ్మను. మీ రా మాట నిజంగా అనలేదు." బజరోవ్ నిశ్చలంగా కూర్చున్నాడు. "యవ్‌గనీ వాసిలిచ్, మాట్లాడరేం?"

"ఏముంది మాటాడేటందుకు? అంత బెంగపెట్టుకోవలసిన మనుష్యులు బహు కొద్దిగా ఉంటారు, నే నటువంటివాణ్ణి కాను."

"ఎంచేత?"

"నాలో చమత్కారం ఏముంది?. నేను వట్టి కర్రపెడి వంటి మనిషిని. నాకు మాట్లాడ్డంకూడా సరిగా రాదు."

"మీరు నటనకోసం అంటున్నారు యవ్‌గనీ వాసిలిచ్"

"ఆ అలవాటు నాకులేదు. మీకు తెలుసుగా, మీకు ఎంతో విలువయిన ఈ ఉదాత్త జీవిత పద్ధతులతో నాకు ఎటువంటి అనుబంధమూ లేదు."

ఓడిన్‌ట్సోవ్ సతి తన రుమాలుకోస కొరుకుతూ కూర్చుంది.

"మీ రేమయినా అనుకోండి. మీరు వెళ్ళిపోయినతరువాత నాకు ఏమీ తోచదు."

"ఆర్కాడీ ఉంటాడు" అన్నాడు బజరోవ్. ఓడిన్‌ట్సోవ్ సతి భుజాలు కదిల్చింది. "నా కేమీ తోచదు." అంది మళ్ళీ.

"నినిజంగా? ఏమయినా అతోచకపోవడం అట్టే కాలం ఉండదు."

"ఎంచేత అల్లా అనుకుంటున్నారు?"

"ఎంచేతనంటే మీ రొకసారి అన్నారు— జీవిత క్రమం సరిగ్గా మీ రనుకున్నట్టు నడవకపోయినప్పుడు తప్ప మీకు తోచక పోవడం అంటూ ఉండదన్నారు. తుచ-తప్పకుండా మీ

(22 వ పేజీ చూడుడు)



శ్రీ. ప్రకాశంపంతులుగారు నైజాం సరిహద్దు పర్యటన: ప. గోదావరి జిల్లా కామయ్యపాలెం గ్రామంలో ఉన్న ఈపటమునందలి సయ్యిసగము హైదరాబాదునందు, సగము ఇండియన్ యూనియన్‌నందూ యున్నది. పటమునందు ప. గో. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కొమ్మారెడ్డి సూర్యనారాయణగారు నైజాంరాజ్యమందు, ప్రకాశంగారు, యూనియన్‌సందూ నిలవబడియున్నారు.

హెన్రీ వాలేస్

అమెరికా లిబరల్ నాయకుడు

శ్రీ శిష్ట్లా ఉమామహేశ్వరరావు

1932 సంవత్సరంలో అమెరికాదేశపు కిసానులు అయోమయ పరిస్థితులలో పడిపోయారు. ఆసమయంలో ప్రపంచమంతటా గూడా రైతుల పరిస్థితులు బాగాలేవు. రైతులకు సహాయం చేద్దామనుకున్న వారికి గూడా అయోమయంగా వుంది.

న్యూయార్కు గవర్నరైన ఫ్రాంక్లిన్ డిలానో రూజవెల్టు హడ్సన్ నదికానుకుని వున్నతన ఫారంవద్దకు ఒకవ్యక్తిని పిలిపించాడు.

ఆ వ్యక్తియే "వాలేసెస్ ఫార్మర్" అనే పత్రికాసంపాదకుడు. ఇతడు కిసానైయుండీ, ధాన్యముల పండించుచూ, వ్యవసాయవిద్యను గ్రహిస్తూ అమెరికాలోని మధ్యపశ్చిమరాష్ట్ర మందు రైతులందరిచేత ఆదరణనూ ప్రేమనూ పొందినవాడు.

రూజవెల్టున్నూ వాలేసున్నూ దీర్ఘకాలం తర్కించారు. ఒకరి నూతాలనొకరికి ఎరుకపరచుకొన్నారు. ఒకరిపై యొకరికి మన్ననహెచ్చిస్నేహితులయారు.

రూజవెల్టు అమెరికాకు అధ్యక్షుడవగానే వాలేసును వ్యవసాయశాఖా కార్యదర్శిగా నియమించాడు. రూజవెల్టు మూడవ తఫా అధ్యక్షపదవికి నిలబడినపుడు వాలేసును ఉపాధ్యక్షపదవికి నిలబెట్టించాడు.

కుటుంబ సాంప్రదాయం

అమెరికా రాజకీయ జీవితమందు ముందు తరగతివారిలో వాడని ఎన్నికబడింది వాలేసు కుటుంబంలో హెన్రీ రెండవవాడు. ఇంతేగాక అమెరికా కిసానులకై జీవితం ధారపోసినవాడని అతని కుటుంబంలో పేరుబడుటకు యితడు మూడవవాడు.

ఇతని పూర్వీకులలో చాలమంది స్కాచ్—ఐరిష్ పెద్దలు కిసాను సాంప్రదాయాన్ని నిలబెట్టుకుంటూవచ్చారు.

ఇతని పూర్తిపేరు హెన్రీఅగార్డువాలేసు. ప్రెసిడెంటు హార్డింజ్ కాలంలో వ్యవసాయ శాఖా కార్యదర్శిగా పనిజేసిన హెన్రీ క్యాంట్ వెల్ వాలేసు కుమారుడు. ప్రెసిడెంట్ థియొడార్ రూజవెల్టుకాలంలో" కాంట్రీలైఫ్ కమిషన్‌లో (తాలూకా జీవిత విచారక సంఘములో) సభ్యుడుగా పనిచేసిన హెన్రీవాలేసు ఇతని తాత. ఈ హెన్రీవాలేసే "వాలేసెస్ ఫార్మర్" అన్న పత్రికను స్థాపించింది.

ఈ స్థాపన 1895 లో జరిగింది. అప్పట్నుంచీ యీ వాలేసు కుటుంబపువారే ఆ పత్రికకు ప్రధాన సంపాదకులుగా పనిచేశారు. ఈమధ్యనే 1933 లో మన మూడవ వాలేసు ఆ ప్రధాన సంపాదకీయ పదవికి రాజీనామా నిచ్చింది.

అయినా ఒకదానికిమాత్రం మన వాలేసు రాజీనామా నివ్వలేకపోయాడు, అదేమంటే; ఇతని తాత ఆ పత్రికపై చేసిన ఒక సూత్రప్రకటన "చక్కని వ్యవసాయకం, తేటయాలోచన తిన్నని జీవితం" అన్నదానికి సర్వధావిధేయత చూపించాడు.

హెన్రీ అగార్డ్ వాలేసుకాంటీ అయోవాలోని అడైర్ అనే గ్రామంలో 1888 సం॥ అక్టోబరు 7 న పైత్రుకపు ఫారంలో జన్మించాడు. ఆ ఫారంలోనూ ఆ దరిదాపులో వున్న డెస్ మోయిన్సు అనే నగరంలోనూ మనవాలేసుచిన్నతనాన్ని గడిపాడు. బాలుడుగా వున్నప్పుడే అనేకరకాలైన ధాన్యములను పరీక్షించడంలోనూ, వ్యవసాయక గణితశాస్త్ర సమస్యలను తర్కించడంలోనూ ఆ చుట్టుపక్కల ప్రెయిరీల పైని ఆకాశాలవంక చూస్తూ వాతావరణ పరిస్థితులను గురించి ప్రశ్నించుకోవడంలోనూ తరిఫీదు పొందాడు.

ఇట్లా ఇతని చిన్నతనాన్ని, ఇతని తండ్రియొక్క భారమున్నూ, కుటుంబీయకంగా వస్తున్న కిసాను పత్రికయున్నూ, తన తండ్రి ప్రొఫెసరుగావున్న ఏయోవాస్టేటు కాలేజీయున్నూ, తయారుచేశాయి. 1910 లో యితను ఉత్తమపరీక్షను పూర్తిచేశాడు.

ఇంతకు మునుపే వృక్షశాస్త్ర వృత్తాంతాల నెన్నో సేకరించాడు. ఈశాస్త్రం సంపాదనయందీతనికి చాల సహాయకారియైనది యితని కాలేజీలో ప్రొఫెసరుగావున్న జార్జివాషింగ్టన్ కార్వర్ అనే ఒక నీగ్రో వీళ్ళిద్దరూ వ్యవసాయపు భూములలోనూ, బంజరుబయళ్ళలోనూ మైళ్ళకొద్దీ తిరుగుతూండేవాళ్ళు. అంచేతి ఇతను ఎనిమిదవయేటనే విత్తనాలను సంకరపరచి క్రొత్తరకపు పూలజాతులను పెంపొందించడంలో ఆరితేరాడు.

మహాజ్ఞానులు పిన్నవయస్సులో సాధారణంగా నిరీశ్వరవాదులుగనో లేక సాంప్రదాయికతకు విరోధులుగనో తిరుగుట మామూలే. అట్లే వాలేసుకూడ కొంతకాలం తిరిగాడు.

కళాశాల విద్యార్థిగావున్న రోజులలో జీర్ణకోశము విషయములో అదియెంత పటుత్వము కలిగివుండునో అని గ్రహించుటకు తానే అనేకవిధములైన అజీర్ణకరవస్తువులను తిని ప్రాణాంతంవరకూ తెచ్చుకున్నాడు. అప్పుడాతనిని ఆరోగ్యోద్ధరణకై శాంతియుతంగా కొంతకాలం గడపుటకు కళాశాలనుంచి పంపివేయవలసివచ్చింది. కాని యీసమయంలోనే, తక్కువఖరీదు ఆహారపదార్థాలు—వాటి వుపయోగముగురించి అతను అనేకంగా తెలుసుకున్నాడు. అప్పటినుంచీ వ్యవసాయసంబంధ అర్థశాస్త్రవిషయాలు అతనికి జీవితపు ముఖ్య పఠనీయమైన విషయమైనాయి.

సెలవురోజులలో యీతను గంటలకొలది బయళ్ళలో తిరుగుతూ గడిపినకాలం వృథాపోలేదు. అతను అమెరికా వ్యవసాయాశాఖా కార్యదర్శి అయినపుడు, ఆయా ప్రాంతాల వాతావరణపరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేసే దీర్ఘకాలపరిమితి వాతావరణప్రకటనల ప్రభుత్వ సంస్థను నెలకొల్పడానికి సహాయకారియైనది.

వ్యవసాయ సూత్రాలు

వాలేసుయొక్క వ్యవసాయపు సూత్రాలు అనేకము దేశీయాలైనాయి. "సర్వకాల సాధారణ ధాన్యపు నిల్వలు" అని అతను అమలుకు తెచ్చినది ఒకగొప్ప ఉదాహరణము. ఈసూత్ర ప్రకారం విశేషంగా పండిన సంవత్సరాలలోని పంటలను తక్కువపంటల సంవత్సరాల అవసరాలను ఆదుకొడానికె నిలవజేసి ఉంచుతారు. ఇది వినడానికి స్వల్పవిషయం, పురాతన విషయం. కాని యుద్ధకాలమున సంయుక్త జాతీయసంస్థకు ఉపయోగపడడమేగాక యీ సూత్రం సర్వదేశాల సహకారమునకూ ఆదర్శవంతమైనది.

అంతర్జాతీయ దృక్పథం

పోలీసు ఆరడుగులమనిషి—ఏ సమయంలో కూడా కిసాను పోలికను పోగొట్టుకున్నవాడు కాడు. అమెరికా కిసానుల ఉదాహరణకు అతనినిచూచితే చాలు. సామాన్యదుస్తులను ధరిస్తాడు. గంభీరమైన గొంతుకతో ఏసమావేశంలో గూడా ఆకర్షణీయమై కనబడుతాడు. మాటలలోనూ ఉపన్యాసాలలోనూ బైబిలు సామెతలనుబహుళా విసురుతాడు.

మానసికంగానూ ఆధ్యాత్మికంగానూ అతని వ్యక్తిగతి విశాలవంతమై పెరిగినది. అతని చిన్నతనంనుంచీకూడా "అమెరికా నిర్ణయించుకోవాలి"అనే సిద్ధాంతంనుంచీ "సర్వజాతీయ సిద్ధాంతం"వరకూ కలిగిన మార్పులను ఆ చూకీగా తెలుసుకోవచ్చు.

1942 సంవత్సరంలో "శాంతిస్థావరమునకు పునాది"అనే గ్రంథాన్ని వాలేసు రచించాడు. అందులో అంతర్జాతీయ అవసరతలూ, మిళిత



వంతమైన ప్రపంచపూర్వికయూ—తప్పనిసరియైన భావిగతీ, యీ విషయాలగురించి అమోఘంగా చర్చించాడు.

ఈ సిద్ధాంతాలను వ్యక్తీకరించిన వాలేసు అంతర్జాతీయతా దృక్పథం ముందుంచుకున్న ఓనూతన వ్యక్తియైనాడు. అనధికారరీత్యా అయినప్పటికీ, అమెరికాయొక్క మున్ముందు కాలమును గురించిన సదుద్దేశాలు, సద్భావమును వెల్లడిపరిచే ఉత్తమపురుషుడైనాడు.

"అమెరికాయొక్క పట్టుదలతో కూడిన సహకారమూ సహాయమూవల్ల సంయుక్త జాతీయసంస్థ విజయవంతమై సాగితే యీ ప్రపంచానికి మళ్లా రెండవసారి కోలుకోకలిగే పరిస్థితి ఏర్పడి, ఆ మూలకంగా సరసవంతంగానూ పరస్పరసౌభాగ్యకరంగానూ ప్రగతించడానికి ప్రాతిపదియౌతుంది,"అంటూ ఆలోచనయుతంగానూ దయాళంతంగానూ, లింకను మహాశయునిమాదిరి, ఆ రెండవసారి కోలుకోవడము గురించిన పూర్ణవిషయాల నీవిధంగా తెలియజేశాడు: "దేశాల సరిహద్దునిర్ణయాలలో బహుజాగ్రత తీసుకుని సర్వవిషయాల పరిశీలించి నిష్పాక్షికంగా నిర్ణయించినంతమాత్రాన యీ ప్రపంచం మళ్లీ సంగ్రామంలో చిక్కుకుని దురవస్థల పాలుకాదుఅని అనుకోగూడదు. అంతేగాక ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించినంతమాత్రాన గూడా ఇట్టి దురవస్థలు తప్పిపోజాలవు."

ఈ నవ్యప్రపంచమంతా ఒకే అర్థికపుదేశము అనే విషయం అందరూ గమనించాలని ఇతని ఆదేశము. ప్రపంచమందంతటా, సర్వప్రజలూ, కృషి సల్పడానికీ, కొనుటకూ, అమ్ముటకూ స్వతంత్రత కలిగి యుండి తమ కృషివల్ల పొందిన సంపాద్యాన్ని తాము నిర్భయంగా అనుభవించవచ్చు అనేది కొంతవరకైనా రూఢిపడితేనేగాని ప్రజాస్వామిక తత్వపునాదులకు భద్రతలేదు అని యీతని నమ్మకము.

శాంతియొక్క భావి గతి

ప్రపంచం రెండవసారి కోలుకోవడం అనే విషయమే వాలేసుయొక్క సిద్ధాంతాలలోనూ మానసిక ఆందోళనలలోనూ ప్రథమమది. ఈ విషయాన్ని గురించే యీతనిటీవల విదేశతంత్రాంగ విషయసంస్థ సమక్షాన రేడియో ప్రసంగం కావించాడు. "ప్రజాస్వామ్యతను గురించిన నూతన నిబంధన గ్రంథములో విధ్యుక్త ధర్మసూత్రాల బిల్లును వ్రాయుటకు భగవంతుడు మనకు జ్ఞానముకలిగించుగాక.

"స్వాతంత్ర్యంతోబాటు మనం దరమనస్సులలోనూ పరస్పర ఆధారతాతత్వం ఏర్పడాలి. హక్కులను గురించి ఏవిధంగా యోచిస్తున్నామో అంతకన్న మిన్నగా విధ్యుక్త ధర్మాల గురించి యోచించాలి. మన అధికారశక్తికి తగినట్లుగా మన బాధ్యతాబద్ధతను ఎరిగి వుండాలి" అని ఆ ప్రసంగంలోని తుది వాక్యాలు

ఈయన 1914 సంవత్సరంలో కళాశాలా విద్యార్థిగావున్నప్పుడు ప్రేమించిన ఐలోబ్రౌను అనే యువతిని పెండ్లాడాడు. వారికి ముగ్గురు బిడ్డలు ఈతనితల్లి ఇంకా జీవించియే యున్నది.

వాలేసు ఇప్పుడు అమెరికాలో తృతీయపక్షనాయకత్వము వహించియున్నాడు. ప్రపంచభావి సౌభాగ్యము యీ తృతీయపక్షముల అభ్యుదయముపై యాధారపడివుంది.

నేటి ప్రపంచం

(5 వ పేజీ తరువాయి)

ఆదేశాన్ని ఈ జిప్టు స్పష్టంగా నిరాకరించింది. సౌదీ అరేబియా మొదలైన మిగతా అరబ్ రాజ్యాలు ఏవేవో ఎదురు షరతులను ప్రతిపాదించినవి.

* * *

తొలి ఆదేశం ఈ విధంగా విఫలం కాగా, భద్రతామండలి పాలస్తీనా సమస్యపై తిరిగి చర్చ జరిపి, నాల్గువారాలపాటు యుద్ధవిరమణ అవసరమనీ క్రొత్త ఆదేశాన్ని పంపింది. ఈ ఉత్తర్వను యూదులు, అరబ్బులు అనుసరించదలిచిందీ, లేనిదీ తెలియజేస్తూ జూన్ 1 వ తేదీ రాత్రిలోపుగా సమాధానం ఇచ్చితీరాలనీ, యుద్ధవిరమణను సాధించలేకపోతే ఐక్యరాజ్యసమితి ప్రణాళికలోని 7 వ నిబంధన ప్రకారం తీవ్రమైన ప్రత్యక్షసైనిక, ఆర్థిక ఆంక్షలు అమలు జరపవలసివస్తుందనీ కూడ భద్రతామండలి ఈతాఖీదులో కఠినమైన హెచ్చరికచేసింది. ఇది భద్రతామండలికి బ్రిటన్ చేసిన ప్రతిపాదనలో ఒక భాగమే. 36 గంటల వ్యవధి ఇచ్చి, ఆదేశాన్ని అమలుజరపకపోతే ఆంక్షలు ప్రయోగించాలని రష్యాతెచ్చిన ప్రతిపాదన వీగిపోయింది. బ్రిటిష్ ప్రతిపాదనపై రష్యా, యుక్రేన్ ప్రతినిధులు వోటుచేయక తాటస్థ్యంగా వుండిపోయినారు. భద్రతామండలి తిరిగి ఈబుధవారానికి వాయిదాపడ్డది. నూతన ఆదేశం విషయంలో యూదు అరబ్ వర్గాలు యింకీ భావాన్ని ప్రదర్శిస్తున్నట్లు కనబడుతున్నవి. ఈ క్రొత్త ఆదేశం ఎంతవరకు ఫలప్రదం అవుతుందో లేక తొలి ఆదేశంమాదిరిగానే పరిణమిస్తుందో చూడాలి. యూదురాజ్యాన్ని గుర్తించిన రష్యా ప్రభుత్వం దానితో రాయబార సంబంధాలను సైతం ఏర్పాటుచేసుకోబోతున్నట్లు వార్తలువస్తున్నవి. కొన్ని షరతులమీద అమెరికా దాదాపు 10 కోట్ల డాలర్లను "ఇజ్రాయిల్"కు అప్పు ఇవ్వడానికికూడా నిర్ణయించింది

పాలస్తీనా విషయంలో అమెరికా ఐక్యరాజ్యసమితిని ఒత్తిడిచేసేటట్లయితే, పెట్రోల్ ఉత్పత్తి వ్యాపారం మొదలైనవాటికి లోగడ ఇచ్చిన సదుపాయాలన్నిటినీ రద్దుచేస్తామని సిరియా అమెరికాను బెదరించినట్లు తెలుస్తున్నది. వీటన్నిటినిబట్టిచూస్తే పాలస్తీనా అంతర్యుద్ధం చివరకు వివిధరాజ్యాల బాహాటసంఘర్షణగా పరిణమించక మానదేమో ననిపిస్తున్నది. ఈ సమస్యను ఐక్యరాజ్యసమితి ఎంతవరకు పరిష్కరించగలుగుతుందో, ఎంతవరకు దాని ప్రతిష్ఠను కాపాడుగలుగుతుందో చెప్పలేము.

* * *

సోవియెట్ రష్యా ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో తమ ప్రతినిధిగా పనిచేస్తున్న గ్రోమికోవ్‌ను, వాషింగ్టన్‌లోవున్న తమ రాయబారి పాన్యుష్కిన్‌ను స్వదేశానికిపిలిపించి అమెరికాతో తమకేర్పడిన ప్రతిష్ఠంబనను గురించి పునః పరిశీలన చేయదలచినట్లు వార్తలు వస్తున్నవి. రష్యా మిగతా అగ్రరాజ్యాలపై తన విషప్రచారాన్ని కట్టిపెట్టి సవ్యమైన ధోరణిలో ప్రవర్తిస్తే వివిధ విభేదాలను పరిష్కరించుకోడానికి అమెరికా సిద్ధంగానే వున్నదని అమెరికా విదేశమంత్రి జార్జి మార్షల్ ప్రకటిస్తున్నాడు. అగ్రరాజ్య ప్రతిష్టంభనా పరిష్కారానికి కటపటిప్రయత్నం జరిగేటట్లున్నది. ఇదివరలో స్టాలిన్ ప్రతిపాదనను తిరస్కరించిన అమెరికా నైతికప్రతిష్ఠను ఏదోవిధంగా సాధించాలని తాపత్రయపడుతున్నది. ఒకకొలికివచ్చిన అగ్రరాజ్యవిభేదాలు ప్రియత్వపు శుష్కప్రియాలతో పరిష్కారమయేవి కావు; పరిష్కారం కావు. ప్రత్యక్షచర్యల ద్వారా శాంతి ప్రయత్నాన్ని ప్రదర్శించి, స్వీయప్రాబల్య విస్తరణ కాంక్షను అటు అమెరికా, ఇటు రష్యాకూడా విరమించుకొని, చిన్నరాజ్యాలకు స్వేచ్ఛాప్రవర్తనాధికారాలను ఇవ్వాలి; అదే పరిష్కారమార్గం; అప్పుడే లోకశాంతి.

కాంగ్రెసు - పార్టీలు

శ్రీ జి. కృష్ణ.

మొదట్లో కాంగ్రెసు సంస్థనిండా మితవాదులే. గానుగాను అతివాదులు ఎక్కువకా సాగారు కాంగ్రెసులో. దాంతో మితవాదులు ఈ సంస్థనుంచి తప్పుకోటం సాగించారు.

అసలు కాంగ్రెసులక్ష్యం స్వరాజ్య సంపాదన. ఈ లక్ష్యసిద్ధికోసం అనేక తత్వాలవారు కాంగ్రెసుతో కలిసి పని చేశారు. తీరా స్వరాజ్యం వచ్చింది. ఈ వివిధతత్వాలవారంతా ఏం చెయ్యాలి? ఉదాహరణకు—కాంగ్రెసులో పెట్టుబడిదారులున్నారు. వీరు కాంగ్రెసులో చాలా ప్రాబల్యాన్ని సంపాదించారన్న సంగతి అందరికీ తెలుసు. రెండు: సోషలిస్టులున్నారు. వీరు పెట్టుబడిదారులనుంచి ప్రజల్ని విముక్తుల్ని చేయాలంటారు. మూడు: గాంధేయులమని చెప్పుకొనేవారు. వీరికి పెట్టుబడిదారుల్తో మంచి దోస్తి. కాని గాంధీతత్వ ప్రకారం ఇంతవరకు ఒక్క పెట్టుబడిదారుకూడా ధర్మకర్తృత్వం వహించలేదు. అయినా గాంధీ తత్వాన్నిగురించి వాఙ్మయం పెరుగుతూనే ఉంది. నాలుగు: రైతుకూలీ ప్రజాకార్లు. రైతులు కూలీలు ప్రజలుకానట్లు అర్థమిస్తుంది ఈ పేరు. మానవులు మూడు తరగతులనీ; (లింగభేధాల ప్రసక్తి లేదు) అవే. రైతులు, కూలీలు, ప్రజలు అని వీరి తాత్పర్యం. ఇందులో రైతులు ప్రజలు కారు. కూలీలు ప్రజలుకారు. ఈ రైతుకూలీ ప్రజాకార్లొక విశ్వామిత్రసృష్టి. ఐదు: స్వతంత్ర వ్యక్తులు. వీరికి సొంత పలుకుబడి, స్వాభివృద్ధి ముఖ్యం. తమ కోర్కెలు తీరితేచాలు, మరి మాటాడని బాపతు. వీరంతా కాక నికార్పైన దేశభక్తులు అనేకులు లేకపోలేదు. కాని వారికి కాంగ్రెసు సంస్థలో ఏలాటి పదవులు లభించవు, కులమో, బీదరికమో వ్యక్తిత్వమో వీరి అభ్యున్నతికి అడ్డువస్తూ వుంటుంది. ఇవీ ప్రస్తుతం కాంగ్రెసు సంస్థలో ఉన్న గ్రూపులు వ్యక్తులు. ఇందులో ఒక్క సోషలిస్టులే గౌరవంగా బయటకు వచ్చారు. మిగిలినవారు కాంగ్రెసు పేరు చెప్పుకొని, అనేకపనులు చేస్తున్నారు. దాని మూలంగా కాంగ్రెసు పలుకుబడి ఏమవుతోందో తెలుస్తూనే ఉంది.

స్వరాజ్యం వచ్చే టైముకు, అదివరకు అతివాదులుగా ఉండే పెద్దలంతా మితవాదులైపోయారు. అదివరకు సంస్థానాధీశుల్ని చెడతిట్టినవారు, నేడు వారికి బతుకు తెరువులు చూపిస్తున్నారు. అదివరకు బ్లాక్‌మార్కెటీర్లను గోడలకుపైవాని వారిని ఉరితీయాలన్నవారు, నేడు మంత్రులైకూడ అలాంటివేవీ చేయడంలేదు. ఇంతకుముందు, పరిశ్రమల్ని అన్నింటిని జాతీయం చెయ్యాలన్న పెద్దలు, ఇప్పుడు అలా వీలుకాదంటున్నారు ఫలితం ఏమిటంటే మొదటినుంచీ మితవాదుల్ని బయటకు గెంటిన కాంగ్రెసునుంచి, నేడు అతివాదులే తప్పుకోవాల్సి వచ్చింది.

సోషలిస్టులు కాంగ్రెసునుంచి బయటకు వచ్చేశారు కాని సోషలిస్టులు స్వరాజ్య సంపాదన జరిగేవరకూ, కాంగ్రెసులోనే ఉన్నారు. ప్రతి ఉద్యమంలో పాల్గొన్నారు (ఒక్క వ్యక్తి సత్యాగ్రహంలో మినహా) పోలీసులకు జడిసిగాని, జైలంటే ఒళ్ళు కంపించిగాని, సోషలిస్టులు సోమరిపోతు వేషాలు వెయ్యలేదు. "నన్ను నిర్బంధించరా బాబు" అని ఏ పోలీసును సోషలిస్టులు బతిమాలలేదు. వాళ్ల ధర్మాన్ని వాళ్ళు చేసేవారు. అందులో కుట్రలు, ఎత్తులు, ఆక్రమింపులు, చెల్లింపులు, మారాములు సోషలిస్టులు ఎరుగరు. కాంగ్రెసుతో భేదాభిప్రాయాలొచ్చాయి—పెద్ద మనుష్యుల్లాగా బయటకు వచ్చేశారు.

అయితే ఆ భేధాభిప్రాయాలేమి? సావకాశంగానే విచారిద్దాం. ఆట్టే గ్రంథంలోకి దిగకుండా. 1942 ఘట్టంలో అనేకులు జస్టిస్ పార్టీ వారు, కాంగ్రెసు దేశభక్తుల్ని పోలీసుల కప్పగించారు. కాని దేశభక్తులు, సోషలిస్టులకంటె, ఈ జస్టిస్‌పార్టీవారు కాంగ్రెసువారికి ప్రియులైపోయారు. కారణం ఏమంటే...ఈ కాంగ్రెసువారికి, జస్టిస్‌పార్టీ వారికి ఉమ్మడి ఆదర్శం ఒకటి ఉంది. అది శాఖా తత్వం. తర్వాత కాంగ్రెసు ప్రభుత్వాల్లో బ్లాక్ మార్కెటువార్లకు, లంచగొండులకు చక్కటి రక్షణలు లభించాయి. ప్రభుత్వాల్లో పెట్టుబడిదారుల ప్రతినిధులుచేరారు. ఎవడైనా బ్లాక్ మార్కెటీర్‌గాని, లంచగొండిగాని, బయటకు ఈడ్వబడుతే, వాడికి సహాయంచేయటానికి అనేకులు కాంగ్రెసు పెద్దలు సిద్ధమౌతారు. ప్రజాధనంలోంచి నెలజీతాలు పుచ్చుకుంటున్న కాంగ్రెసు శాసన సభ్యులు, ఆ డబ్బును తినటమే కాక, లంచాలను మెక్కి పైగా పదవీ రాజకీయాల్లో ఈదులాడుతారు. తమ సన్నిహితుల్లో తప్ప, మిగతా ప్రజల్తో ఈ శాసన సభ్యులకు సంబంధమే లేదు. చాలామంది కాంగ్రెసువాదుల అనుగ్రహం, శాఖా సన్నిహితత్వం, అంతశ్శాఖా సన్నిహితత్వాల్ని బట్టి మాత్రమే లభిస్తుంది. ఇది స్వానుభవం—అనేకులకు! ముస్లింలీగువారు ఇంతకంటె ఎక్కువగా శాఖాతత్వాలని బోధించలేదేమో అనుకుంటాను. హార్లిక్సుసీసా మూడు రూపాయల ఆరణాలు అని పత్రికల్లో ప్రకటించి, రూ 5-8-0 కు అమ్ముకుంటే, కాంగ్రెసు ప్రభుత్వం ఏమీ అనలేదు. గుడ్డముక్క 12 అణాలు అని ధర వేసి రూ 2 కు అమ్ముతుంటే, ఏమీచేయలేదు మన ప్రభుత్వం. బీదవాడు కొంప కట్టుకుంటానంటే కిటికీ చువ్వలివ్వలేదీ ప్రభుత్వం, కాని పెట్టుబడిదార్లకు, వారి సన్నిహితులకు సిమెంటు, ఇనుము పర్మిట్లు ఇట్టే లభిస్తాయి. రైతుకు నాగటికర్రు నివ్వలేని ప్రభుత్వం సహకార ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడుతుంది పైగా శాసనసభ్యులకు కాంగ్రెసు పెద్దలకు బ్లాక్‌మార్కెటింగ్ అవకాశాల్నిస్తుంది. పెరిగిపోతున్న ధరల కనుగుణంగా, జీతాల్ని పెంపొందింపచేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాలేని రైతుకూలీ ప్రజాకార్లు, తాముకూడా కాంగ్రెసు సత్రంలో చేరొంకదా అనే ధైర్యంతో, సోషలిస్టులమీద గడ్డవేస్తారు. ఏమి దారుణం!

మే 19 నాటి వారపత్రికలో శ్రీగోగినేని ఉమామహేశ్వరరావు, సోషలిస్టువిధానం అనే వ్యాసం వ్రాశారు. నా ఈ వ్యాసం, వారికి ప్రత్యుత్తరం.

శ్రీగోగినేని, సోషలిస్టుల్ని విమర్శిస్తూ, సహకార ప్రజాస్వామిక రైతుకూలీ ప్రజారాజ్యాన్ని స్థాపించటం అవసరమని వ్రాసుకున్నారు. ఈ రోజుల్లో 'ప్రజా' విశేషణం ప్రతివారికీ ప్రతి పనికీ కావాల్సివస్తోంది. ప్రజాశక్తి, ప్రజారక్షణ చట్టం, రైతుకూలీ ప్రజారాజ్యం. కానీ గోగినేని వారు స్థాపించదల్చుకున్న రాజ్యంలో రెండు ప్రజలున్నాయి. నాత్మ వైష్ణవుడినామం పెద్దది! సోషలిస్టులు ముసుగులో గుద్దులాడుతూ, రెండావుల దూడలాగా కాంగ్రెసులో ఉంటూవచ్చారని ఈ రైతుకూలీ ప్రజాపక్షంవారంటున్నారు. కాంగ్రెసు పరువును బజార్లో కీడ్చేకంటె, ముసుగులో గుద్దులాటే నయం. క్రమశిక్షణాబద్ధులైనవారు ప్రత్యేక పార్టీలను నిర్మింపలేరు. ఆ పనిని రైతుకూలీ ప్రజాకార్లే చేస్తున్నారు. కాని సోషలిస్టులు బయటకొచ్చేశారు. లోపలేవుండి గాంధీపార్టీలు, రైతుకూలీ ప్రజాపార్టీలు, పెట్టుబడి దారీపార్టీలు, వగైరాపార్టీలను సృష్టించి కాంగ్రెసుపేరును కలుషితంచేసే కన్న బయటపడటం సముంజసం. కాబట్టి ముసుగులో గుద్దులాటలూ, రెండావుల దూడలూ అనటం అనౌచిత్యంగా ఉంది. పైగా, అలా అనటానికి, రైతుకూలీ ప్రజాకార్లకు అర్హత లేదు. పెద్దమనుష్యులైతే కాంగ్రెసునుంచి బయటకువచ్చి, మీ రైతుకూలీ ప్రజాబలం ఎంతో చూసుకోండి. సోషలిస్టులకు శ్రమికుల్లో ఉన్నమాత్రం బలంకూడా, మీకు కన్పించదు.

వచ్చిన స్వరాజ్యంలో సోషలిస్టులకు పెద్ద భాగం ఉంది. సోషలిస్టులుపడ్డ కష్టాలగల్ల వారికి నాయకత్వం వచ్చిందికాని, ఎవ్వరూ వారికి నాయకత్వపు ముద్రల్ని వేయలేదు. ఆ ముద్రల కోసం పాకులాడేవారు శ్రీ గోగినేనివారికి తెలిసేఉండాలి. అష్టకష్టాలుపడి సంపాదించిన స్వాతంత్ర్యంలో, భాగం ఉండబట్టి, సోషలిస్టులు ప్రభుత్వాల్ని సరిగా వ్యవహరించమంటున్నారు. కాని శ్రీ గోగినేని, కాంగ్రెసు ప్రభుత్వాల కింకా పురుడు వెళ్ళలేదంటున్నారు. పురిటిలో ఉండగనే వెక్కిరించటం భావ్యం కాదట! అసలు పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది. ఇంతవరకు పదవులకోసం కాంగ్రెసువారు చేసిన నీచకృత్యాలను చూస్తే, ఈ ప్రభుత్వాలకి పురుడు వెళ్ళేనా అనిపిస్తోంది. ప్రభుత్వాల మాట అలా ఉంచి, కాంగ్రెసు సంస్థను చూద్దామంటే, అది అంతే. అంత అమానుషత్వం ఎక్కడా ఉండదు. నిరంకుశత్వం మించిపోతోంది. గాంధిగారిపేరు చెప్పుకొని మాత్రమే, వీరింకా ప్రజానీకంలోకి అప్పుడప్పుడు వెళ్లటం వీలవుతోంది అని నా ఊహ. సోషలిస్టు పార్టీపైనున్న పదిమంది నాయకులపై ఆధారపడిఉందని శ్రీ గోగినేని అభిప్రాయం. కాని కాంగ్రెసంతా కి॥ శే॥ గాంధీజీ పేరు మీద ఆధారపడి ఉంది. అయితే పెట్టుబడిదార్లయొక్క, జస్టిసైట్లయొక్క మతాన్ని పుచ్చుకొని, కాంగ్రెసు పలుకుబడిని, కాంగ్రెసునాయకులు, రైతుకూలీ ప్రజాకార్లు ధ్వంసంచేసేశారు. గాంధీజీకి ఇంతకంటె అపచారమేముంది? కాంగ్రెసు సంస్థలు కాంగ్రెసు ప్రభుత్వాల్ని నిందిస్తున్నాయి. కాని, శ్రీ గోగినేని, సోషలిస్టులు తాగిన రొమ్మునే పొడుస్తున్నారన్నారు. ఈ కాంగ్రెసువారేం చేస్తున్నట్లు? భ్రాతృహత్యలు చేస్తున్నారవాలా? క్రమశిక్షణకులోబడి, ఇన్నాళ్లనుంచి సోషలిస్టులు తమపార్టీని నిర్మించుకోలేదు. కాని కాంగ్రెసులో ఒకరైతుకూలీ ప్రజారాజ్యం దాపురించింది. ఈరైతుకూలీ ప్రజాకార్ల పనులు ఏమై ఉంటాయి? తమపార్టీని బలంచేసుకొని మిగిలిన కాంగ్రెసుపై దెబ్బతీసే ప్రయత్నాలు చేయటం. అంతర్జాతీయ హంగులక్కి సమావేశాల్ని జరపటం. పత్రికలద్వారా నాయకత్వాలను బలంచేసుకుని, నాయకుల్ని సృష్టిచేయటం. ఇన్ని పనులు, గాంధీజీ రైతులు, కూలీలు, ప్రజలపేరిటే జరుగుతూ ఉంటాయి.

రాజ్యాంగపరిషత్తులో ప్రభుత్వంలో స్థానం వద్దని సోషలిస్టులు అన్నారు. రాజ్యాంగ పరిషత్తులోకివచ్చిన సభ్యులు ఎవరెవరో తెలుసుకుంటే, శ్రీగోగినేని, సోషలిస్టులు తప్పుచేశారనరు. జీవితంలో స్వాతంత్ర్య పోరాటమంటే సానుభూతిలేని పెద్దల్ని ఎందరినో, పరిషత్తుకు పంపారు. వీరి పరిపాలనకూర్చొని దేశానికి చేయగల మేలు శూన్యం. కాంగ్రెసులోని పెట్టుబడిదార్లముఠా, మితవాదులు కలసి చిత్తం వచ్చిన చట్టాలు చేస్తుంటే సోషలిస్టులు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలి. ప్రభుత్వంలో చేరాలంటే షణ్ముగంచెట్టి, భాభా, లాంటివారితో పని చేయటం ఎంత హాస్యాస్పదం! జస్టిసైట్లతో చేతులు కలిపినవారికి దీనిలోని అక్రమం తెలియకపోవచ్చు, కాని, దేశభక్తులకు మాత్రం ఈసర్ చెట్టిలాంటివారితో సాపత్యంవీలు కాదు.

ఇక ధనికులయెడ సోషలిస్టుల విధానాన్ని గురించి.

సోషలిస్టులు డబ్బున్నవాళ్లను చూసిఏడ్వరు. 'ఆ డబ్బుపెట్టి మా నెత్తినవెక్కి ఊరేగకు బాబు' అని చెప్తారు. వినకపోతే ఎత్తికూలేస్తారు. అది హింస అంటే లాభంలేదు. క్రమక్రమంగా దింపి కూర్చోపెట్టే ఓపికలేదు. ఈ క్రమక్రమంలో వాడు మన మెడపిసుకుతాడు. అప్పుడు మనల్ని ఏ ప్రజారక్షణచట్టమూ వచ్చి రక్షించదు. కానివాడిని ఎత్తికూలేస్తే మాత్రం ప్రజారక్షణచట్టం చటుక్కున ముందుకొస్తుంది.

మొట్టమొదట గాంధీజీని హత్యచేయాలని జరిగిన ప్రయత్నాన్ని బాగా పరిశీలించి, తక్షణ చర్య తీసికోకపోవటానికిగల కారణాలేవో, ఇంకా ఎవ్వరికీ తెలియలేదు. పైగా గాంధీజీ హత్య జరిగినతర్వాత కూడా, పోలీసులు, కాంగ్రెసువారు చాలా అనుచితంగా ప్రవర్తించారు. దీన్ని గురించి ఎక్కువగా ప్రస్తావింప నక్కర్లేదు. కాకపోతే పటేల్‌ను సోషలిస్టులు విమర్శించారని శ్రీ గోగినేనికి ఆగ్రహం. పటేల్‌ను 'హోంశాఖా' మంత్రిగా విమర్శించారేగాని, వ్యక్తిగతంగా కాదు. అలా కాదంటే, నమ్మనివాడికి చెప్పి ప్రయోజనం లేదు. పటేలంటే, అందరికీ గౌరవం ఉంది. ఆయన విధానాన్ని విమర్శించటంలో గౌరవభంగమేమీ లేదు. సోషలిస్టులకు పటేలును పొగడి కాలంగడిపే అవసరంలేదు. అదంతా పదవులకోసం, ప్రాబల్యాలకోసం, కుట్రలు, కక్షలు నిర్మించే ఇంటిదొంగలకు. ఇలాంటి కుట్రలు, కక్షలు పన్నే పెద్దలంతా ఫాసిస్టులు కావటానికి ఎక్కువకాలం పట్టదు. అప్పుడే వారు ఫాసిజం దోవలో పడ్డారు. వ్యతిరేకతను సహించలేకపోవటం, శాఖాతత్వాలపైన నాయకత్వాల్ని సృష్టించటం, ప్రజారక్షణ చట్టాల్ని ప్రవేశపెట్టటం, ఇవన్ని ఫాసిజానికే దారితీస్తాయి.

మహారత్నము

(10వ పేజీ తరువాయి)

మన పెద్దలు "అంభోధిః స్థలతాం, స్థలం జలధితాం ధూళీల వశ్శైలతాం, మేరు ర్మృత్కణతాం..." అని చెప్పినారు. ఇప్పటి ఖానునిస్థితి చూడగా మేరు పర్వతము నశించి నల్లిమంతటి చిన్నకణమొకటియే మిగిలినట్లున్నది—పున్నమి ఆకస్మికముగా అమావాస్యయైనది. కించిదవశిష్టముగా పూర్ణాబ్ధి శోషించినది.

దైవకృప కలిగినచో ఈ హాజారత్ వంశశేషము—ఈ ధూళీలవమే మహా పర్వతము కాగలదు. తప్పిజారి, పులినోటిలోని కండవలె బ్రతికి బైటపడిన ముకరాబ్‌ఖానుడే శుభశోభన ప్రాప్తి నొంది అధికారధూర్వహుడు, వంశకర్తయు కాగలడు. దైవసంకల్పమున కడ్డమేమున్నది?

9. పెండ్లికొడుకు, దండనాథుడునైన ముకరాబ్‌ఖాను

ఇట్లు బహువిధముల యోజించుచు, నీ ప్రాణావసర సమయమున హాజారత్ మహారత్నమున స్వాక్రాంతము చేసియైనను కన్యారత్నమును బడయ నిశ్చయించి ముకరాబ్‌ఖానుడు జాజిగుర్రము నెక్కి, ఘూల్ మర ప్రభుడు డోస్తు మహమ్మదును సందర్శింప నరిగెను.

డోస్తు మహమ్మదీ హాజారతు వంశమును, వంశస్థులను బహుకాలమునుండి యెఱుగును. మబ్బులేని పిడుగువలె నింతలో నీ కుటుంబమునకు తటస్థించిన ఘోరవిపత్తున కతడెంతో వగచి, మనఃపూర్వకమైన సానుభూతి తెలిపెను. వారిది బహు సాంప్రదాయకమైన వంశమగుట చేతను, కూతుల కన్న ఫలము తగిన వరుల కిచ్చి వివాహముచేయుటే యగుటచేతను, జాలేఖను ఖానున కిచ్చి వివాహము చేయుటకు సంతోషముతో నంగీకరించెను. హాజారత్ మహారత్నమునతను ఐదు లక్షల రూపాయిలకు డోస్తు సాహేబు ఖానునివద్ద వెలకు గొనెను.

బంధుమిత్రుల సమక్షమున నతడు తన ప్రియ పుత్రికను ఖానున కిచ్చి పెండ్లిచేసెను. మామగారిచ్చిన రత్నమూల్యము ఐదు లక్షల రూపాయిలతో వేయిమంది యాశ్వికులను గూర్చుకొని, ఆ యశ్వదళముతో ఖానుడు కాబూలున నున్న బాబరుతో చేరెను. వారందరును సన్నాహములు పూర్తిచేసుకొని ఖైబర్ కనుమ మీదుగా పిట్టపిడుగులవలె భరతభూమిపై వచ్చిపడిరి.

1526 సంవత్సరములో మొదటి పానిపట్ యుద్ధములోను, ఫతేపూర్ సిక్రీ యుద్ధములోను జయముగొని బాబర్ భరతభూమిలో మొగల్ సామ్రాజ్యము స్థాపించెను. మహారత్నము తుదకు మన కొంప తీసినది.

భరతభూమియొక్క భోగభాగ్యము లీటువంటి సాహసచరిత్రుల హస్తగతమగుట విధికృతము.

తాపు తిని తూలి బూరెల గంపపై బడె నన్న సామ్యము నిజము! కొంటె ముంజకొడుకు క్లయివుతో వేగలేక, చచ్చి విరగడైన చాలునని మద్రాసు పంపినారు! ఏ ఫోర్జరీలు చేసిరో, బుజ్జులు మార్చిరో వాడొక సామ్రాజ్యస్థాపకుడు కాలేదా?

దైవచర్య లతివిచిత్రములు!

యుగసంధి

(19-వ పేజీ తరువాయి)

జీవితాన్ని ఒకనిర్దుష్టమయిన పద్ధతిలో నడుపుకుంటారు వారు. ఇంక అందులో విచారానికి గాని, తోచకపోవడానికి గాని ... అటువంటి చెడ్డ ఉద్రేకాలకు తావు లేదు."

"అంత నిర్దుష్టంగా ఉన్నానని ... అంటే నా జీవితాన్ని అంత సక్రమంగా దిద్దుకున్నానని మీ రనుకుంటున్నారా?"

"నా అభిప్రాయం అదే. ఒక ఉదాహరణ: ఇంక కొద్దినిమిషాలలో పదిగంటలు కొడుతుంది గడియారం. ఇంక నన్ను మీరు అవతలకి తరిమివేస్తారని నాకు తెలుసును."

"యవ్‌గనీ వాసిలిచ్, లేదు. మిమ్మల్ని తరిమివెయ్యను. మీరు ఉండవచ్చు. ఆ కిటికీకొంచెం తెరవండి. ......ఊపిరి ఆనట్టుగా అనిపిస్తోంది."

బజరోవ్ లేచి కిటికీని గట్టిగా తోశాడు. పెద్ద చప్పుడుచేస్తో అది తెరుచుకుంది....... అంత సులువుగా తెరుచుకుంటుంది అని అతడు అనుకోలేదు; అదీగాక అతని చేతులు కణుకుతున్నాయి. మెత్తని చీకటిరాత్రి ఆ కిటికీలోనించి నల్లని ఆకాశపు కళ్ళతో ఆ గదిలోకి చూసింది; మెల్లని చెట్టుగలగలతో స్వచ్ఛమయిన, పరుచుకున్న కొత్త గాలియొక్క సువాసనతో.

"తెర ప్రక్కకి లాగి, ఇలా కూర్చోండి," అంది ఓడిన్‌స్టోవ్ సతి. "మీరు వెళ్ళిపోయే ముందు మీతో కొంచెం మాట్లాడాలి. మిమల్ని గురించి ఏమయినా చెప్పండి; మిమ్మల్నిగురించి మీ రెప్పుడూ మాట్లాడరు."

"ఆనా సర్గీవ్నా, అంతకంటే కుతూహలాన్ని కలిగించే విషయాల్నిగురించి మీతో మాట్లాడతాను."

"మీరు చాలా అణకువ చూపిస్తున్నారు... మిమ్మల్నిగురించి నాకు తెలుసుకోవాలని ఉంది, మీ కుటుంబాన్నిగురించి; మీనాన్నగారిని గురించి. వారికోసం మమ్మల్ని దిగవిడిచి వెళ్ళిపోతున్నారుగా."

"ఈమె ఎందుకిల్లా మాట్లాడుతుంది?" అని ఆలోచించాడు బజరోవ్.

"అవన్నీ అంత వినడానికి సరదాగా ఉండవు," అన్నాడు పైకి. "అందులో మీకు అసలే సరదాగా ఉండవు; మాది అంత పేరుకెక్కిన కుటుంబంకాదు."

"నాది భాగ్యవంతుల మనస్తత్వమని మీ యభిప్రాయమా?"

ఓడిన్‌స్టోవ్ వేపు బజరోవ్ కన్నులు ఎత్తి చూశాడు. "అవును," అన్నాడు అనవసరమైన తీక్ష్ణతతో.

ఆమె చిరునవ్వు నవ్వింది." మీకు నన్ను గురించి అట్టే తెలియదు. అందరుమనుష్యులూ ఒకలాగే ఉంటారని అంటారు పైగామీరు, వారిని ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరం లేదంటారు. నాజీవితాన్నిగురించి ఎప్పుడో మీకు చెపుతాను......ముందు మీజీవితాన్ని గురించి చెప్పండి."

"మిమ్మల్ని నే నాట్టేయెరుగను," అన్నాడు బజరోవ్, "బహుశా మీరు అన్నదే నిజమేమో. ప్రతీవ్యక్తి ఒకొక్క సమస్యయేమో. మీరు చూడండి. మీరు సమాజాన్నించి తప్పించుకు తిరుగుతారు, అది మిమ్మల్ని ఒత్తిడి చేస్తుంది. ఇద్దరు విద్యార్థుల్ని మీ యింటికి మీరు ఆహ్వానించారు. తరవాత, ఇంత తెలివితేట లుండి, ఇంత సౌందర్యం ఉండి, మీరు పల్లెపట్టుల్లో ఎందుకు ఉంటున్నారు?"

"ఏమిటి? ఏమి టన్నారు?" ఓడిన్‌స్టోవ్ సతి ఆదుర్దాగా అడిగింది. "ఇంతసౌందర్యం అనా?"

బజరోవ్ తిక్కగా అన్నాడు, "నే నన్నది అట్టే లక్ష్యపెట్టకండి, మీరు ఈ పల్లెపట్టుల్లో ఎందుకు ఉంటున్నారో నాకు తెలియడంలేదని నేను చెప్పదలుచుకున్నది."

"మీకు తెలియడంలేదు...కాని ఏదో ఒక కారణాన్ని ఊహించుకుని మీకు మీరు సమాధానం చెప్పుకుంటారుగా."

"ఆ......మీరు ఎప్పుడూ ఒకచోటే ఎందుకు ఉంటున్నారంటే, మీరు సుఖం మరిగారు. సులువుగా, సుఖంగా కాలం గడిచిపోతే మీకు సంతృప్తిగా ఉంటుంది. మీకు ఇతర విషయా లేవీ పట్టవు."

ఓడిన్‌స్టోవ్ సతి మళ్ళీ చిరునవ్వు నవ్వింది. "నాహృదయాన్ని వశపరచుకుని లాక్కుపోగలిగినది ఏదీ లే దని మీ అభిప్రాయమా?"

తన కనురెప్పలక్రిందనించి బజరోవ్ ఆమెను చూశాడు.

"బహుశా కుతూహలానికి కొంత లొంగుతారేమో. ఇంక యేదీ లేదు."

"నిజంగానా? చూశారా, అంచేతే మనకింత స్నేహం కుదిరింది. మీరూ నావంటివారే."

"మనకింత స్నేహంకుదిరింది......"బజరోవ్ గొంతుకలో ఊపిరి ఆడింది.

బజరోవ్ లేచాడు. దీపం అస్పష్టంగా వెలుగుతోంది, ఏకాంతంగా ఉన్న ఆ పెద్దగదిలో. అప్పుడప్పుడు గాలికి కిటికీతెర రెపరెప లాడుతోంది. అదృశ్యంగా ఆరాత్రియొక్క నవ్యత్వం ఆ గదిలోకి ప్రవహిస్తోంది; వింత రహస్యాలు అస్పష్టంగా చెవిలో ఊదుతోంది. ఓడిన్‌స్టోవ్ సతి శరీరంలో ఎక్కడా కదలిక లేదు; కాని క్రమంగా ఒక రహస్యావేగం ఆమెను ఆవహించింది. బజరోవ్‌లోకికూడా అది పాకింది. తను ఒక చక్కని సుందరితో ఏకాంతంగా ఉన్నట్టు చటుకుని తెలిసివచ్చింది.......

"ఎక్కడికి వెడుతున్నారు?" ఆమె మెల్లగా అంది. అతడు సమాధానం చెప్పలేదు, కుర్చీలో కూలబడ్డాడు.

"గారంగా పెరిగినందువల్ల సుఖం మరిగి చెడిపోయిన వ్యక్తినని మీ యభిప్రాయం," వెనకటికి గొంతుకతోనే ఆమె అంది, కిటికీ వేపు తదేకధ్యంతో చూస్తూ," "నాకుమాత్రం తెలుసు, నే నెంత హృదయమథనాన్ని అనుభవిస్తున్నానో."

"మీకా హృదయమథనం? ఎందుకు? అర్థంలేని ప్రవాదాలను మీరు లక్ష్యపెట్టరనుకుంటాను."

ఓడిన్‌స్టోవ్ సతి ముఖం ముడుచుకుంది. తన మాటలకి అతను అల్లాంటి అర్థాన్ని ఆపాదించడం ఆమెకు అసహనం కలిగించింది.

"ఆప్రవాదాలు అసలు నాబాహ్యదేహాన్నయినా అంటవు, యవ్‌గనీ వాసిలిచ్. ఇంక నా మనస్సు నెల్లా ఆందోళన పెడతాయి? నాహృదయంలో బాధ ఎందుకుందంటే...... నాకు వాంఛలు లేవు, జీవితాన్ని అనుభవించాలనే తహతహ లేదు. నన్ను చూస్తే మీకు వింతగా ఉంటుకది. నే నన్నమాట లన్నీ, చక్కని అల్లిక దుస్తులు ధరించిన ఒక భాగ్యవంతురాలు మెత్తని కుర్చీలో కూర్చుని అంటోందని మీ రనుకుంటారు. అది నేను కాదనను; నాకు సుఖం అంటే ఇష్టం, కాని నాకు బతకాలనే వాంఛ బహుకొద్ది. ఈ అసందర్భానికి మీరు ఏ అర్థం చెప్పుకున్నా సరే. కాని ఇదంతా మీదృష్టిలో కాల్పనికత."

బజరోవ్ తల ఊపాడు, "మీ ఆరోగ్యం మంచిది. మీకు ధనం ఉంది. స్వతంత్రులు. ఇంక మీకు ఏం కావాలి? ఏం కోరుకుంటారు మీరు?"

"ఏం కోరుకుంటాను!" ఓడిన్‌స్టోవ్ సతి నిట్టూర్చింది. "నేను చాలా అలసిపోయాను, పెద్దదాన్నయిపోయాను. ఎంతోకాలం అనవసరంగా బతికి ఉన్నట్టు నాకు అనిపిస్తోంది. అవును నేనుపెద్దదాన్నయిపోయాను," మెల్లగా దుస్తుయొక్క అల్లిక ముంజేతులమీదికి లాక్కుంటూ అంది. ఆమెచూపులు బజరోవ్ చూపులలోకలిశాయి, కొద్దిగా ఆమెముఖం ఎర్రబడింది, "నావెనుక అప్పుడే ఎన్నోస్మృతులున్నాయి. పీటర్స్‌బర్గులో నా జీవితం, మొదట ఉన్నసంపద, తరవాత పేదతనం, నాతండ్రిమరణం, పెళ్ళి, తరువాత దేశయాత్ర ......ఎన్నోస్మృతులు, కాని జ్ఞాపకం ఉంచుకోతగినది ఒకటీ లేదు. నాముందు, నాముందు—ఏదో పొడుగైన బాట, కాని గమ్యస్థానం ఏదీ లేదు......నాకు ఇక ముందుకి పోవాలని లేదు.

"మీకు ఆశాభంగం కలిగిందా?" అని ప్రశ్నించాడు బజరోవ్.

"లేదు. నన్ను అసంతృప్తి ఆవరించింది," ఓడిన్‌స్టోవ్ సతి జవాబు చెప్పింది, ప్రతి అక్షరాన్ని ఉచ్చరిస్తూ, "ఏదన్నా ఒక విషయంలో గట్టిగా కుతూహలం ఏర్పడి నట్టయితే......"

"మీకు ప్రేమించాలని ఉంది," బజరోవ్ సగంలో అన్నాడు, "కాని మీరు ప్రేమించలేరు; అదే మీ హృదయమథనానికి కారణం."

ఓడిన్‌స్టోవ్ సతి తన దుస్తుచివరఉన్న అల్లిక పరిశీలిస్తోంది.

"నేను ప్రేమించలే నన్నది నిజమేనా?"

"లేరని నేనంటాను. అది హృదయమథనానికి కారణ మనడం మాత్రం నాది పొరబాటు, నిజానికి అటువంటి అనర్థం ఎవరినయినా పట్టుకుంటే వారిని చూసి జాలిపడాలి."

"ఏ అనర్థం?"

"ప్రేమించడం," బజరోవ్ కోపంగా సమాధానం చెప్పాడు.

"నువ్వటువంటి చెలగాటాలు ఆడుతున్నావు," అనుకున్నాడతనలో, "నీకు కాలక్షేపం కావడంలేదు. నీకేమీ తోచక నన్నిలా బాధపెడుతున్నావు. నాకు మాత్రం......" అతని హృదయం చీలికలుగా చినిగి పోతున్నట్టు అతనికి అనిపించింది.

"అదీగాక, మీరు చాలాకావాలని కోరుకుంటారు," తన దేహాన్నంతనీ ముందుకు వంచి కుర్చీ మెత్తని వేళ్ళతో పరిశీలిస్తో అన్నాడు. "బహుశా, నాకు అంతా అయినా కావాలి, లేకపోతే ఏమీ అక్కరలేదు. జీవితానికి జీవితం. గ్రహించాలి. మీ జీవితం అర్పించాలి. మళ్ళీ తిరిగి పోకూడదు, పశ్చాత్తాపా లుండకూడదు. లేకపోతే అసలు ఏమీ వద్దు"

"సరే," బజరోవ్ అన్నాడు, "బాగానే ఉంది. కాని నాకు ఆశ్చర్యం ఏమంటే ఇంతవరకూ......మీకు కావలసింది ఏమిటో మీరు తెలుసుకోలేక పోయారు."

"దేనికోసమయినాగాని, తన సర్వస్వాన్ని అర్పించడం అసలు సాధ్యమవుతుందంటారా?"

"మీరు తటపటాయించినట్టయితే, దాన్నిగురించి తర్కించుకున్నట్టయితే, మీ కో విలువ ఉందని మీరు అనుకున్నట్టయితే—అంటే మీలో విశేషం ఉందని—అది సులభంకాదు. ఆలోచనలేకుండా తన్నుతాను అర్పించుకోడం సులభమే."

"తన కో విలువ ఉందని అనుకోకుండా ఉండడం ఎల్లాగ? నాకు ఏ విలువా లేకపోయినట్లయితే నా యనురాగం అసలు ఎవరికి కావాలి?"

"అదినాకు సంబంధంలేనివిషయం. నావిలువ ఏమిటో కనిపెట్టవలసిన విధి రెండోవారిది. ముఖ్యమైన దేమంటే, తన్నుతాను సమర్పించగలగడం."

ఓడిన్‌స్టోవ్ సతి తన కుర్చీలో ముందుకి వంగి కూర్చుంది. అంది, "ఇదంతా మీకు అనుభవమయినట్టు మాట్లాడుతున్నారు."

"ఆ విషయం వచ్చిందిగనక అన్నాను, ఆనా సర్గీవ్నా, అటువంటి వసలు నాకు ఉండ వని మీకు తెలుసునుగా."

"కాని మిమ్మల్ని మీరు సమర్పించుకోగలరా!"

"ఏమో తెలియదు, ఊరికే డంబాలు చెప్పడం నాకిష్టంలేదు."

ఓడిన్‌స్టోవ్ సతి ఏమీ మాట్లాడలేదు. బజరోవ్ కూడా ఇంకేమీ అనలేదు. ముందుసావిడిలోనించి పియానోవాద్యం వారికి వినబడుతోంది.

"కాట్యా ఇంతవరకూ ఇంకా పియానో వాయిస్తోందేం? అంది ఓడిన్‌స్టోవ్ సతి."

బజరోవ్ లేచాడు. "అవును చాలా పొద్దుపోయింది, మీకు నిద్రపోయేవే ళయింది"

"కొంచెం ఆగండి; తొందరేం!......మీతో ఒక మాట చెప్పాలి."

"ఏమి టది?"

"కొంచెం నే పుండండి", ఓడిన్‌స్టోవ్ సతి మెల్లగా అంది. ఆమె చూపులు బజరోవ్ మీద నిలిచాయి; అతన్ని పరిశీలిస్తున్నట్టుగా.

అతడు గదిలో ఇటూ ఆటూ నడిచాడు. చటుకుని ఆమెదగ్గరకు వెళ్ళి"శలవు" అన్నాడు. ఆమెకరస్పర్శ చేశాడు, అతని వేళ్లు ఆమె చేతిని గట్టిగా నొక్కినప్పుడు ఆమెకు బాధ పెట్టి, 'అమ్మా' అనబోయింది. అతను వెళ్లిపోయాడు. నలిగిన తన చేతివేళ్లను ఆమె పెదవులకు తాకించింది. వాటిమీద ఊదింది. చటుకుని ఉద్వేగంతో కుర్చీలోనించి లేచింది, గబగబ గుమ్మంవేపు నడిచింది, బజరోవ్‌ని ఆపడానికి లాగ...... సేవకురాలు ఒక వెండిపళ్ళెంలో మధుపాత్ర పెట్టుకుని గుమ్మంలో ప్రత్యక్షమయింది. ఓడిన్‌స్టోవ్ సతి నిశ్చలంగా నిలబడిఉంది. ఆ సేవకురాలిని పంపించివేసింది. మళ్లీ కూర్చీలో కూర్చుంది. ఆలోచనలో మునిగిపోయింది. ఆమె జుట్టు చెదిరి ఒక నల్లటిపాయ ఆమెభుజంమీద పడింది. చాలా సేపటివరకు ఆనా సర్గీవ్నా గదిలో దీపం వెలుగుతూనే ఉంది. చాలాసేపటివరకు ఆమె కదలకుండా అల్లాగే కూర్చుంది. అప్పుడప్పుడు మాత్రం చలిచేత చేతివరాలు లాగితే, రాసుకుంటోంది.


తరవాత రెండుగంటలకు తన గదికి బజరోవ్ తిరిగివచ్చాడు. అతని జోళ్లు మంచుతో తడిసిపోయాయి, జుట్టు చెదిరిపోయింది. చాలా చిరాకుగా ఉన్నాడు. ఆర్కాడీ బల్లదగ్గర పుస్తకం ఒకటి చేత్తో పట్టుకుని కూర్చుని ఉన్నాడు, మెడదాకా కోటుబొత్తములు పెట్టేసుకొన్నాడు.

"ఇంకా పడుకోలేదేం?" కొంచెం చిరాకును సూచించే గొంతుకతో బజరోవ్ అన్నాడు.


"ఈవేళ ఆనా సర్గీవ్నాతో చాలాసేపు గడిపినట్టున్నావు," ఆర్కాడీ అన్నాడు అతని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

"అవును. నువ్వు కాట్యా సర్గీవ్నాతో కలిసి పియానో వాయిస్తున్నంతసేపూ, నేను ఆనా సర్గీవ్నాతోనే ఉన్నాను."

"నేను వాయించలేదు......" ఆర్కాడీ అనబోయాడు; ఆగిపోయాడు. అతని కళ్లలోకి నీళ్లువస్తూన్నట్టు అతనికి అనిపించింది. తన స్నేహితుడి వెటకారంముందు తన కన్నీరు కనబడ్డం అతనికి ఇష్టంలేదు.



సభలకువచ్చిన ప్రతినిధులందరికీ, సభాస్థలి చెట్లనీడలో సంతర్పణభోజనాలు.




సభలలో మద్యనిషేధ సమావేశంలో ఉపన్యసిస్తున్న శ్రీమతి రామసుబ్బమ్మగారు.

కడప జిల్లా రాజకీయ సాంస్కృతిక మహాసభలు

[ముద్దునూరు]




సభలకు హాజరౌతున్న శ్రీ ప్రకాశంగారిని, అధ్యక్షులు, కార్యదర్శులు స్వాగతమిచ్చి తీసుకొస్తున్న దృశ్యం.




సమావేశాలలో పాల్గొన్న ప్రతినిధులు.



సాంస్కృతిక సమావేశంలో ప్రకాశంగారు ఉపన్యసిస్తున్నారు.



పతాకోత్సవం జరుపుతున్న శ్రీ కోటిరెడ్డిగారు. అధ్యక్షులు లక్ష్మారెడ్డిగారుకూడా పక్కనే ఉన్నారు.



సమావేశ ప్రారంభకులు, ప్రొఫెసర్ రంగా, అధ్యక్షులు శ్రీ ఆదినారాయణరెడ్డిగారు, తదితరులు ఉంటున్న దృశ్యం.

Regd No M 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G.T Madras.